శుక్రవారం
3-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 103
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బైడెన్ దేశద్రోహి: ఎలన్ మస్క్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను దేశద్రోహి అంటూ స్పేస్ ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ విమర్శించారు. బైడెన్ దేశ ద్రోహానికి పాల్పడినట్లు ఆరోపించారు. సరిహద్దులను రక్షించలేకపోవడం దేశద్రోహమే అని ఒకరు చేసిన ట్వీట్‌కు మస్క్ స్పందిస్తూ కచ్చితంగా అది దేశద్రోహమే అని పేర్కొన్నారు. అమెరికా, మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణం కోసం తెచ్చిన సామాగ్రిని అమ్ముకున్నట్లు బైడెన్‌పై మస్క్ విమర్శలు చేశారు. సరిహద్దుల భద్రతలో బైడెన్ విఫలమైనట్లు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ టంప్, రిపబ్లికన్లు విమర్శలు చేయడాన్ని ప్రస్తావించారు. సరిహద్దు గోడ నిర్మాణ సామాగ్రిని అమ్ముతున్నట్లు డిసెంబరులో వార్తలు రావడంతో బైడెన్ ప్రభుత్వంపై విమర్శలు వచ్చాయి.

గుకేశ్, మను బాకర్‌కు ఖేల్‌రత్న

- 32 మందికి అర్జున పురస్కారాలు
- ఇద్దరు తెలుగు క్రీడాకారులకు అర్జున అవార్డు

న్యూఢిల్లీ: భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 ఏడాదికిగాను నలుగురు క్రీడాకారులను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేసింది. చెస్ విభాగంలో డి.గుకేశ్, హాకీ విభాగంలో హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ విభాగంలో ప్రవీణ్ కుమార్, షూటింగ్ విభాగంలో మను బాకర్‌ను ఈ అవార్డులు వరించాయి. మరో 32 మందికి అర్జున, ఐదుగురిని ద్రోణాచార్య పురస్కారాలకు ఎంపిక చేశారు. అర్జున పురస్కారాలు

జ్యోతి యర్రాజీ

జీవాంజి దీప్తి

దక్కించుకున్నవారిలో 17 మంది పారా అథ్లెట్స్ ఉండటం విశేషం. అర్జున అవార్డులు అందుకున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఉన్నారు. విశాఖకు చెందిన రన్నర్ జ్యోతి యర్రాజీ, వరంగల్ జిల్లాకు

- మిగతా 2 లో

పోంజీ స్కామ్‌లో గిల్, సుదర్శన్‌కు సమన్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోంజీ కుంభకోణంసెగ క్రికెటర్లనూ తాకింది. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభమన్ గిల్‌తోపాటు సాయి సుదర్శన్, రాహుల్ తెవాతియా, మోహిత్ శర్మ వంటి వారు పెట్టుబడి పెట్టినట్లు బయటకొచ్చింది. బీజెడ్ గ్రూప్‌నకు చెందిన రూ.450 కోట్లకు సంబంధించి లావాదేవీలపై సీఐడీ ఆరా తీస్తోంది. గుజరాత్ క్రికెటర్లకు సమన్లు జారీ చేయనుంది. వారి నుంచి వివరాలు సేకరించిన అనంతరం తదుపరి

- మిగతా 2 లో

అమెరికా రక్షణ సంస్థలపై చైనా ఆంక్షలు

వాషింగ్టన్: అమెరికా రక్షణ సంస్థలపై చైనా ఆంక్షలు విధించింది. తైవాన్‌కు రక్షణ ఉత్పత్తులు విక్రయించిన కారణంగా అమెరికాకు చెందిన 10 సంస్థలను విశ్వసనీయత లేని కంపెనీల జాబితాలోకి చేర్చినట్లు చైనా వాణిజ్య శాఖ ప్రకటించింది. ఈ సంస్థలు ఇకపై చైనా కేంద్రంగా ఎగుమతులు, దిగుమతులు సాగించడం కుదరదని, పెట్టుబడులు పెట్టేందుకు వీలులేదని స్పష్టం చేసింది. ఆంక్షలకు గురైన సంస్థల సీనియర్ ప్రతినిధులు కూడా దేశంలోకి

- మిగతా 2 లో

సాగుదారుడికే రైతు భరోసా

5 నుంచి దరఖాస్తుల స్వీకరణ?
కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

విశాలాంధ్ర–హైదరాబాద్: రైతు భరోసాపై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం గురువారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితి పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించనున్నారు. ఈ నెల ఐదో తేదీ నుంచి ఏడో తేదీ వరకు దరఖాస్తులు తీసుకునే అవకాశముంది.

సంక్రాంతి తర్వాత రైతు భరోసాను చెల్లిస్తామన్న ప్రభుత్వం... నాలుగో తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు సభ్యులుగా ఏర్పాటైన ఉపసంఘం ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమై చర్చించింది.

కళాశాల ఘటనపై నివేదిక ఇవ్వండి

హైదరాబాద్ సీపీకి మహిళా కమిషన్ ఆదేశం

విశాలాంధ్ర–హైదరాబాద్: మేడ్చల్‌లోని కండ్లకోయ సీఎంఆర్ మహిళా కళాశాల వసతి గృహంలోని బాత్‌రూంలో దృశ్యాలను చిత్రీకరించారని బుధవారం విద్యార్థినులు ధర్నాకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మహిళా కమిషన్... విచారణకు ఆదేశించింది. వెంటనే నివేదిక ఇవ్వాలని గురువారం హైదరాబాద్ సీపీని ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇప్పటికే ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని వారి సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు పూర్తి చేసేదెప్పుడు?

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం ప్రశ్న
కేసు విచారణ 27కు వాయిదా

న్యూఢిల్లీ: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారించింది. ఈ వ్యవహారంలో తిరుపతన్న పాత్రపై దర్యాప్తు ఎప్పటికి పూర్తి చేస్తారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. సాగదీత సరికాదని, దర్యాప్తు కొనసాగింపు పేరుతో పిటిషనర్ స్వేచ్ఛను హరించవద్దని సూచించింది. విచారణ పూర్తి చేసేందుకు మరో నాలుగు నెలలు పడుతుందని న్యాయవాది చెప్పగా అది రాతపూర్వకంగా ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. ఇందుకు సమయం కావాలని లూథ్రా కోరారు. తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ ఈ కేసులో తిరుపతన్న ప్రధాన

- మిగతా 2 లో

మీకు ఇబ్బందేమిటి?

అదానీతో ఒప్పందాలపై మౌనమేల?

ప్రజలపై విద్యుత్ భారం కనిపించడం లేదా?
అమెరికా నివేదికతో పనేంటి?
రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై రామకృష్ణ ఆగ్రహం
మోదీ పర్యటనకు నిరసన తప్పదని హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: అదానీ కంపెనీలతో విద్యుత్ ఒప్పందాలపై జరిగిన అవినీతి వ్యవహారంపై అమెరికా ప్రభుత్వ తుది నివేదిక కోసం ఎదురు చూస్తున్నామంటూ సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన విడ్డూరంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తప్పుపట్టారు. 'ఈ కేసు నాకు లడ్డూ మాదిరిగా దొరికిందని మీరు అనుకోవచ్చు... కానీ నాకు విశ్వసనీయత ముఖ్యం. రేపు అమెరికా ప్రభుత్వం కాదంటే ఇబ్బందిపడాల్సి ఉంటుంది. అందుకే తుది నివేదిక కోసం ఎదురు చూస్తున్నా' అని సీఎం చంద్రబాబు చెప్పడం తగదని రామకృష్ణ అన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. సెకీతో ఒప్పందం జరగడం వల్ల అదానీ, గత ప్రభుత్వంలోని పెద్దలకు రూ.1750 కోట్ల లంచాలు ఇచ్చారన్న ఆరోపణలున్నాయని రామకృష్ణ పునరుద్ఘాటించారు. సీనియర్ సీఎంగా ఉన్న చంద్రబాబు...ప్రజలను, రాష్ట్రాన్ని

- మిగతా 2 లో

మాజీ సంపాదకుడు జయచంద్రన్ మృతి

కొచ్చి: మలయాళ మ్యాగజైన్ జర్నలిజంలో విప్లవం తెచ్చిన 'సమకాలిక మలయాళం' మాజీ సంపాదకుడు ఎస్.జయచంద్రన్ (85) కన్నుమూశారు. కర్నాటక రాజధాని బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు గురువారం రాత్రి బెంగళూరులో ముగిశాయి. ఆయనకు భార్య సరస్వతి, కుమార్తె దీపా, కుమారుడు జయదీప్ ఉన్నారు. జయచంద్రన్ కేరళ, తిరువనంతపురంలోని శ్రీ వరాహంలో జన్మించారు. 1957లో కౌముది వార్తాపత్రిక ద్వారా

- మిగతా 2 లో

పుస్తక పఠనంతోనే ఎదుగుదల

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఘనంగా విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభం

విశాలాంధ్ర–విజయవాడ: పుస్తకాలను చదవడం వల్లే తనకు జీవితంలో నిలబడే ధైర్యం ఒనగూడిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (వీబీఎఫ్ఎస్) అధ్వర్యంలో స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన 35వ విజయవాడ పుస్తక మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుస్తక మహోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదికపై ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "మా తల్లిదండ్రుల వల్ల పుస్తక పఠనం అలవాటైంది. రూ.కోటి ఇవ్వడానికి ఆలోచించను గానీ.. పుస్తకం ఇచ్చేందుకు మాత్రం ఆలోచిస్తా. పుస్తకం ఇవ్వాలంటే నా సంపద ఇచ్చినంత మథనపడతా. కొందరు పుస్తకాలు అడిగితే కొనిస్తా.. కానీ నా వద్ద ఉన్న పుస్తకాలు ఇవ్వను. పుస్తక పఠనం లేకపోతే జీవితంలో ఏమయ్యేవాడినో అనిపిస్తుంది. పుస్తకాలు ఉంటే ఉపాధ్యాయులు అవసరం లేదనిపించింది. ఇంటర్‌తోనే చదువు ఆపేసినా పుస్తకాలు చదవడం మాత్రం ఆపలేదు. ఇంటర్‌తోనే ఎందుకు ఆపేశానంటే చదవుకోలేక కాదు. మార్కులు తెచ్చుకోలేక కాదు. బాగా చదివేవాడిని. నేను కోరుకుంటున్న చదువు పుస్తకాల్లో లేదు. క్లాస్ రూమ్‌లో లేదు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండి నేర్చుకున్నారని విన్నాను. ఆయన ప్రేరణతో నేను కూడా అదే బాటలో నడవాలనుకున్నా" అని పవన్ కల్యాణ్ అన్నారు. తెలుగును నిర్లక్ష్యం చేయకుండా నేర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఆంగ్లం అవసరమేగాని పేదరికం పారదోలటానికి అది మార్గం కాదన్నారు. అందరూ ఆంగ్లమే మాట్లాడే ఇంగ్లండ్‌లో కూడా పేదరికం ఉందని ఆయన గుర్తుచేశారు. సినిమానటులు, పేరుప్రఖ్యాతులున్న వ్యక్తులనే కాకుండా రచయితల్ని, చదువుకున్నవారిని గౌరవించడం, వారి సూచనలు ఆచరించడం నేర్చుకోవాలని తన అభిమానులకు సూచించారు. ఈసందర్భంగా కృష్ణారావు రాసిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని పవన్ ఆవిష్కరించారు. ఈనాడు సంపాదకులు ఎం.నాగేశ్వరరావు రామోజీరావు స్మారక ఉపన్యాయం చేస్తూ... 'రామోజీరావు పేరు ఈ వేదికకు పెట్టడం అత్యంత సముచితం. పుస్తకాన్ని, అక్షరాన్ని అమితంగా ప్రేమించిన వ్యక్తి ఆయన. 50 ఏళ్లపాటు అక్షర తపస్సు చేసి 2024లో వెళ్లిపోయారు. ఆయన స్మృతిలో వేదికకు నామకరణం చేయడం అభినందనీయం' అన్నారు. ప్రపంచంలోని శక్తివంతులందరిలాగే రామోజీరావుగారు కూడా మంచి చదువరి అని వివరించారు. విద్యార్థులు పుస్తక మహోత్సవం ద్వారా తమకు దక్కిన అవకాశాన్ని ఉపయోగించుకుని మంచిపుస్తకాలతో సాన్నిహిత్యం పెంచుకోవాలన్నారు. చదువు సంస్కృతిలో భాగమని, మనందరిని సంస్కృతి నడిపిస్తుందని చెప్పారు. కేంద్రసాహిత్య అకాడమీ సభ్యులు, విజయవాడ పుస్తక మహోత్సవసంఘం ప్రముఖులు ఎమెస్కో విజయకుమార్ సభను నిర్వహించారు. గ్రంథాలయాలను విద్యాశాఖ నుండి సాంస్కృతిశాఖ పరిధిలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రసాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తకాలు కొని చదివే అలవాటు అందరూ పెంచుకోవాలన్నారు. వీబీఎఫ్ఎస్ కార్యదర్శి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ... జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక మహోత్సవం కొనసాగుతుందని తెలిపారు. ఈ ఏడాది 270 స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. పుస్తకమహోత్సవ నిర్వహణకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇక నుంచి మీరు చేసే అక్రమవ్యాపారాల్లో నా పేరు తీసేసి మీ అమ్మగారి పేరు పెట్టండి!

రైతునేత ఆరోగ్యమే ముఖ్యం

దలేవాల్ దీక్ష విరమణపై తప్పుడు ప్రచారం
పంజాబ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ: రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ నిరాహార దీక్షను బలవంతంగా విరమింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ పంజాబ్ ప్రభుత్వ అధికారులు మీడియా ద్వారా తప్పుడు అభిప్రాయాన్ని సృష్టిస్తున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దల్లేవాల్ నిరసనను ముగించాలని తామెప్పుడూ ఆదేశించలేదని, అయితే ఆయన ఆరోగ్యం గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నామని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రైతుల నిరసనల గురించి కొంతమంది ప్రభుత్వం అధికారులతో

- మిగతా 2 లో

అసద్‌పై రష్యాలో విష ప్రయోగం?

వాషింగ్టన్: సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌పై రష్యాలో విష ప్రయోగం జరిగినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. సిరియాలో అంతర్యుద్ధం కారణంగా అధికార పగ్గాల నుంచి తప్పుకొన్న అసద్ ఆ దేశాన్ని వదిలి వెళ్లిపోయారు. రష్యాలో ఆశ్రయం పొందుతున్నారు. ఈ క్రమంలో ఆయనపై విష ప్రయోగం జరిగినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అసద్ ఆరోగ్యం క్షీణించిందని, విపరీతమైన దగ్గుతో, ఊపిరి తీసుకోలేక ఆయన ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నాయి. వైద్య పరీక్షల్లో విష పదార్థాల ఆనవాళ్లు కనిపించినట్లు సమాచారం.

అసభ్య పోస్టులు పెట్టడమే మీ పనా?

బోరుగడ్డ అనిల్‌పై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
బెయిల్ పిటిషన్ కొట్టివేత

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నిందితుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారా? అని

- మిగతా 2 లో

సీపీఐకి బ్రిటిష్ కమ్యూనిస్టుల అండ





కమ్యూనిస్టు పార్టీ ఏర్పడ్డ తరవాత ఎ.ఐ.టి.యు.సి. సమరశీల పోరాటాలు కొనసాగించడంతో వలస పాలకులు బెంబేలెత్తి పోయారు. అదే సమయంలో బ్రిటిష్ కమ్యూనిస్టు నాయకుల మద్దతు భారత కమ్యూనిస్టు పార్టీకి సమకూరింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

క్యూబా విప్లవం 66వ విజయోత్సవం

వీరులకు, కమ్యూనిస్టు పార్టీకి యూరోపియన్ కమ్యూనిస్టు యాక్షన్ సెల్యూట్

హవానా: అమెరికాలో జరిగిన తొలి సోషలిస్టు విప్లవం 'క్యూబా విప్లవం' 66వ విజయోత్సవాన్ని పురస్కరించుకొని క్యూబా వీరులకు, కమ్యూనిస్టు పార్టీకి యూరోపియన్ కమ్యూనిస్టు యాక్షన్ విప్లవాభినందనలు తెలిపింది. వీరులకు, కమ్యూనిస్టు పార్టీకి సెల్యూట్ అంటూ ప్రకటన చేసింది. 'నాటి పెట్టుబడిదారీ నిరంకుశత్వానికి ముగింపు పలికిన క్యూబా విప్లవం ప్రపంచ శ్రామిక ప్రజలకు స్ఫూర్తి. పరిమిత వనరులు ఉన్నప్పటికీ క్యూబా ధైర్యం కోల్పోలేదు. సాహసోపేత నిర్ణయాలలో ముందుకెళ్లింది. వైద్యం, శాస్త్రీయత, తదితర రంగాల్లో అంతర్జాతీయ సమాజానికి ఎనలేని సేవలు అందించింది. ఆదర్శకంగా నిలిచింది' అని ప్రకటన ప్రేర్కొంది. ఫిడెల్ కాస్ట్రో, క్యూబా కమ్యూనిస్టు పార్టీ చారిత్రక వారసత్వం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని గుర్తుచేసింది. క్యూబా అంతర్గత వ్యవహారాల్లో జోక్యమే లక్ష్యంగా ఆ దేశంలో రాజకీయ అస్థిరత, సార్వభౌమత్వానికి విఘాతం కలిగించేందుకు ప్రపంచ దేశాలకు పక్కదోవ పట్టించేలా సామాజిక మాధ్యమాల్లో, మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించింది. క్యూబాకు సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించింది. తమ బంధాన్ని మరింత పటిష్ఠపర్చుకుంటామని పేర్కొంది. క్యూబా విప్లవం వర్ధిల్లాలని నినాదమిచ్చింది.

చివరి వరకు పోరాడుతా: యూన్

సియోల్: దేశ సార్వభౌమత్వానికి విఘాతం కలిగించే శక్తులపై చివరి వరకు పోరాడతానంటూ దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ప్రతిజ్ఞబూనారు. ఈనెల 6లోగా యూన్ అరెస్టుకు దర్యాప్తు అధికారులు సిద్ధమైన క్రమంలో ఆయనపై విచారణకు నిరసన తెలిపేందుకు వందల మంది అధ్యక్షుడి అధికారిక నివాసం వద్దకు చేరుకున్నారు. తన మద్దతుదారులనుద్దేశించి యూన్ ఒక ప్రకటన చేశారు. 'మీరు పడుతున్న కష్టం గురించి యూట్యూబ్ ద్వారా తెలుసుకుంటున్నా. ఈ దేశాన్ని పరిరక్షించేందుకు మీతో కలిసి చివరి వరకు పోరాడతాను' అని పేర్కొన్నారు. యూన్ లేఖ ప్రతినిని ఆయన తరఫున న్యాయవాది సియోక్ డాంగ్ హేయిన్ మీడియాకు విడుదల చేశారు. యూన్‌ను అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పబోవంటూ ఆయన తరఫు న్యాయ బృందం హెచ్చరించింది. కాగా, మార్షల్ లా అమలు చేసి యూన్ చిక్కుల్లో పడ్డారు. ఈ వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతోంది. న్యాయవాదులతో పాటు పోలీసు, రక్షణ, అవినీతి నిరోధక శాఖల అధికారుల బృందం విచారణను యూన్ ఎదుర్కొంటున్నారు. అయితే విచారణకు రావాలన్న ఆదేశాలను ధిక్కరించారు. మూడు సార్లు పిలిచినా వెళ్లలేదు. దీంతో ఆయన అరెస్టు వారెంటు జారీ అయింది. ఇదిలావుంటే యూన్‌ను తప్పించాలా, కొనసాగించాలా అన్న అంశాన్ని రాజ్యాంగ కోర్టు 180 రోజుల్లోపు తీర్పు ఇవ్వాల్సి ఉంది. దక్షిణ కొరియా అధ్యక్ష పదవి నుంచి వైదొలిగేందుకు యూన్ సిద్ధమని సీనియర్ సలహాదారులు, కార్యదర్శులు చెబుతున్నారు.

జాతిపితగా ముజిబుర్ పేరు తొలగింపు

పాఠ్యపుస్తకాల్లో మారుతున్న బంగ్లాదేశ్ చరిత్ర

ఢాకా: బంగ్లాదేశ్‌లో బంగబంధు ముజిబుర్ రెహ్మాన్ ప్రాధాన్యత తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. చరిత్రను మార్చివేసేలా పాఠ్యపుస్తకాలను సవరిస్తున్నారు. జాతి పితగా ముజిబుర్ రహ్మాన్ పేరును తొలగించారు. గతంలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో పాలక ప్రభుత్వాన్ని బట్టి స్వాతంత్ర్య ప్రకటన అంశంలో మార్పులు చోటుచేసుకొన్నాయి. 1971 మార్చి 26న జియావుర్ రెహ్మాన్ స్వాతంత్ర్య ప్రకటన చేశారని... మార్చి 27న ఆయనే బంగబంధు ముజిబుర్ రెహ్మాన్ తరఫున ఇలాంటి ప్రకటన వెలువరించినట్లు ప్రస్తుతం సవరించారు. జనవరి 1 నుంచి ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో పంపిణీ చేయడం మొదలుపెట్టారు. ఈ పరిణామాలపై నేషనల్ కరికులమ్ టెక్స్ట్ బుక్ బోర్డ్ ప్రొఫెసర్ ఏకేఎం రియాజుల్ హసేన్ స్పందిస్తూ కొత్త పుస్తకాలు 2025 కోసం సిద్ధం చేశామని చెప్పారు. పరిశోధకుడు రాహా ఈ సమాచారాన్ని సమకూర్చారు. ఆయన మాట్లాడుతూ ముజిబుర్ రెహ్మాన్ గురించి అతిశయోక్తులు, బలవంతంగా రుద్దిన చరిత్ర ఉందన్నారు. 'పాక్ సైన్యం వద్ద బందీగా ఉన్న సమయంలో షేక్ ముజిబుర్ రెహ్మాన్ వైర్‌లెస్ సెట్ ద్వారా స్వాతంత్ర్య ప్రకటన చేసినట్లు పేర్కొనడంలో వాస్తవాలు లేనందుకే దానిని మార్చాం' అని వెల్లడించారు. అవామీ లీగ్ మద్దతుదారులు మాత్రం ముజిబుర్ రహ్మాన్ నాటి మేజర్ జియావుర్ రహ్మాన్‌తో కలిసి ఈ ప్రకటన చేసినట్లు నమ్ముతారు. బీఎన్‌పీ పార్టీ మాత్రం జియావుర్ స్వయంగా ఈ ప్రకటన చేసినట్లు వాదిస్తుంది.

గుకేశ్, మను బాకర్‌కు ఖేల్‌రత్న

(మొదటిపేజీ తరువాయి)

చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తి ఎంపికయ్యారు. జనవరి 17న ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వారు పురస్కారాలను అందుకుంటారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. స్వాతంత్ర్యం అనంతరం ఒకే ఒలింపిక్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా మను బాకర్ ఘనత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ వ్యక్తిగత విభాగంతోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యాలను సొంతం చేసుకుంది. తొలి జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. తాజా జాబితాలో పేరు ఉండటంతో క్రీడాభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన గుకేశ్‌ను ఖేల్‌రత్న అవార్డు వరించింది. ఫైనల్‌లో చైనా క్రీడాకారుడిపై అద్భుత విజయంతో ఛాంపియన్‌గా నిలిచాడు. ఒలింపిక్స్‌లో వరుసగా భారత్ రెండో పతకం సాధించడంలో హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. పారాలింపిక్స్‌లో ప్రవీణ్ కుమార్ హై జంప్ విభాగంలో బంగారు పతకం సాధించాడు.

అర్జున అవార్డు గ్రహీతలు

అర్జున అవార్డు సాధించిన వారిలో జ్యోతి యర్రాజి (అథ్లెటిక్స్), అన్ను రాణి (అథ్లెటిక్స్), నీతు (బాక్సింగ్), స్వీటీ బురా (బాక్సింగ్), వంతిక అగర్వాల్ (చెస్), సలీమా (హాకీ), అభిషేక్ (హాకీ), సంజయ్ (హాకీ), జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), సుఖ్‌జీత్ సింగ్ (హాకీ), స్వప్నిల్ సురేశ్ కుసాలే (షూటింగ్), సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), అమన్ (రెజ్లింగ్), రాకేశ్ కుమార్ (పారా ఆర్చరీ), ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్), జీవాంజి దీప్తి (పారా అథ్లెటిక్స్), అజీత్‌సింగ్ (పారా అథ్లెటిక్స్), సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్), ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్), హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్), సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్), నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్), తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్), నిత్య శ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్), మనీశా రాం దాస్ (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జూడో), మోనా అగర్వాల్ (పారా షూటింగ్), రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్) ఉన్నారు. అలాగే, అర్జున అవార్డ్స్ (లైఫ్‌టైమ్)ను సుచా సింగ్ (అథ్లెటిక్స్), మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్) దక్కించుకున్నారు. ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు) పొందిన వారిలో సుభాశ్ రాణా (పారా షూటింగ్), దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ సంగ్వాన్ (హాకీ) ఉన్నారు. లైఫ్‌టైం కేటగిరీలో మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్‌బాల్) ఉన్నారు.

పోరాట యోధుడు బర్ధన్

వర్ధంతి సభలో రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: శ్రమజీవుల హక్కుల కోసం పోరాడిన యోధుడు, మార్క్సిస్టు మేధావి ఏబీ బర్ధన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. బర్ధన్ తొమ్మిద వర్ధంతి హనుమాన్‌పేట పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ ... బర్ధన్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిన్నవయసులోనే వామపక్ష భావజాలం వైపు ఆకర్షితులైన బర్ధన్... ఏఐఎస్‌ఎఫ్ నేతగా విద్యార్థి ఉద్యమంలోకి వచ్చారని, నాగపూర్ శాసనసభ్యుడిగా ఎన్నికై పేదల పక్షాన నిలిచారని అన్నారు. సంపన్న కుటుంబంలో జన్మించిన బర్ధన్ పేదల కోసమే పోరాడారన్నారు. విద్యార్థి నాయకుడిగా... అనంతరం ఏఐటీయూసీ నేతగా అనేక కార్మిక సంఘాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారన్నారు. కార్మికుల హక్కుల కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. అనంతరం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారని, కమ్యూనిస్టు పార్టీల ఐక్యతకై తన వంతు కృషి చేశారని వివరించారు. జాతీయ కార్యదర్శిగా... నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్టీలకే కాకుండా అన్ని పార్టీల వారికి సలహాలు, సూచనలు ఇస్తూ ఒక దిక్సూచికగా ప్రభుత్వానికి సహకరించారని అన్నారు. చనిపోయే వరకు పార్టీ కేంద్ర కార్యాలయమైన అజయ్ భవన్‌లోనే నివాసం ఉన్నారన్నారు. సాధారణ జీవితం గడిపారన్నారు. స్ఫూర్తి ప్రదాత, నిరాడంబరుడు బర్ధన్... నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం అన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని, సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, కె.వి.భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, అప్పరబోతు రాము, కొట్టు రమణారావు, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బయ్య, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జాన్సన్ బాబు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్, ఎం.సాయి కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్ పాల్గొన్నారు.

రైతునేత ఆరోగ్యమే ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)

పాటు కొందరు రైతు నాయకులు బాధ్యతా రహితమైన ప్రకటనలు చేస్తున్నారని, ఇది పరిస్థితిని క్లిష్టతరం చేస్తుందని సుప్రీం కోర్టు పంజాబ్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. దలేవాల్ నిరాహార దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ కొంతమంది పంజాబ్ ప్రభుత్వ అధికారులు, రైతు నాయకులు మీడియాలో తప్పుడు అభిప్రాయాన్ని సృష్టిస్తున్నారని న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దలేవాల్ నిరసనను విచ్ఛిన్నం చేయమని కోర్టు ఎప్పుడూ ఆదేశించలేదని స్పష్టం చేయాల్సిన అవసరముందని పంజాబ్ ప్రభుత్వానికి తెలిపింది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసేందుకు పంజాబ్ ప్రభుత్వ అధికారులు, కొందరు రైతు నాయకులు మీడియా ద్వారా బాధ్యతారాహిత్య ప్రకటనలు చేస్తున్నట్టు కనిపిస్తోందని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ మాట్లాడుతూ... దలేవాల్ నిరాహార దీక్ష విరమించకుండా వైద్య సహాయం తీసుకునేలా ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఈ విషయంలో విచారణకు వర్చువల్‌గా హాజరవుతున్నందు కోర్టు సందేశం ప్రభుత్వానికి వెళుతుందని ఆశిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. దలేవాల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి మార్చాలని పంజాబ్ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ డిసెంబర్ 20న కోర్టు ఇచ్చిన ఉత్తర్వుకు అనుగుణంగా తమ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని అధికారులిద్దరూ ధర్మాసనం కోరింది. తదుపరి విచారణను జనవరి 6వ తేదీకి వాయిదా వేసింది. వ్యవసాయ చట్టాలు రద్దు చేసిన తర్వాత పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధ హామీతో సహా రైతులకు ఇచ్చిన ఇతర హామీలను నెరవేర్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దలేవాల్ తరఫున దాఖలైన తాజా పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

దర్యాప్తు పూర్తి చేసేదెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

నిందితుడన్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఆయన కీలకంగా వ్యవహరించారన్నారు. ఆధారాలు చెరిపేయడంలోనూ కీలకంగా ఉన్నారన్నారు. 2023, డిసెంబరు 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేశారని లూథ్రా చెప్పారు. తిరుపతన్న పాత్రపై ఇప్పటికే చార్జిషీట్ దాఖలైందని ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ దవే కోర్టుకు తెలిపారు. తొమ్మిది నెలలుగా జైలులో ఉన్నారని, తప్పనిసరైతేనే జైలులో ఉంచాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పులిచ్చిందని ప్రస్తావించారు. బెయిల్ పొందడం హక్కు అని చెప్పారు.

పోంజీ స్కామ్‌లో గిల్, సుదర్శన్‌కు సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోనుంది. బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామని ప్రజలను మోసం చేసి రూ.6 వేల కోట్లను సేకరించిన బీజెడ్ గ్రూప్ సీఈవో భూపేంద్ర సింగ్ ఝలాను గుజరాత్ సీఐడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. శుభ్‌మన్ గిల్ రూ.1.95 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు అహ్మదాబాద్ మిర్రర్ పేర్కొంది. మిగతా క్రికెటర్లు తక్కువ మొత్తా ల్లో పెట్టుబడులు పెట్టినట్లు తెలిపింది. గిల్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు. భారత్‌కు తిరిగి వచ్చాక ఆయనను విచారించే అవకాశం ఉంది. బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ రేటు ఇస్తామని బీజెడ్ గ్రూపు సీఈవో భూపేంద్ర సింగ్ నమ్మించారు. ఈ సంస్థ పనితీరుపై అనుమానంతో కొందరు మూడు నెలల కిందట సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కుంభకోణం వెలుగు చూసింది. ఇప్పటివరకు సంస్థకు చెందిన 10 మందికిపైగా ఏజెంట్లను అధికారులు అరెస్టు చేశారు. ఫైనాన్షియల్ సర్వీస్ సంస్థకు చెందిన గుజరాత్‌లోని గాంధీనగర్, ఆరావళి, సబర్‌కాంత, మెహసానా, వడోదరలోని కార్యాలయాలపై దర్యాప్తు అధికారులు దాడులు చేశారు. విలాసవంతమైన కార్లు, భవనాలను అక్రమ సంపాదన ద్వారా నిందితుడు కొనుగోలు చేసినట్లు, వివిధ విద్యాసంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు అధికారులు గుర్తించారు.

జూన్‌లో తల్లికి వందనం

అమరావతిలో రూ.2,733 కోట్ల పనులకు గ్రీన్‌సిగ్నల్

ఏపీ మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. సూపర్ సిక్స్ హామీల్లో ఇదో కీలక పథకం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూన్ నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తుండగా... దీని అమలు వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ పథకం అమలుపై స్పష్టత ఇచ్చింది. తల్లికి వందనం పథకాన్ని 2025-26 విద్యాసంవత్సరం నుంచి అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. మరో కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం కింద రైతన్నకు సహాయం చేసే అంశంపై మంత్రివర్గం స్పష్టతనిచ్చింది. కేంద్రం ఎప్పుడైతే రైతు భరోసాను విడుదల చేస్తుందో అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటాను రైతు భరోసా పథకం కింద ఇవ్వాలని తీర్మానించింది. మత్స్యకారులకు గత ప్రభుత్వం రూ.10 వేలు మాత్రమే ఇవ్వగా... ఎన్నికల హామీల్లో భాగంగా ఇకపై వారికి రూ.20 వేల చొప్పున ఏప్రిల్‌లో అందజేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మెగా డీఎస్సీ ద్వారా ప్రకటించిన 16,500 పోస్టులను వచ్చే విద్యా సంవత్సరానికల్లా భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని తీర్మానం చేసింది. మొత్తం 14 అంశాలపై చర్చించి... తీసుకున్న కీలక నిర్ణయాలను రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణశాఖమంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.

- తిరుపతిలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిని 50 పడకల నుండి 100 పడకలకు రూ.7,44,08,373 అంచనా వ్యయంతో అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా అవసరమైన 191 మంది వైద్య, పారా మెడికల్ సిబ్బంది పోస్టులు భర్తీ చేయనున్నారు.
- రాజధాని అమరావతిలో రూ.2,723.02 కోట్ల విలువైన రెండు ఇంజినీరింగ్ పనులకు మంత్రి మండలి ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ చట్టం 2016కు సవరణల ముసాయిదా ఆర్డినెన్స్ ఆమోదం.

అమెరికా రక్షణ సంస్థలపై చైనా ఆంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

రాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపింది.ఆంక్షలు విధించిన కంపెనీలలో లాక్‌హీడ్ మార్టిన్, రేథియాన్, జనరల్ డైనమిక్స్ వంటి ప్రముఖ సంస్థలున్నాయి. తైవాన్ తమ దేశంలో అంతర్భాగమని బీజింగ్ ఎప్పటినుంచో చెబుతోంది. గతేడాది మేలో తైవాన్ అధ్యక్షుడిగా లాయ్ చింగ్ తె ఎన్నికైన తర్వాత ఆ దేశ ప్రాదేశిక జలాల్లో చైనా ఇప్పటివరకు మూడుసార్లు భారీ సైనిక విన్యాసాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో తైవాన్‌కు 571.3 మిలియన్ డాలర్ల రక్షణ సాయంతో పాటు 265 మిలియన్ డాలర్ల విలువైన మిలటరీ ఆయుధాలను విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. ఈ పరిణామం చైనాకు కోపం తెప్పించింది. దీంతో తమ దేశంలోని అమెరికా సంస్థలపై ఆంక్షలు విధిస్తోంది.

అసభ్య పోస్టులు పెట్టడమే మీ పనా?

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. ఇలాంటి వారిని క్షమించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో బోరుగడ్డ అనిల్‌పై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకోగా, దీనిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం అతడి పిటిషన్‌ను కొట్టివేసింది. విచారణలో పిటిషనర్ బోరుగడ్డ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారా? అంటూ న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. అనిల్‌కు పూర్వ నేర చరిత్ర ఉందని, అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో నమోదైన కేసుల్లో ఇప్పటికే రెండు కేసుల్లో ఛార్జ్ షీట్ సైతం దాఖలు అయిందని హైకోర్టుకు ప్రాసిక్యూషన్ తెలిపారు. ఈ కేసుల్లో బీఎన్‌ఎస్ సెక్షన్ 111 వర్తిస్తుందని ఆయన ధర్మాసనానికి వివరించారు. అనిల్... బెదిరింపులకు పాల్పడే విధానం, సోషల్ మీడియాలో వాడే అసభ్యపదజాలం ఎంత జుగుప్సాకరంగా ఉంటుందో ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఆయన వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి, ఇలాంటి కేసుల్లో నిందితులను క్షమించడానికి వీల్లేదని అభిప్రాయపడ్డారు. బోరుగడ్డ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు.

పుస్తక పఠనంతోనే ఎదుగుదల

(మొదటిపేజీ తరువాయి)

సహకరించాలని పౌరసమాజానికి విజ్ఞప్తి చేశారు. పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షులు కె. లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి పిడికిటి రామకోటేశ్వరరావు, ప్రధాన సాహిత్య వేదికకు రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు, విద్యార్థుల కార్యక్రమాలు నిర్వహించే ప్రతిభా వేదికకు రతన్‌టాటా పేర్లు పెట్టినటు వెల్లడించారు.

పుస్తక మహోత్సవంలో రెండవరోజు (శుక్రవారం) కార్యక్రమాలు

- సాయంత్రం 5గంటలకు నార్ల చిరంజీవి సంస్మరణ సభ- సభాధ్యక్షులు శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు
- సాయంత్రం 6గంటకు కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో దక్షిణ - పశ్చిమ కవి సమ్మేళనం...ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, గుజరాతీ, కన్నడ, కొంకణి, మళయాళం, మరాఠీ, సింధీ, తమిళం, తెలుగు భాషల కవులు పాల్గొంటారు.

బీహార్ గవర్నర్‌గా ఆరిఫ్ ప్రమాణస్వీకారం

పాట్నా: బీహార్ గవర్నర్‌గా ఆరిఫ్ ముహమ్మద్ ఖాన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్... ఆరిఫ్ ఖాన్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో ఎలాంటి ఆర్భాటం లేకుండా కార్యక్రమం జరిగింది.

మాజీ సంపాదకుడు జయచంద్రన్ మృతి

(మొదటిపేజీ తరువాయి)

జర్నలిస్టుగా కెరీర్ ప్రారంభించారు. 1975లో సాహిత్య-సాంస్కృతిక మ్యాగజైన్ కళా కౌముది సంపాదక బాధ్యతలు చేపట్టారు. ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అనుబంధ సమకాలిక మలాయాళం ఎడిటర్‌గా 1997 నుంచి 2013 వరకు జయచంద్రన్ పనిచేశారు. ఎన్నో అవార్డులు అందుకున్నారు.

మీకు ఇబ్బందేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

దృష్టిలో ఉంచుకుని ఆలోచించకుండా ఎంతసేపూ మాజీ సీఎం జగన్‌ను లక్ష్యంగా పెట్టుకుని ఆరోపించడాన్ని రామకృష్ణ తప్పుపట్టారు. జగన్‌ను అరెస్టు చేయడం ఇక్కడ ముఖ్యం కాదని... అసలు సమస్య ఏమిటంటే 2021లో సెకీతో 7వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నారని గుర్తుచేశారు. ఇదే సోలార్ ఒప్పందాన్ని గుజరాత్ ప్రభుత్వం ఎన్టీపీసీతో చేసుకుందని, అక్కడి ప్రభుత్వం యూనిట్ ఒక్కింటికి రూ.1.99 పైసలకు చేసుకుంటే... ఇక్కడ రూ.2.49పైసలకు చేసుకున్నారని, అదీ 25 ఏళ్లపాటు ఒప్పందమని వివరించారు. దీనివల్ల దాదాపు రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులపై రానున్న 25 ఏళ్లలో లక్షా 10 వేల కోట్ల రూపాయల విద్యుత్ భారం అదనంగా పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై పడుతున్న భారం తగ్గించడం, రాష్ట్ర ప్రయోజనాలపై చంద్రబాబు మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. విద్యుత్ భారం తగ్గించడంపై నిర్ణయం తీసుకోకుండా జగన్ లడ్డూ మాదిరిగా దొరికారంటూ ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యానించడం తగదని, దీనిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నట్లు రామకృష్ణ చెప్పారు. సోలార్ విద్యుత్‌ను రాజస్థాన్ ప్రభుత్వం ఉత్పత్తి చేస్తోండడం వల్ల అక్కడి ప్రభుత్వానికి రూ.8 వేల కోట్లు పన్నుల రూపంలో వస్తున్నాయని వివరించారు. ఉద్యోగ, ఉపాధి కల్పన ఉందని, భూములిచ్చిన రైతులకు 30 ఏళ్లపాటు లీజు ఒప్పందం ఉంటుందన్నారు. మన రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే, దానిపై సీఎం ఎందుకు మాట్లాడటం లేదని రామకృష్ణ ప్రశ్నించారు. సోలార్ వల్ల అమెరికా ప్రభుత్వానికి ఏమైనా నష్టమా? అమెరికాలో ఉన్న కంపెనీలు దివాలా తీస్తాయా? అమెరికా ప్రజలపై భారం పడుతుందా? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఆలోచించడం లేదని, జగన్‌ను ప్రత్యర్థిగానే చూస్తున్నారని... ఇంత దిగజారి వ్యాఖ్యలు చేయడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా అదానీతో చేసుకున్న ఒప్పందాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అప్పనంగా అదానీకి అప్పగించారన్నారు. పొరుగునున్న తమిళనాడు సీఎం స్టాలిన్... అదానీతో జరిగిన ఒప్పందాలను రద్దుచేశారని, ఈ విషయంలో స్టాలిన్‌ను అభినందిస్తున్నామని రామకృష్ణ పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వ నివేదిక కోసం ఎదురుచూస్తే... ఇక్కడ పోలీసు విభాగం ఎందుకు?, మీ ప్రభుత్వం ఎందుకు? అని ప్రశ్నించారు.

కార్పొరేట్ల చేతుల్లోకి నీటిపారుదల ప్రాజెక్టులా?

గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం కోసం రూ.80వేల కోట్ల ఖర్చు అవుతుందని, దాన్ని కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రామకృష్ణ తీవ్రంగా తప్పుపట్టారు. మన దగ్గర ఉన్న సహజ వనరుల్లో భూమి, నీరు ముఖ్యమైనవని వివరించారు. రాష్ట్రంలో బలమైన సంపద గోదావరి నది, దాని ద్వారా దాదాపు 4వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని, ఆయా నీటి వినియోగానికి కార్పొరేట్ సంస్థలకు పెత్తనం ఇస్తామని చంద్రబాబు చెప్పడం తగదన్నారు. జాతీయ రహదారులకు టోల్‌గేట్లు అప్పగించిన తరహాగానే, గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానంలోనూ ప్రైవేట్ వారికి పెత్తనం ఇచ్చే నిర్ణయం అత్యంత ప్రమాదకరమైన ఆలోచనని, రాష్ట్రానికి ఉన్న అతిపెద్ద సంపదను కార్పొరేట్ కంపెనీల చేతుల్లో పెట్టి, వారి నిర్ణయాల ప్రకారం మనమంతా ఆధారపడాల్సి ఉంటుందన్నారు. తాగునీరు నుంచి, సాగునీరు వరకూ అమ్మకాలు సాగుతాయని, నీటి వినియోగం కోసం కూడా ప్రైవేటు వారిపైనే ఆధారపడాల్సిన దౌర్భాగ్య స్థితి ఏర్పడుతుందని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెద్దఎత్తున ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవాలేగానీ, నీటి ప్రాజెక్టులను కార్పొరేట్ చేతుల్లో పెడతామనే ఆలోచన సరికాదన్నారు.

విశాఖ స్టీల్‌ను వదలి మిత్తల్‌కు వత్తాసా?

విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ విషయంలోనూ చంద్రబాబు తప్పు చేస్తున్నారని రామకృష్ణ ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో దీన్ని ప్రైవేట్‌పరం కాకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌దేనంటూ లేఖ రాశారని గుర్తుచేశారు. అవసరమైతే టీడీపీ ప్రజాప్రతినిధులు అందరూ రాజీనామాలు చేస్తారని ప్రకటించారన్నారు. నేడు అధికారంలోకి వచ్చాక చంద్రబాబు మిత్తల్ కంపెనీ గురించి మాట్లాడుతున్నారని, విశాఖ స్టీల్ ప్రస్తావనే తేవడం లేదని, మిత్తల్ కంపెనీకి భూములు, గనుల కేటాయింపులపైనే సీఎం ఆలోచిస్తున్నారని తెలిపారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీకి గనులు ఇస్తే... బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

నాలుగు నెలలుగా విశాఖ ఉక్కు కార్మికులకు వేతనాలు నిలిపివేశారన్నారని, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని రద్దుచేసి, మిత్తల్ కంపెనీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోల్పోతే అధికార, ప్రతిపక్షంలో ఉన్న వారంతా చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించాలని సూచించారు. బియ్యంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై మాజీమంత్రి పేర్ని నాని సతీమణి పేర్ని జయసుధను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వాళ్లు డబ్బులు కట్టినప్పటికీ... మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నారని, అదే అదానీ కంపెనీల అవినీతిపై ప్రశ్నించేందుకు ఎందుకు భయపడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలాంటి పదవి లేనప్పుడే పవన్ కల్యాణ్ మాట్లాడేవారని, ఇప్పుడెందుకు మాట్లాడలేకపోతున్నారని ప్రశ్నించారు. అదానీ కంపెనీతో ఒప్పందాల అవినీతిపైన, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సీఎం చంద్రబాబు, పవన్ మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈనెల 4వ తేదీన సీఎం చంద్రబాబు దిల్లీ పర్యటన సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగబోదని స్పష్టమైన ప్రకటన రాకపోతే... ఈనెల 8వ తేదీన ప్రధాని మోదీ పర్యటనలో నల్ల జెండాలతో నిరసనలకు దిగుతామని ప్రకటించారు. ఇప్పటికైనా అదానీ అవినీతిపైన, విశాఖ స్టీల్ ప్లాంట్‌పైన, కృష్ణా-గోదావరి-పెన్నా నదుల అనుసంధానంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.దుర్గాభవాని, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్సన్‌బాబు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ దివాకర

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎల్టా మండల స్థాయి పోటీ పరీక్షలు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ ఎల్టా, ఎస్‌సి ఇఆర్‌టి హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జనవరి 3న మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఆంగ్ల ఒలింపియాడ్, ఎలోక్యూషన్ పోటీలను విజయవంతం చేయాలని ఎల్టా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ దస్తగిరి షేక్ మీరా హుస్సేన్, ఉపాధ్యక్షులు జహంగీర్ షరీఫ్‌లు కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన వెల్లడించారు. తెలంగాణ ఎస్‌సి ఆర్‌టి డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆంగ్ల పోటీలు విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకమైన నైపుణ్యాలను పెంచేందుకు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ పోటీలు విజయవంతం కావడానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆంగ్ల ఉపాధ్యాయులు, ఎంఈవోలు సహకరించాలని కోరారు. ప్రభుత్వ బడులలో ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతం కావడానికి ఈ ఒలింపియాడ్, వ్యాసరచన పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని విద్యార్థులు ఎదుర్కోవాలంటే ఆంగ్లభాష నైపుణ్యాలైన ఉపన్యాసం, భావవ్యక్తీకరణ అవసరం అన్నారు.

బాలకార్మిక నిర్మూలనకు అందరూ కృషి చెయ్యాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : చిన్న పిల్లలతో ఎవరైనా వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. ఎక్కడైనా చాకిరీ చేస్తూ బాల కార్మికులు కనిపిస్తే 1098 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. జనవరి 1 నుండి 31వ తారీఖు వరకు వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్-11లో భాగంగా పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ అధికారులతో గురువారం జిల్లా ఎస్పీ సమావేశమయ్యారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని ఐదు సబ్ డివిజన్లలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం కోసం కృషి జరుగుతుందన్నారు. వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆపరేషన్ స్మైల్-11 పోస్టర్లను ఆవిష్కరించారు. బాధ్యులైన శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 18 ఏళ్ళ లోపు బాల బాలికలు కిరాణం షాపులు, మెకానిక్ షాపులలో, హోటళ్లలో, ఫ్యాక్టరీలలో పనిచేస్తున్నట్లయితే నేరమన్నారు. భద్రాచలం ఎఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డిఎస్పి అబ్దుల్ రెహమాన్, డీసీ ఆర్ బి డిఎస్పీ మల్లయ్య స్వామి, డిఎం అండ్ హెచ్‌వో భాస్కర్ నాయక్, డిడబ్ల్యుఓ స్వర్ణలత లెనినా, సిడబ్యూసి అంబేద్కర్, సాదిక్ పాషా, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ షర్ఫుద్దీన్, నాగరాజు, యేసుపాదం, శాస్త్రి, డీసీపీవో హరి కుమారి, ఆపరేషన్ స్మైల్ టీం పాల్గొన్నారు.

రేఖా శ్యామ్ నాయక్‌కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్‌ను గురువారం ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా నిర్మల్ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ బనావత్ గోవింద్ నాయక్ కలిసి పుష్ప గుచ్ఛంతో ఆంగ్లాది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి : సీపీఐ

విశాలాంధ్ర - వనపర్తి : ప్రజల కోసం పోరాడిన అమరుల ఆశయాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కే విజయ రాములు పిలుపునిచ్చారు. గురువారం వనపర్తి సిపిఐ కార్యాలయంలో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బర్ధన్, వనపర్తి సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి డి చంద్రయ్య వర్ధంతిని నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, రమేష్, శ్రీరామ్, గోపాలకృష్ణ, శ్రీహరి, రవీందర్, పృథ్వినాదం మాట్లాడారు. దేశంలో బిజెపి మత రాజకీయాలు ముమ్మరమైన దశలో బర్ధన్ సిపిఐ పార్టీ పగ్గాలు చేపట్టి సమర్థ నాయకత్వం పార్టీని పటిష్టం చేసిందన్నారు. డి చంద్రయ్య వనపర్తి డివిజన్ కార్యదర్శిగా, సిపిఐ వనపర్తి జిల్లా తొలి కార్యదర్శిగా పనిచేశారన్నారు. తాపీ మేస్త్రి గా జీవితాన్ని ప్రారంభించి జిల్లా కార్యదర్శిగా ఎదిగారన్నారు. వనపర్తి లో ప్రజా పోరాటాలకు కేరాఫ్ అడ్రస్‌గా చంద్రయ్య నిలిచారన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం నిర్మాణం ఆయన కృషివల్లే జరిగిందన్నారు. జిల్లా పార్టీ ఆయన పోరాట స్ఫూర్తితో ప్రజల పక్షాన పని చేయటమే మనం అర్పించే నిజమైన నివాళి కాగలదన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, జె. చంద్రయ్య సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటియూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ఉపాధ్యక్షుడు శ్రీరామ్, ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, ఏఐవైఎఫ్ నేత లక్ష్మీనారాయణ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్ శిరీష, చిన్న కురుమన్న, పృథ్వి నాదం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి : రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని ఆరవ డివిజన్ సప్తగిరి కాలనీ, ఐబి కాలనీలలో టియుఎఫ్ఐడిసి నిధులు రూ. 6.2 కోట్లతో చేపట్టనున్న సిసి రోడ్డు, కల్వర్ట్, వరదనీటి కాలువల నిర్మాణ అభివృద్ధి పనులకు రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజఠాకూర్ గురువారం శంఖుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో ఏడాది కాలంలో దాదాపు రూ 300 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మరో రూ. 200 కోట్ల విలువైన పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. సుమారు 40 వేల కోట్లతో రామగుండం లో పవర్ ప్రాజెక్ట్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా నాయకులు కృషి చేయాలని, పెదల అభ్యున్నతే లక్ష్యంగా, కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని సోమలగడ్డ క్రాస్ రోడ్డు ఎదుట ఉన్న పి.ఎస్.ఆర్. గార్డెన్స్ యందు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని సంతాప సభ, ములుగు జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం ఏర్పాటు చేయగా, అట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరై, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని, వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీతక్క మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో 1932లో జన్మించారని, పంజాబ్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తయ్యాక, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ పూర్తి చేశారని తెలిపారు. మన్మోహన్‌సింగ్ 2004 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు, భారత ప్రధానిగా పనిచేసారని, 2004 లోక్‌సభ ఎన్నికల్లో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని, ఎన్డీయేపై కాంగ్రెస్ విజయం సాధించి, ఆయన తొలిసారిగా 2004లో భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారని పేర్కొన్నారు. 2009 నుంచి 2014 వరకు రెండోసారి పదవిలో కొనసాగారని, పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో, 1991-1996 మధ్య మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా కూడా పనిచేశారని తెలిపారు. పీవీ నరసింహారావును ఆర్థిక సంస్కరణల పితామహునిగా భావిస్తారని, పీవీ విధానాల అమలులో మన్మోహన్‌సింగ్, కీలక పాత్ర పోషించారని, భారత్‌కు 13వ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే ముందు, ఆయన అనేక బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించారని వివరించారు. 1982 నుంచి 1985 వరకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా పని చేశారని, 1985 నుంచి 1987 వరకు ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారని, 1991లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారని, ఆర్థికమంత్రిగా పీవీ నరసింహరావు నామినేట్ చేసే సమయానికి మన్మోహన్ సింగ్ యూజీసీ చైర్మన్‌గా ఉన్నారన్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి కూచన రవళి రెడ్డి, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, ములుగు జిల్లా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిబద్ధతగల కమ్యూనిస్టు బర్ధన్ : బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : తుదిశ్వాస వరకు ఎర్రజెండా నీడలో పేదల అభ్యున్నతి కోసం పనిచేసిన బర్ధన్ నిబద్ధగల కమ్యూనిస్టు అని సి.పి.ఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. యువజన, విద్యార్థి ఉద్యమం నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు అంచెలంచలుగా ఎదిగిన బర్ధన్ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడన్నారు. సి.పి.ఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ కమ్యూనిస్టు ఎబి బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సి.పి.ఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్లో బర్ధన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ మతోన్మాదులకు కేంద్రంలో ఉన్న నాగపూర్ ప్రాంతంలో విద్యార్థి దశలోనే వామపక్ష ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారని ముఖ్యంగా శ్రమజీవులు పడుతున్న కష్టాలకు తగిన ఫలితం దక్కాలని ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ప్రారంభించి బలోపేతం చేశారన్నారు. నిరంతరం శ్రమ జీవిగా పేరొందిన బర్ధన్ ఎ.ఐ.టి.యు.సి. జాతీయ ప్రధాన కార్యదర్శిగా, శాసనసభ్యునిగా పనిచేశారని ఆయన తెలిపారు. బర్ధన్ నిరంతరం వామపక్ష ఐక్యతను కోరుకునేవారని చివరికంటా కమ్యూనిస్టుల శక్తుల పునరేకీకరణ కోసం ఆయన పనిచేశారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా పలు రాష్ట్రాలలో కమ్యూనిస్టు పార్టీని విస్తృత పర్చడానికి బర్ధన్ తీవ్రంగా కృషి చేశారని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్.కె. జానిమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గసభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల బాధ్యులు తాటి నిర్మల, ఇటికాల రామకృష్ణ, మందా వెంకటేశ్వర్లు, పోటు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాలతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, తాము చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలు పాత్రికేయులు సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జీతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారని, జిల్లాలోని పర్యటక రంగాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. క్రింది స్థాయి అధికారుల నుండి జిల్లా స్థాయి అధికారి వరకు మంచి పనులతో పాటు అనుకోకుండా కొన్ని తప్పుడు పనులు చేసే అవకాశం ఉంటుందని ఇలాంటి విషయాలను పాత్రికేయులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబాల పోషణతో పాటు, ప్రజా సేవ చేయాలని తపనతో ప్రభుత్వ ఉద్యోగ విధులు నిర్వహిస్తారని, తాను సైతం కలెక్టర్ కాక ముందు ప్రైవేట్ కంపెనీలో నెలకు ఆరు లక్షల 50 వేల రూపాయల వేతనంతో పని చేశానని ప్రజలకు సేవ చేయాలనే తపనతో కలెక్టర్ ఉద్యోగంలో చేరానని వివరించారు. జిల్లాలో విద్యను బలోపేతం చేయడానికి సిఎస్ఆర్ నిధులతో గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థిని విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో బోధన అందించడం జరుగుతున్నదని, జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతుందని వివరించారు. సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎండి. రఫిక్, జూనియర్ అసిస్టెంట్ కే.శంకర్ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలపై ప్రత్యేక నిఘా : ఎస్పీ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: ఆకతాయిల ఆగడాలపై ప్రత్యేక నిఘా, మహిళల భద్రతకు ప్రతిష్టాత్మకంగా పని చేస్తున్న షీ టీమ్‌లు పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుల స్వీకరణకు ప్రజలకు అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం, క్యూఆర్ కోడ్ ద్వారా ఉన్న చోటు నుండే వేధింపులపై నిమిషాల్లో ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో చదివే విద్యార్థినులు, మహిళలకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీమ్‌లు ఆకతాయిలు ఆగడాలకు అడ్డుకట్టు వెస్తునాయని, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, విద్యాసంస్థల, దేవాలయాలు పరిసర ప్రాంతాల్లో షీ టీమ్ పోలీసులు మఫ్టీలో ఉంటూ ఆకతాయిలకు చెక్ పెడుతున్నారు. మహిళలు అన్ని రంగాల్లో పోటీపడి పనిచేస్తున్నారని తాము పనిచేస్తున్న రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారని, అలాంటి వారికి షి టీమ్స్ ఎల్లపుడు అండగా నిలుస్తూ ధైర్యాన్ని ఇస్తాయన్నరు. ఆకతాయిలు వెంటపడి వేధించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100, 112,తో పాటు 7901142009, 8712656935 వాట్సప్ నంబర్ లో సంప్రదించాలని, ఉన్నచోట నుండి ఫిర్యాదు చేయడానికి qr.tspolice.gov.in వెబ్సైట్లోకి లాగిన్ అవ్వడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడవాలని ఆయన కోరారు.

కొత్తగూడెం దుకాణాల్లో మాంజాలు సీజ్ : డిఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గాలి పటాల కోసం ప్రమాదకర మైన మాంజాలు అమ్ము తున్న జిల్లా జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని దుకాణాలపై డి.ఎస్.పి అబ్దుల్ రెహమాన్ సారథ్యంలో దాడులు నిర్వహించారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు పట్టణంలో నిషేధిత చైనా మాంజల అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు డిఎస్పీ తెలిపారు. 3 టౌన్ సిఐ కె.శివప్రసాద్, ఎస్ఐలు బి.పురుషోత్తం, జి.మస్తాన్ సిబ్బందితో కలసి చిన్న బజర్, పెద్ద బజార్ ఏరియాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పెద్దబజార్ లోని కండెల్వాల పవన్ టాయ్స్ షాప్‌లో మాంజ 5-30 బండిల్స్, మూడు రోల్స్ గల 10 పాకెట్స్, బ్రిజ్ కిషోర్ సాహు జనరల్ మెచంట్స్‌లో 14 బండిల్స్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు సదరు వ్యాపారులపై కేసు నమోదు చేశారు. చైనా మాంజ ప్రమాదకరమని అందుకే దీన్ని ప్రభుత్వం నిషేధించింది అని వెల్లడించారు. కాగా బుధవారం ఇలాంటి మాంజ దారాల వల్ల చంద్రుగొండ మండలం గుర్రాయిగూడెం గ్రామానికి చెందిన కృష్ణారావు అనే యువకుడు ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామం వెళ్తుండగా రామవరం ప్రాంతంలో మాంజా మెడకు తగిలి లోతుగా కోసుకుపోవడంతో హైదరాబాద్ తరలించి చికిత్స చేస్తున్నారు. ఈ పరిణామంతో జిల్లా వ్యాప్తంగా మాంధాలపై పోలీసులు ఉక్కు పాదం మోపారు.

మాంజా దారాలు వాడితే చర్యలు తప్పవు: ఎస్ఐ

విశాలాంధ్ర - పినపాక: గాలిపటాలను ఎగరేసే వారు చైనా మాంజా దారం వాడితే కేసులు తప్పవని ఈ బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్ హెచ్చరించారు. గురువారం పినపాక మండల ఈ బయ్యారం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ మాట్లాడారు. గాలిపటాలు అమ్మే మంజాదారం దుకాణదారులు ప్రమాదకరమైనవి అమ్మకాలు చేయవద్దన్నారు. నిర్లక్ష్యం చేసి ఎవరైనా అమ్మకాలు జరిపితే గరిష్టంగా ఏడేళ్ల జైలు శిక్షపడే అవకాశం ఉందన్నారు. ప్రమాదకరమైన మంజా దారంతో గాలిపటాలు అసలు ఎగురవేయొద్దన్నారు. వీటి వల్ల పలుచోట్ల ప్రమాదకర సంఘటనలు జరిగాయని వివరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మాంజా దారాలు అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : మెనూ ప్రకారం విద్యార్థులకు నిర్ణీత భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వాంకిడి మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలను సందర్శించి, వంట గదిని పరిశీలించి, రికార్డులు తనకి చేసి విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వసతి గృహ పరిసర ప్రాంతాలతో పాటు, వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా చేయడంతో పాటు సర్వే పకడ్బందీగా ఉండాలన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ - 2024 క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులు సత్తా చాటారు. సీఎం కప్ 2024లో భాగంగా జవహర్లాల్ నెహ్రూ క్రీడా ప్రాంగణం హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులు 86 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. మొత్తం అథ్లెటిక్ విభాగంలో స్వర్ణ పథకాలు 12, వెండి పథకాలు 5, కాంస్య పథకాలు 11 సాధించారని కలెక్టర్ వెల్లడించారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించి, రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రతిష్టను నిలిపిన అథ్లెటిక్ క్రీడాకారులను, క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి ని, అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ మహిధర్, మహిళలలో ఆర్చరీ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను అభినందించారు.

సర్వ శిక్ష ఉద్యోగుల భారీ ర్యాలీ

విశాలాంధ్ర - ఖమ్మం : సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. సర్వ శిక్ష ఉద్యోగులు నిర్వధిక సమ్మె నిర్వహిస్తున్న విషయం తెలిసిందే తమ డిమాండ్ల పరిష్కారం కోసం సుదీర్ఘంగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగులను చర్చలకు పిలిచినప్పటికీ ఆ చర్చలు విజయవంతం కాకపోవడంతో తిరిగి ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. సర్వ శిక్ష అభియాన్ పరిధిలో దశాబ్దాలుగా అనేకమంది ఉద్యోగులు కనీస వేతనం కూడా లేకుండా నెలకు 10000 అంతకంటే తక్కువ జీతాలకు పనిచేస్తున్నారు. వీరికి బేసిక్ పే ఇవ్వాలని రెగ్యులర్ చేయాలని సుప్రీంకోర్టు సూచనలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని సంఘం నాయకులు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో పేఇన్‌స్టా కార్డ్ కొత్త కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్: ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేఇన్‌స్టా కార్డ్ గురువారంనాడు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో తన కొత్త, అత్యాధునిక కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి బ్రాండిక్స్ ఇండియా అపెరల్సిటీ (బీఐఏసీ) ఇండియా పార్ట్‌నర్, పేఇన్‌స్టా కార్ చైర్మన్, ఇన్వెస్టర్ పచ్చిపాల దొరస్వామి, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోర్డ్ మెంబర్, ఇన్వెస్టర్ సంధ్యారాణి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ చర్య సంస్థ వేగవంతమైన వృద్ధిని, తన వినియోగదారులకు వినూత్న చెల్లింపు పరిష్కారాలను అందించడానికి నిబద్ధతను సూచిస్తుంది. కేవలం ఆరు నెలల్లో పేఇన్‌స్టా కార్డ్ 100,000పైగా వినియోగదారులను చేరుకోవడం,1 బిలియన్‌పైగా స్థూల లావాదేవీల పరిమాణాన్ని ప్రాసెస్ చేయడంతో సహా ముఖ్యమైన మైలురాళ్లను సాధించింది. సంస్థ అనుసరించే కస్టమర్-కేంద్రిత విధానం, తక్కువ కన్వీనియెన్స్ రుసుములు వంటివి దీన్ని వివిధ సేవలు, అద్దె, విద్య వంటి వివిధ రంగాలలో డిజిటల్ చెల్లింపుల కోసం దీని ప్రాధాన్య ఎంపికగా ఉంచాయి. ఇటీవల పేఇన్‌స్టాకార్ మొబైల౦ వినియోగదారులకు మరింత విలువను జోడించడానికి ప్లేస్టోర్, ఐఓఎస్ స్టోర్‌లో తన సర్వీస్ ఆఫర్లను ప్రారంభించింది. పేఇన్‌స్టాకార్డ్ వేగవంతమైనవృద్ధి, విజయాలు పట్ల గర్విస్తున్నామన్నారు.

సోనీ లివ్‌లో బడా నామ్ కరేంగేతో రాజశ్రీ ప్రొడక్షన్స్ ఓటీటీ ప్రవేశం

ముంబయి: ఓటీటీ ప్రపంచంలోకి సూరజ్ ఆర్. బర్జాత్య ప్రవేశిస్తున్నారు. హృద్యమైన కథలు, కుటుంబ విలువలతో పాతుకుపోయిన వారసత్వంతో, రాజశ్రీ ప్రొడక్షన్స్ 'బడా నామ్ కరేంగే'తో చాలా కాలంగా ఎదురుచూసిన డిజిటల్ రంగప్రవేశాన్ని ప్రారంభించింది. దీనితో ఈ ప్రేమకథను మళ్లీ మూలాల్లోకి తిరిగి తీసుకురావడం ద్వారా అమూల్యమైన కుటుంబ విలువలను ప్రదర్శిస్తుంది. పలాష్ వాస్వాని దర్శకత్వం వహించిన ఈ ధారావాహిక త్వరలో సోనీ లివ్‌లో ప్రత్యేకంగా ప్రసారం కానుంది. దీనికి సంబంధించిన టీజర్ గురువారం విడుదలైంది. బడా నామ్ కరేంగే, రిషబ్, సురభిల ప్రయాణాన్ని వివరిస్తుంది, వారి గత జ్ఞాపకాలు తిరిగి వచ్చినప్పుడు వారి ఉద్దేశించిన వివాహం ఆశ్చర్యకరమైన, మనోహరమైన మలుపు తీసుకుంటుంది. సూరజ్ ఆర్. బర్జాత్య మాట్లాడుతూ, ఈ సిరీస్ నా హృదయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు.

సెన్‌హైజర్ ఆడియో మల్టీటూల్ ప్రొఫైల్ వైర్‌లెస్ విడుదల

ముంబయి: కంటెంట్‌ను క్రియేట్ చేసేటప్పుడు, ఆడియో నాణ్యతను కోల్పోకుండా ఉండేలా క్రియేటర్లు, వీడియోగ్రాఫర్‌ల కోసం, సెన్‌హైజర్ ఇప్పుడు ప్రొఫైల్ వైర్‌లెస్‌ను విడుదల చేసింది. రెండు-ఛానల్, 2.4 జీహెచ్‌జెడ్ వైర్‌లెస్ మైక్రోఫోన్ సిస్టమ్ ఇది. మొబైల్ ఫోన్‌లు, కెమెరాలు లేదా కంప్యూటర్‌లకు కనెక్ట్ అవుతుంది. క్లిప్-ఆన్ మైక్, హ్యాండ్‌హెల్డ్ మైక్ లేదా టేబుల్-టాప్ మైక్రోఫోన్‌గా దీనిని ఉపయోగించవచ్చు. సెన్‌హైజర్ ఇండియా కంట్రీ మేనేజర్, డైరెక్టర్- సేల్స్ ప్రో ఆడియో విపిన్ పుంగలియా మాట్లాడుతూ నేటి డిజిటల్ మీడియా యుగంలో, భారతదేశంలో మిలియన్ల కొద్దీ కంటెంట్ సృష్టికర్తలు, క్రియాశీల కంటెంట్ వినియోగదారులు ఉన్నారన్నారు. 245 మీటర్ల వరకు ఆకట్టుకునే వైర్‌లెస్ పరిధితో, ఈ సిస్టమ్ ఎక్కువ దూరాలకు కూడా స్పష్టమైన ఆడియోను అందిస్తుంది. ప్రతి క్లిప్-ఆన్ వైర్‌లెస్ మైక్రోఫోన్ 16జీబీ ఆన్‌బోర్డ్ మెమరీని కలిగి ఉంది, 24-బిట్/48కేహెచ్‌జెడ్ రిజల్యూషన్‌లో 30 గంటల వరకు ఆడియోను రికార్డ్ చేయగలదు. రెండు వేర్వేరు ఆడియో స్థాయిలలో ఏకకాలంలో రికార్డ్ చేయడం ద్వారా, ప్రొఫైల్ వైర్‌లెస్ క్లిప్ చేయబడిన ఆడియో ప్రమాదాన్ని తగ్గించడమే కాకుండా క్యాప్సూల్ డైనమిక్ పరిధిని పెంచుతుంది, ప్రతి షాట్‌కు అత్యుత్తమ ధ్వని నాణ్యతను నిర్ధారిస్తుంది.

హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ 25 నూతన శాఖలు ప్రారంభం

ముంబై: భారతదేశంలోని ప్రముఖ మ్యూచువల్ ఫండ్ హౌస్‌లలో ఒకటైన హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో 25 కొత్త శాఖలను ప్రారంభించనుంది . సంస్థ తన పరిధిని విస్తరించేందుకు, దేశంలో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిని మరింత అందుబాటులోకి తెచ్చేందుకు కొనసాగుతున్న ప్రయత్నాలలో ఈ శాఖల ప్రారంభం ఒకభాగం. నూతనంగాప్రారంభించనున్నశాఖలు భరత్‌పూర్, భుసావల్, వరచా, భోపాల్, వాకాడ్, చిత్తోర్‌గఢ్, జల్నా, అజంగఢ్, పూర్నియా, సీతాపూర్, బస్తీ, ఆగ్రా, బద్లాపూర్, కాశీపూర్, ఫిరోజ్‌పూర్, బరాసత్, బెర్హంపూర్(ముర్షిదాబాద్), బోల్‌పూర్, కొల్లం, ఖమ్మం, హోసూరు, హసన్, నాగర్‌కోయిల్, విజయనగరం, తంజావూరులో వుండనున్నాయి. ఈ విస్తరణ హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా 250కి పైగా బ్రాంచ్‌లకు పెంచుతుందని హెచ్‌డిఎఫ్‌సి ఏఎంసి లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ నవనీత్ మునోత్ అన్నారు.

హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ వచ్చేసింది!

గురుగ్రామ్: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్‌ని వెల్లడించింది. ఈ సంచలనాత్మక ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ భారతదేశ ఈవీ మార్కెట్లో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేయడానికి బోల్డ్ డిజైన్, అత్యాధునిక సాంకేతికత, అసమానమైన భద్రతను మిళితం చేస్తుంది. హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ ఒక ఆకర్షణీయమైన టీవీసీతో వెల్లడయింది. 'ఇండియా ఇప్పుడు సిద్ధంగా ఉందిటీ ఎలక్ట్రిక్ ఇప్పుడు క్రెటా', ఇది ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం భారతదేశం సంసిద్ధతను హైలైట్ చేస్తుంది. 'ఎందుకు ఇప్పుడు?' అనే ప్రశ్నపై దృష్టి పెడుతుంది. ఇది వాహనం బోల్డ్ ఎక్స్‌టీరియర్, అధునాతన ఇంటీరియర్స్, అధునాతన సాంకేతిక లక్షణాలను కూడా ప్రదర్శిస్తుంది. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ హోల్-టైమ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ మాట్లాడుతూ, హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ మా మొదటి స్థానికీకరించిన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీగా, హెచ్‌ఎంఐఎల్‌కి ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని తెలిపారు.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ అకాడమీ ప్రారంభం

హైదరాబాద్: డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా అందుబాటులో ఉన్న సమగ్ర ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం అయిన ఐడిఎఫ్‌సి ఫస్ట్ అకాడమీని ప్రారంభించి నట్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వెల్లడించింది. ఈ అకాడమీ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించాలనే బ్యాంక్ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది, వ్యక్తులు తమ ఆర్థిక విషయాలను మెరుగ్గా నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. ఈ కార్యక్రమాలలో పాల్గొనేవారు ఐడిఎఫ్‌సి ఫస్ట్ అకాడమీ కోర్సులను ఐడీఎఫ్‌సీఫస్ట్అకాడమీ. కామ్‌లో డెస్క్‌టాప్ లేదా మొబైల్ బ్రౌజర్‌లో సులభంగా యాక్సెస్ చేయవచ్చు. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ కస్టమర్ల కోసం, ఇది మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో కూడా అందుబాటులో ఉంటుంది. ఐడిఎఫ్‌సి ఫస్ట్ అకాడమీ శీఘ్ర, ప్రభావవంతమైన అభ్యాసం కోసం సులభమైన, నిపుణుల రూపకల్పన చేసిన కంటెంట్‌తో సులభంగా అర్థం చేసుకోగలిగే చిన్ని -పరిమాణ మాడ్యూల్స్‌లో సంక్లిష్టమైన ఆర్థిక విషయాలను సరళీకృతం చేసింది. ఇది విభిన్న అభ్యాస శైలుల కోసం బ్లాగులు, వీడియోలు, ఇంటరాక్టివ్ క్విజ్‌లను కలిగి ఉంది. ఇది ఆచరణాత్మక అవగాహనను మెరుగుపరచడానికి వాస్తవ-ప్రపంచ దృశ్య-ఆధారిత కార్యకలాపాలను కూడా కలిగి ఉంటుంది. చివరగా, పాల్గొనేవారి అభ్యాసాన్ని గుర్తించడానికి ఇది సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లను కలిగి ఉంది.

కేంబ్రిడ్జ్ కనెక్షన్ బ్రిడ్జ్ కోర్సు ప్రారంభం

హైదరాబాద్: విద్య, పరిశోధన, మూల్యాంకనం, విద్యా సంబంధిత ప్రచురణలో కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్ అండ్ అసెస్‌మెంట్ ప్రపంచంలో అగ్రగామిగా ఉంది. విద్యలో విజయం, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలతో అభ్యాసకులను సన్నద్ధం చేసేందుకు కేంబ్రిడ్జ్ కనెక్షన్ బ్రిడ్జ్ కోర్సును ప్రారంభించామని సంస్థ ప్రకటించింది. అభ్యాసకులు స్టెమ్ విభాగాలలో అభివృద్ధి చెందేందుకు, భారతీయ పోటీ పరీక్షలలో రాణించడంలో సహాయపడటమే ఈ కార్యక్రమం లక్ష్యం. పోటీ పరీక్షల సన్నద్ధత కోసం డిమాండ్ పెరుగుతూనే ఉండడంతో, ఈ కోర్సు విద్యార్థులకు విద్యా అవకాశాలను అందుకునేలా చేయడంలో శక్తినిస్తుంది. దీన్ని 9 నుంచి 12 తరగతుల విద్యార్థుల కోసం రూపొందించగా, అభ్యాసకుల ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు ప్రత్యేకంగా భారతీయ మార్కెట్‌కు అనుగుణంగా రూపొందించారు. ప్రస్తుతం ఐజీసీఎస్ఈ విద్యార్థుల కోసం 9,10 తరగతులకు కోర్సు అందుబాటులో ఉండగా, బ్రిడ్జ్ కోర్సు భారతదేశం పోటీతత్వ విద్యా వాతావరణంలో అభివృద్ధి చెందేందుకు అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానాన్ని అభ్యాసకులకు అందిస్తుంది.

కీలక మైలురాయి సాధించిన సీఆర్ఐ పంప్స్

ముంబయి: సుస్థిరత, పునరుత్పాదక ఇంధన పరిష్కారాలపై ఉన్న నిబద్ధతలో కీలక మైలురాయిని సాధించామని సీఆర్ఐ పంప్స్ ప్రకటించింది. మగేల్ త్యాలా సౌర్ కృషి పంప్ పథకం కింద రూ.754 కోట్ల విలువైన 25,000 సోలార్ పంపింగ్ సిస్టమ్స్ సరఫరా చేసేందుకు ముంబయికి చెందిన మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎంఎస్ఈడీసీఎల్)లో సీఆర్ఐ పంప్స్ అధికారికంగా ఎంప్యానెల్ అయింది. ఈ ఎంప్యానెల్‌మెంట్‌తో పునరుత్పాదక ఇంధన పరిష్కారాలు ప్రోత్సహించడం, మహారాష్ట్ర వ్యవసాయ భూభాగాన్ని శక్తివంతం చేయడం, పచ్చదనంతో కూడిన స్థిరమైన భవిష్యత్తుకు దోహదం చేయడంలో కీలక పాత్ర పోషించడానికి సీఆర్ఐ పంప్స్ సిద్ధంగా ఉంది. ఈ కీలక మైలురాయిని చేరుకున్న సందర్భంగా సీఆర్ఐ గ్రూప్ చైర్మన్ జి.సౌందర రాజన్ మాట్లాడుతూ, సోలార్ పంపింగ్స్ సిస్టమ్స్ సరఫరా చేసేందుకు ఎంఎస్ఈడీఎస్ఎల్ మమ్మల్ని ఎంచుకున్నందుకు మేము గర్వపడుతున్నామని అన్నారు.

సంపాదకీయం

మలినమవుతున్న మంచినీరు

ఆరోగ్యానికి నీరు అత్యంత అవసరం. పోషక విలువలుగల ఆహారం తయారు చేసుకునేందుకు పరిశుభ్రమైన నీరు కావాలి. అయితే దీర్ఘకాలంగా జలకాలుష్యంపై ఐక్యరాజ్యసమితి అన్ని దేశాలనూ హెచ్చరిస్తూనేఉంది. పర్యావరణం మళ్లీ బాగు చేయలేనంతగా కలుషితమైందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించినా ప్రభుత్వాలు, ప్రజలు పెద్దగా స్పందించడంలేదు. నీరు, గాలి,ఆహార కాలుష్యాల ఫలితంగా భరించలేని ధరిత్రి ఉష్ణోగ్రతలు తగ్గించడం లాంటి అనేక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు ప్రతి సంవత్సరం ఒక దేశంలో అంతర్జాతీయ వాతావరణంపై సదస్సు జరుగుతోంది. అనేక ధనిక, పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రతినిధులు పాల్గొని పది, పన్నెండు రోజులు చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నా గొప్ప ప్రయోజనం కలగడంలేదు. భారతదేశంలో అనేక 'పుణ్య' నదులున్నాయి. అన్ని నదులు కలుషితమయ్యాయి.

గంగ, కావేరి, యమున తదితర అనేక నదులు కలుషితమైపోయి తాగేందుకుకే కాదు, కనీసం స్నానానికి కూడా అంతగా ఉపయోగపడవని పర్యావరణ అధ్యయనవేత్తలు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా పాలకులు మాత్రం నదులు, కాలువల శుభ్రత కోసం కోట్లు ఖర్చు పెట్టాము, చాలా మేరకు పరిష్కారం చేశామని చెప్తున్నారు. పరిస్థితిలో ఎక్కువగా మార్పురాలేదు. ముఖ్యంగా ఉత్సవాలకు, పండగలకు, వేడుకలకుసైతం పూలదండలు, ఆకులు, విగ్రహాలు, నీటిలో వేయడం వల్ల అవి కుళ్లిపోయి కలుషితమవుతున్నాయి. ముఖ్యంగా ప్లాస్టిక్ మనిషి ఆరోగ్యాని అత్యంత తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఉదయం నుంచి నిద్రించేవరకు కనిపించని ప్లాస్టిక్ రేణువులను తాగుతున్నాము, తింటున్నాము. చివరకు పశువులుసైతం ప్లాస్టిక్ సంచుల ముక్కలను తిని చనిపోతున్నాయి. మనుషుల పొట్టల్లో చేరిన ప్లాస్టిక్ రేణువులు అనేక ప్రమాదరక వ్యాధులు కలిగిస్తున్నాయి. ఈ వ్యాధులు మరణాలకు దారితీస్తున్నాయి. ఉదయం లేచినప్పటినుంచి పాలు తెచ్చుకోడానికి పాల పాకెట్లు, వస్తువులు తెచ్చుకోడానికి, తినుబండారాల పాకెట్లకోసం, చాక్లెట్లు, శీతల పానీయాలకు, శుభ్రమైన బాటిళ్లలో తెచ్చుకునే నీళ్లు సైతం కలుషితమే. ముడిచమురును శుద్ధిచేసిన తర్వాత మిగిలే మడ్డిని కూడా ప్లాస్టిక్ తయారీలో కలుపుతారు.కొన్ని వందల వస్తువులను పాకెట్లుగా తయారుచేయడానికి ప్లాస్టిక్‌ను వాడుతున్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి ప్లాస్టిక్ వస్తువులలో కొన్నింటినైనా నిషేధించాలని వాతావరణ కార్యకర్తలు గగ్గోలు పెడుతున్నా పలికే పాలకులు అంతగా కనిపించడంలేదు. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి వేయి సంవత్సరాలకుపైగా పడుతుంది. ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, బాటిళ్లు, పట్టణాలు, నగరాల సైడు కాలువల్లో విచ్చవిడిగా ఉంటాయి. ఫలితంగా నీళ్లు మురికిగా మారిపోయి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పొలాల్లో, కాలువలు, నదులు, సముద్రాలలో సైతం ప్లాస్టిక్ ముక్కలుచేరి నీళు కలుషితమైన ఆ నీళ్లల్లో సముద్రజీవులు చనిపోతాయి. కొన్ని పెద్ద సముద్రాల్లో అనేక కిలోమీటర్ల దూరంలో అందనంత ఎత్తులో ప్లాస్టిక్ పేరుకుపోయి కొండల్లా తయారైందని అధ్యయనాల్లో తేలింది. నీరు కలుషితం కావడమేగాక, హిమాలయాల్లో మంచు దిబ్బలు వేగంగా కరిగిపోతూ క్రమంగా నీటి కొరత ఏర్పడుతోందని పర్యావరణ వేత్తల అధ్యయనం వెల్లడిస్తోంది.

భూగర్భ జలాల్లో ఉండవలసిన వాటికంటే నైట్రేట్స్ చాలా ఎక్కువగా ఉన్నాయని పరిశోధనలు వెల్లడించాయి. 2023లో చేసిన అధ్యయనంలో దేశవ్యాప్తంగా 440 జిల్లాల్లో భూగర్భజలాల బోర్డు తన నివేదిక తెలియజేసింది. 2017లో 359 జిల్లాల్లో అధిక నైట్రేట్లుండగా 2023నాటికి 440 జిల్లాలకు పెరిగింది. పర్యావరణవేత్తలు ఇంతకంటే ఎక్కువ జిల్లాలో ఈ పరిస్థితి ఉందని వెల్లడించారు. ఈ నీరు ఆరోగ్యప్రమాదకారి. ప్రత్యేకించి పిల్లలకు ఈ నీరు మరింత హాని చేస్తాయి. వాతావరణ కాలుష్యం కలుగజేస్తుంది. డాటా ప్రకారం దేశంలోని 56శాతం జిల్లాల్లోని నీటిలో లీటరుకు 45 మిల్లీ గ్రాములు నైట్రేట్లున్నాయని నివేదిక వెల్లడించింది. పొలాల్లో కృత్రిమ సింథటిక్ నైట్రోజియన్ ఎరువులు వేయడం వల్ల నైట్రేట్లు పెరుగుతున్నాయి. నీటి పరీక్షలకోసం దేశవ్యాప్తంగా 15,239 భూగర్భజలాల నమూనాలు సేకరించాయి. సురక్షిత నీటి కంటే ఎక్కువగా 19.6 నైట్రోజన్ కాంపౌండ్లు ఉన్నాయి. నైట్రోజన్ల పరిమాణం 2017 నుంచి పెరుగుతూనే ఉంది. రాజస్థాన్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని భూగర్భజలాల్లో ఎక్కువగా నైట్రోజన్లు ఉన్నాయని అధ్యయనంలో తేలింది. ఈ సమస్య రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో చాలా కాలంగా ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 25 శాతానికి కాస్త అటుఇటుగా కొన్ని రాష్ట్రాల్లో 35శాతం, మరికొన్ని రాష్ట్రాల్లో అధిక నైట్రేట్లున్నాయి. వీటి కారణంగా పిల్లలు, నవయువ్వనులలో రకరకాల వ్యాధులు వచ్చే అవకాశాలు మెండుగాఉన్నాయి. కేంద్ర, దక్షిణ ప్రాంతాలలో ఆందోళనకర పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి.

వర్షాకాలంలో నైట్రోజన్ల ప్రమాదం పెరుగుతుంది. వర్షాలకు ముందు 30శాతం నైట్రేట్లు ఉంటే వర్షాల సమయంలో 32.66శాతం ఉంటాయని తేలింది. నైట్రేట్లుగాకుండా ఫ్లోరైడ్, యురేనియం కెమికల్స్ ఉంటున్నాయి. ఇవి కూడా ప్రమాదకరమైనవేనని అధ్యయన వేత్తలు తెలియజేశారు. రాజస్థాన్, హర్యాన, పంజాబ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో అత్యధికంగా భూగర్భజలాలను వినియోగించుకుంటున్నారు. 2024లో నైట్రేట్లు, ఫ్లోరైడ్, యురేనియం శాతాలు మరింత ఎక్కువగా ఉండవచ్చునని అంచనా. పొలాల్లో కృత్రిమ ఎరువులను తగ్గించడమే ఈ కెమికల్స్‌కు పరిష్కారం అవుతుంది. అలాగే కాలుష్యాలను గణనీయంగా తగ్గించడం ద్వారా నీటి శుభ్రతను పెంచుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యం పెంచుకోగలుగుతాం.

స్త్రీ విద్యా విప్లవకర్త సావిత్రిబాయి ఫూలే

డా. కత్తి పద్మారావు



సావిత్రిబాయి ఫూలే భారతదేశంలో స్త్రీ విద్యా విప్లవాన్ని ప్రారంభించిన సాంస్కృతిక యోధురాలు. ఆమె మహోజ్వలమైన చరిత్ర భారతదేశంలో స్త్రీల సాధికారితకు బాటలు వేసింది. ఈనాడు స్త్రీలు విద్యలో సామాజిక, సాంస్కృతిక సాంకేతిక రంగాల్లో అద్వితీయ పాత్ర వహించడానికి పునాది వేసింది సావిత్రిబాయి ఫూలే. ఆమె ఒక సాహసవంతురాలు. చరిత్రను మలుపు తిప్పిన యోధురాలు. స్త్రీలకు విద్య కలిగితేనే వారు ప్రపంచ మానవులుగా ఎదుగుతారని గుర్తించిన సామాజిక శాస్త్రవేత్త. సావిత్రిబాయి ఫూలే వ్యక్తిత్వ నిర్మాణంలో విద్య, జ్ఞానం, సంస్కరణ, విప్లవం, ప్రత్యామ్నాయం దాగి వున్నాయి. లింగ భేదాన్ని, కుల భేదాన్ని, భాషా భేదాన్ని, జాతి భేదాన్ని, వర్ణ భేదాన్ని నిరాకరించిన గొప్ప ప్రయోక్త. స్త్రీలను అన్ని వర్ణాలవారు అణగదొక్కుతున్నారు అని తెలుసుకొని బ్రాహ్మణవర్ణం నుండి అస్పృశ్యుల దాకా అన్ని తరగతుల స్త్రీలలో విద్యా దీపాలు వెలిగించిన మానవతా వాది. సావిత్రిబాయి ఫూలేని ఒక ఉపాధ్యాయునిగా, ఉద్యమయోధురాలుగా తీర్చిదిద్దిన మహాత్మాఫూలే ఎన్నదగిన కీర్తి గలవారు.

జ్యోతిరావ్ ఫూలే జీవితం, సావిత్రిబాయి ఫూలే జీవితం విడదీయరానివిగా సాగాయి. వీరిద్దరు రాత్రిస్కూలుని తమ ఇంట్లో నడిపించారు. దళిత స్త్రీల విముక్తికి విద్య మూలహేతువని సావిత్రిబాయిఫూలే గుర్తించారు. 1830 వరకు శూద్ర స్త్రీలకు, దళితులకు విద్య అనేది ఊహించే పరిస్థితులలో భారతదేశం లేదు. ముఖ్యంగా అగ్రవర్ణ ఆధిపత్యానికి, హిందూ నియంతృత్వానికి, బ్రాహ్మణ సంస్కృతీ జటిలత్వానికి కంచుకోట అయిన మరాఠారాజ్యం స్త్రీలను అతి దారుణంగా అణిచింది. మహత్మఫూలే మొదట సావిత్రిబాయి ఫూలే గురువు. సావిత్రిబాయి ఫూలే మొత్తం సమాజానికే గురువు అయింది. సావిత్రిబాయి ఫూలే ఎన్నో సంస్థలను, వ్యవస్థలను నిర్మించిన విద్యాదాత. భార్యను ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన జ్యోతిరావ్ వ్యక్తిత్వం అద్వితీయమైనది. జ్యోతిరావు ఫూలే తన భార్యని వ్యక్తిత్వం వున్న ఉపాధ్యాయురాలిగా, నాయకురాలిగా తీర్చిదిద్దారు. మహాత్మాఫూలే బ్రాహ్మణ స్త్రీలను వేరుచేయలేదు. బ్రాహ్మణ స్త్రీలు, బ్రాహ్మణ పురుషులచేత ఎలా అణగద్రొక్కుతున్నారో శాస్త్రీయమైన విశ్లేషణ చేశారు. ఫూలే దంపతులు 1842లో అన్ని వర్ణాల బాలికలకు విద్యాలయం ప్రారంభించారు. 1863లో సావిత్రిబాయిఫూలే విధవరాండ్ర రక్షణ కోసం ఒక ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఇదే కాలంలో వీరొక బ్రాహ్మణ విధవరాలి కుమారుణ్ని దత్తత చేసుకున్నారు. బ్రాహ్మణ స్త్రీలకు భర్తచనిపోతే శిరోముండనం చేసే ఆచారాన్ని సావిత్రిబాయి ఫూలే వ్యతిరేకించింది. దీనికోసం మంగళ్ళను సమీకరించి ఈ దురాచారానికి వ్యతిరేకంగా మేము కత్తి పట్టమని శపథం చేయించారు..

సావిత్రిబాయి ఫూలే నూత్న సంస్కృతికి బాటలు వేసారు. స్త్రీ ఒక మౌళిక విద్యా సంపన్నురాలు. ఆమెని లిఖిత సమాజంలోకి గాని తీసుకొస్తే ఆమె ప్రపంచాన్ని వెలిగించగలిగిన స్థాయికి వెళుతుందని సావిత్రిబాయి ఫూలే నమ్మారు. అందుకే ఆమె విద్యా వ్యవస్థ నిర్మాణానికి కృషి చేసారు. సావిత్రిబాయిఫూలే, జ్యోతిరావు ఫూలేలు సత్య శోధక్ సమాజ్ ద్వారా కూడా సమాజాన్ని పునరుజ్జీవింప చేశారు. బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో కూడా అధికార యంత్రాంగంలో ఎక్కువ బ్రాహ్మణులే ఉండేవారు. ఒక జాతిపరంగా అధికారులు, ఒక జాతిపరంగా పీడితులు ఉండటం అయనకు బాధ కలిగించింది. తరతరాలుగా ఉన్న జాతి వైషమ్యాలతోపాటు నిరుపేదలైన శూద్రులనూ అతిశూద్రులనూ పీడించే బ్రాహ్మణ పురోహితులు అధికారులు కావటం తప్పలేదు. న్యాయవాదులు, షావుకార్లు, ప్రభుత్వోద్యోగులు అంతా ఒకే వర్ణానికి చెంది ఉండటం సాంఘిక ఆర్థిక సంక్షోభానికి దారి తీయక తప్పదని ఆయన అన్నాడు. "గులాంగిరీ" (స్లేవరీ, బానిసత్వం) అనే మాట మనుషులను అమ్మడం – కొనడం అనే అర్థంలోనే జోతిబా వాడారు. ఆ విధమైన బానిసత్వం బ్రిటిష్ సామ్రాజ్యంలో రష్యా అమెరికాలలో కూడా 1833లోనూ అంతమైంది. భారతదేశంలోని సమస్య అలాంటి సమస్య కాదు. ఇది మతం ముసుగులోని బానిసత్వం. శూద్రులు అతి శూద్రులు శతాబ్దాలుగా వంశపారంపర్యంగా బ్రాహ్మణుల బానిసలు. అస్పృశ్యుల సంగతి ఇక చెప్పనవసరమే లేదు. వారికి మనుషులుగా గుర్తింపే లేదు. ఇక్కడిది అమ్మడం కొనడం అనే వ్యవహారంలేని బానిసత్వం. ఈ రచనకు అమెరికా సంయుక్త రాష్ట్రాల పోరాటం స్ఫూర్తినిచ్చిందని జోతిబా సమకాలికుల అభిప్రాయం.

బ్రాహ్మణులలోని చాలా శాఖలు ప్రాచీన కాలంనుంచీ వున్నవి కావనీ అనంతర కాలంలో పురాణాలు సృష్టించుకొని వాటికి ప్రాచీనతనూ గౌరవాన్నీ ఆపాదించారనీ జోతిబా అభియోగం. బుద్ధుని కాలంలో ఒకే విధమైన ఆచార వ్యవహారాలు, వస్త్రధారణారీతులు కలిగి ఉన్న హిందూసమాజం అప్పుడే కులానుగుణంగా బాహ్యమైన మార్పులకు లోనయింది. ఉత్తర భారతదేశపు బ్రాహ్మణుల కట్టు, బొట్టు, ఆహార నియమాలు, ఆచారాలు అక్కడి క్షత్రియులతోనూ, శూద్రులతోనూ అంతగా భేదించలేదు. కానీ, దక్షిణాదిన మాత్రం బ్రాహ్మణులు ఇతర కులాల వారికి భిన్నంగా శాఖాహారులుగా మారారు. పశ్చిమ భారతదేశంలో బ్రాహ్మణులు అధికారం పదవులు సంపాదించి ఇతర కులాల నుంచి వేరయ్యారు. పౌరోహిత్యమూ అధికార పదవులూ మతపరంగానూ, సాంఘిక పరంగానూ, ఆర్థికంగానూ, బ్రాహ్మణులను సంఘంలో నిరంకుశులుగా చేశాయి. అది ఇతర కులాల వారికి కంటగింపైంది. జ్యోతిబా జీవితం ఈ వ్యవస్థపైనే తిరుగుబాటు చేసింది. సావిత్రిబాయి ఫూలే విద్యా పోరాటం వెనుక ఒక తాత్విక దృక్పథం ఉంది. ఒక సంస్కృతిక విప్లవ పోరాట దృష్టి ఉంది. వారు బ్రాహ్మణుల ద్వేషాన్ని ప్రేమతో జయించారు. వారిది ఒక ప్రత్యామ్నాయ జీవన సంస్కృతి వికాస ఉద్యమశక్తి. వారిలో ఒక త్యాగ గుణం పట్టుదల నిరంతరాయంగా ఉంది. వారు దేనికి భయపడలేదు. ఎప్పుడూ వెనుదిరగలేదు. వారి పోరాటంలో ద్విగుణీకృత శక్తి ఉంది. మేము విజయం పొందగలము అనే ఒక పట్టుదలతో ఈ అభేద్యమైన పోరాటాన్ని కొనసాగించారు. వీరిలో బౌద్ధ, తాత్విక, సంస్కృతీ వికాసం ఉంది. మానవులందరు సమానం అనే భావన ఉంది. దమ్మపద జీవన గమనం ఉంది. మహత్మఫూలే, సావిత్రిబాయి ఫూలేలు గొప్ప అధ్యయనపరులు. గొప్ప రచయితలు కూడా. వారి రచనల్లో వారు బ్రాహ్మణవాదాన్ని తిప్పికొట్టారు.

సావిత్రిబాయి ఫూలే జీవితం మనకు ఆదర్శం కావాలంటే దళిత ఉద్యోగులైన స్త్రీలు వందలకు వందలు వస్త్రాలకు ఖర్చుపెట్టడం మాని, పుస్తకాలు కొనాలి. ప్రతి ఇంట్లో ఒక గృహ గ్రంథాలయాన్ని రూపొందించుకోవాలి. ఇండ్లలో పుస్తకాలు లేనట్లైతే మస్తకాలు బూజుపడతాయి. ఇండ్లను చిన్న చిన్న ఆశ్రమాలుగా రూపొందించుకోవాల్సిన అవసరం వుంది. ఉద్యమకారులైన భర్తలను వేధించకుండా వారికి సహకారాన్ని అందించడంలో సావిత్రిబాయి ఫూలేని ఆదర్శంగా తీసుకోవాలి. సావిత్రిబాయి ఫూలే ఒక సజీవమైన జీవన స్రవంతి. మానవతా పరిమళాన్ని వెదజల్లిన కార్యకర్త. తన భర్తను తనను చంపడానికి వచ్చిన వారిని ఎదిరించింది. స్త్రీలకు విద్యను అందించడానికి ఆమె టీచరుగా మారడమే గాక భారతదేశంలో వున్న టీచర్లకు ఆమె మార్గదర్శకమైంది. ఆమెను చూసే చాలా మంది టీచర్లు కాండక్టు నిర్ణయించుకున్నారు. ఆమె కార్యశీలి. ఆమె వాచకం మృదువైంది. ఆమె పలుకులు సూత్రబద్ధమైనవి. ఆమె కోరికల్ని నిరాకరించింది. ఆమె పరిసరాల్ని సేవామయం చేసింది. ఆడంబరాల్ని తృణీకరించింది. భర్తకు దారిచూపించే కాగడాగా వెలిగింది. ఈనాడు దళిత ఉద్యోగినులు సావిత్రిబాయి ఫూలే దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. నిరాడంబరమైన వస్త్రధారణ, చేతిలో పుస్తకం, ముఖంలో నవ్వు, ఆమె వ్యక్తిత్వం. ఇప్పటి స్త్రీలు ఆందోళనతో కనిపిస్తున్నారు. అప్పులలో మునిగిపోయి వుంటున్నారు. కోరికలు వారిని ముసురుతున్నాయి. ఈ సందర్భంగా సావిత్రిబాయి ఫూలేని ఆదర్శంగా తీసుకొని మన దళిత స్త్రీలు నూత్న ఉత్తేజాన్ని పొందవలసిన చారిత్రక సందర్భం ఇది.

ఫూలే దంపతులు 1842లో అన్ని వర్ణాల బాలికలకు విద్యాలయం ప్రారంభించారు. 1863లో సావిత్రిబాయిఫూలే విధవరాండ్ర రక్షణ కోసం ఒక ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఇదే కాలంలో వీరొక బ్రాహ్మణ విధవరాలి కుమారుణ్ని దత్తత చేసుకున్నారు. బ్రాహ్మణ స్త్రీలకు భర్తచనిపోతే శిరోముండనం చేసే ఆచారాన్ని సావిత్రిబాయి ఫూలే వ్యతిరేకించింది.

ఫోన్ : 9849741695

అనేక మార్పులు జరిగిన క్యాలెండర్

బుడ్డిగ జమిందార్

అక్టోబరు 4, 1582 తేదీని అక్టోబరు 15, 1582 గా అనుసరించాలని పోప్ గ్రెగోరి XIII అధికారికంగా నిర్ణయం తీసుకొన్నారు. దీనికి తోడు అంతకు ముందు అమలులో ఉన్న జూలియస్ క్యాలెండరు ప్రారంభతేదీని మార్చి 25 కి బదులుగా జనవరి 1 కి మార్చడమైనది. తద్వారా వసంతకాలంలో ఎల్లవేళలా ఈస్టర్ పండుగను జరుపుకోటానికి సులభతరమైనది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగు భూభ్రమణానికి సరిగ్గా ఈ కొత్త గ్రెగోరి కాలండరుకు లీప్ సంవత్సరంతో సహా నాల్గు కాలాలు (సీజన్లతో) వచ్చే సంవత్సరం ఏర్పడుతుంది. ఈ కొత్త క్యాలెండర్ ద్వారా నిత్య జీవితంలో నాల్గు కాలాలకు అంతరాయం కల్గకుండా కాలాల్ని బట్టి క్రమం తప్పకుండా పండుగలు, వ్యవసాయ ఆధారిత పంటల పండుగలు చేసుకొనుటకు సుగమం అయింది. దీనికి తోడు యూరపు ఖండంలో పిల్లలు ఎంతో ఇష్టంగా జరుపుకొనే క్రిస్టమస్ వేడుకల సమయంలో డిసెంబరు 25 నాడు మంచు ఉండాలనేది గ్రెగోరి ఆకాంక్ష కూడా. అయినప్పటికీ ప్రపంచంలో ఇంకా తూర్పు ఆర్థోడెక్ చర్చివారు జూలియస్ క్యాలండరు ఆధారంగా జనవరి 7 నాడు క్రిస్టమస్ వేడుకలు చేసుకొంటున్నారు, మార్చి 25 నాడు తల్లి గర్భంలోకి జీసస్ ప్రవేశించినట్లుగా చరిత్రకారుడు సెక్టుస్ జూలియస్ ఆఫ్రికానుస్ అంటారు. క్రీ.పూ.325 లేక 336 సంవత్సరంలో పోప్ లిబేరియస్ డిసెంబరు 24 నుంచి డిసెంబరు 25 మధ్యలో జీసస్ జననాన్ని బలపర్చారు. రోమన్ రారాజు జూలియస్ సీజరు నిస్సహాయంగా అస్తవ్యస్తంగా ఉన్న రోమన్ క్యాలండర్‌ను బాగుచేయటానికి పూనుకొని సంవత్సరంలో కొన్ని నెలలు కలిపి, కొన్ని నెలలు తీసేసి, లీపు సంవత్సరాల్ని కనుగొన్నాడు. కానీ ప్రాథమిక పొరపాటుగా భూభ్రమణాన్ని లెక్కించటంతో మొత్తం ప్రాజెక్టు కుప్పకూలింది. కాలెండరు ప్రకారం చూస్తే పంటలు చేతికి వచ్చే కాలానికి విత్తు మొలకెత్తేది కాదు. (అంటే ఉదాహరణకు సంక్రాంతి జోరున వర్షాలు కురిసే సమయం తర్వాత ఏరువాక సమయంలో వస్తే ఎలా ఉంటుందో ఊహించు కోవాలి) ఈ

అర్థంలేని వ్యవస్థను జూలియస్ సీజర్ పరిష్కరించాలను కొన్నాడు. అంటే రోమన్ సామ్రాజ్యాన్ని అక అక్షం (ఒకరోజు) సూర్యుని కక్ష్య (సంవత్సరం) పై భూమి భ్రమణం రెండింటితో సమలేఖనం చేసే క్యాలెండరు తీసుకువచ్చే ప్రయత్నం జూలియస్ సీజర్ ప్రయత్నించాడు. సీజర్ అన్వేషణ చరిత్రలో సుదీర్ఘమైన సంవత్సరాన్ని అందించింది. ఉన్న క్యాలెండరుకు నెలలను జోడించి, కొన్ని నెలలను తీసేసి, క్యాలెండర్ రుతువులను గమనించి, లీప్ సంవత్సరాన్ని తీసుకువచ్చింది. రోమన్ గణితానికి సంబంధించిన విచిత్ర చమత్కారాలతో క్యాలెండరు పట్టాలు తప్పిందని బిబిసి రాసింది. పురాతన రోమన్ క్యాలెండరులో చంద్రుని గమనం ఆధారంగా ఒక సంవత్సరానికి 10 నెలలుగా నిర్దేశించారు. 6 నెలలు 31 రోజులు, 4 నెలలు 30 రోజులు ఉండేవి. 304 రోజుల సంవత్సరం, మిగిలిన 2 శీతాకాల నెలలను లెక్కించేవారు కాదు. సూర్యుని ఉదయం, అస్తమయం మామూలుగానే జరిగేవి. కానీ ఈ రెండు నెలల రోజులను లెక్కించే వారుకాదు. క్రీ॥పూ॥ 731 లో రోమన్ సామ్రాజ్య 2 వ రాజు నుమాపోంపీలియస్ శీతాకాలంలో 2 నెలలను క్యాలండరుకు చేర్చి, 51 రోజులు కలిపి సంవత్సరాన్ని 354 రోజులు చేశాడు. అంకెల నమ్మకాలతో 355 రోజులు చేశారు. జనవరి, ఫిబ్రవరి మాసాలను సృష్టించారు. ఫిబ్రవరికి 28 రోజులు పెట్టారు. కానీ సోలార్ సంవత్సరానికి ఇంకా 11 రోజులు తగ్గాయి. దీనితో కొంతకాలానికి మార్చి 14 కాస్తా జూలై 11 అయింది. క్రీస్తు జనన లెక్కలే తప్పు చూపించసాగాయి. పంటల కోతల కాలం వేసవిలో గాక గ్రీష్మ రుతువులో వచ్చేవి. ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో ఖగోళ శాస్త్రవేత్త మాటల ప్రకారం క్రీ॥పూ॥ 46 లో జూలియస్ 2 మరో రెండు అదనపు నెలలను క్యాలెండరుకు జోడించి, ఆ 2 నెలలకు 67 రోజులుగా చెప్పి మొత్తం సంవత్సర క్యాలెండరును 445 రోజులు చేశాడు. అంటే ప్రతి సంవత్సరం భూమి అదనంగా సూర్యుని చుట్టూ 4 వ వంతు తిరుగుతుందని లెక్కగట్టి ప్రతీ 4 సంవత్సరాలకొకసారి అదనపు సమయాన్ని లీపు సంవత్సరంగా ప్రకటించారు. కాని ఈ లెక్క కూడా తప్పయింది. ప్రతీ సంవత్సరం సరిగ్గా 4 వ వంతు భూమి కంటే కొంచెం తక్కువ అంటే 11 నిమిషాల తేడాలో తిరుగుతుందని గమనించారు. ఇదీకూడా తప్పుగా గ్రహించి భూభ్రమణాన్ని లెక్కచేయుగా సంవత్సర కాలానికి 365.2421897 రోజులుగా లెక్కకట్టారు. ఇదీకూడా తప్పుగా గ్రహించి భూభ్రమణాన్ని లెక్కచేయుగా సంవత్సర కాలానికి 365.2421897 రోజులుగా లెక్కకట్టారు. 1582 లో ఈ 11 నిమిషాల తక్కువ కాలాన్ని పోప్ గ్రెగోరి హయాంలో సర్దుబాటు చేశారు. గ్రెగోరియన్ క్యాలండర్ చేసిన సంస్కరణ ద్వారా ప్రతీ 4 సంవత్సరాలకు ఫిబ్రవరి 29 రోజులతో లీప్ మాసంగా ప్రకటించి, 100 సంవత్సరాలకొకసారి లీపు సంవత్సరాన్ని తీసేయటం ద్వారా ఈ 11 నిమిషాల అధిక గమన మార్పును తీసివేయగలిగారు. అదే సందర్భంలో ప్రతీ 400 సంవత్సరాలకొకసారి లీపు సంవత్సరాన్ని తీయకుండా ఉంచాలి. కనుకనే 2000 సంవత్సరం లీపు సంవత్సరమైంది.

కానీ గ్రెగేరియన్ క్యాలండర్ కేవలం కథోలిక్ చర్చికి సంబంధించినది కావటంతో ప్రారంభంలో ప్రపంచంలో అన్ని దేశాల్లో అమలు కాలేదు. 1582 అక్టోబరు 4 తర్వాత అక్టోబరు 15 రావటమేమిటని అందరూ ఆక్షేపించారు. ఇంగ్లీషువారు గ్రెగేరియన్ క్యాలెండరును యు.కె.లో ఆమోదిస్తూ 1752 నుంచి మాత్రమే జనవరి 1 ని నూతన సంవత్సరంగా గుర్తించారు. అంతవరకూ వారికి మార్చి 25 వ తేదీ నూతన సంవత్సర రోజు. కనుక నేడు ప్రపంచ వ్యాప్తంగా నూతన సంవత్సరం జరుపుకొంటున్న జనవరి 1 బ్రిటీష్ వారికి 1752 నుంచి అని, కేథలిక్ రోమన్లకు 1582 అని గ్రహించాలి. రష్యన్లు 1699 నుంచి జనవరి1 ని నూతన సంవత్సరంగా స్వీకరించారు. అంతవరకూ పాత ఓర్తోడెక్స్ క్యాలెండరు ప్రకారం జనవరి 14 నూతన సంవత్సరంగా ఉండేది. చైనావారి లూనార్ క్యాలెండరుకు కొన్ని మార్పులతో జనవరి 21 నుంచి ఫిబ్రవరి 20 మధ్యలో నూతన సంవత్సర వేడుకలు చేసుకొంటారు. 1917 లో జరిగిన అక్టోబరు విప్లవం నాటికి రష్యాలో ఇంకా 11 రోజులు మార్పుతో చూసిన (అక్టోబరు 4 నుంచి 15 నాటికి) అక్టోబరు మాసం వాడుకలో లేదు. విప్లవం తర్వాత అంతర్జాతీయ తేదీలననుసరించి గ్రెగోరియన్ క్యాలెండరు ప్రకారం నవంబరు 7 గా రష్యాలో మార్పు చేశారు. కొన్ని దేశాలలో ఇంకా తిథుల కోసం లూనార్ క్యాలెండర్లను వాడుతున్నప్పటికీ, వాడుక క్యాలెండర్‌గా గ్రెగోరియన్ క్యాలండర్ దేశ వ్యాప్తంగా వాడుతున్నారు. ఇది ఆంగ్ల క్యాలెండరు కాదు, ఇది రోమన్ కాథలిక్ పోప్ గ్రెగోరియన్ క్యాలండరుగా భావించాలి.

సీపీఐకి బ్రిటిష్ కమ్యూనిస్టుల అండ

ఆర్వీ రామారావ్

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడ్డ తరవాత ఎ.ఐ.టి.యు.సి. సమరశీల పోరాటాలు కొనసాగించడంతో వలస పాలకులు బెంబేలెత్తి పోయారు. అదే సమయంలో బ్రిటిష్ కమ్యూనిస్టు నాయకుల మద్దతు భారత కమ్యూనిస్టు పార్టీకి సమకూరింది. బ్రిటిష్ కార్మిక నాయకులు కుట్రలతో భారతదేశంలో కార్మికవర్గాన్ని రెచ్చగొడ్తున్నారని బ్రిటిష్ పాలకులు భావించారు. అందులో జార్జి అలిసన్, బెంజమిన్ ఫ్రాన్సిస్ బ్రాడ్లే, ఫిలిప్ స్ప్రాట్, లెస్టర్ హచిన్సన్ ది ప్రధాన పాత్ర అన్న అభిప్రాయం ఉండేది. అందుకే బ్రిటిష్ కమ్యూనిస్టు నాయకులను కట్టడి చేయాలనుకున్నారు. అదే సమయంలో "ప్రజా రక్షణ చట్టం", "కార్మిక చట్టాలు" తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే కుట్ర కేసులు మోపారు. ఈ కుట్ర కేసుల్లో బ్రిటిష్ కమ్యూనిస్టు నాయకులను కూడా చేర్చారు. వారూ జైలు శిక్ష అనుభవించవలసి వచ్చింది.

కొండంత అండ సక్లత్ వాలా

టాటాల కుటుంబానికి చెందిన షాపూర్జీ సక్లత్ వాలా భారత కమ్యూనిస్టులకు అండగా నిలిచారు. ఆయన దేశంలో అత్యంత సంపన్నమైన టాటాల కుటుంబంలో జన్మించినప్పటికీ కష్ట జీవుల వేపే నిలబడ్డారు. ప్లేగు వ్యాధి పీడితులు పిట్టల్లా రాలి పోవడం ఆయనను కలచి వేసింది. 1890లలో బొంబాయిలో ప్లేగు వ్యాధివల్ల ఎక్కువగా నష్టపోయింది పేదలు, కార్మికులు. సక్లత్ వాలా కుటుంబంతో సహా సంపన్నులు ప్లేగువల్ల అంతగా నష్టపోలేదు. ఆ సమయంలో సక్లత్ వాలా కళాశాల విద్యార్థి. విప్లవ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు వాల్డెమర్ హాఫ్కిన్ తన స్వదేశమైన రష్యా వదిలి రావలసి వచ్చింది. ఆయన శాస్త్రవేత్త. ఆయన ప్లేగు వ్యాధికి టీకా కనిపెట్టారు. ప్లేగు వ్యాధికి టీకా తీసుకోవాలని సక్లత్ వాలా ఇంటింటికీ తిరిగి జనానికి నచ్చ చెప్పారు. సక్లత్ వాలా నూలు వ్యాపారి దొరాబ్జి కుమారుడు. ఆయన భార్య జెరాబీ టాటా గ్రూపును ప్రారంభించిన నుస్సెర్వాంజీ టాటా చిన్న కూతురు. అంతగా సఖ్యత లేని సక్లత్ వాలా తల్లిదండ్రులు ఆయన చిన్నతనంలోనే విడిపోయారు. ఆయన దొరాబ్జి సంరక్షణలో పెరిగారు. 1905లో షాపూర్జి సక్లత్ వాలా ఇంగ్లాండ్ వెళ్లిపోయి అక్కడ రాజకీయాల్లో లీనమయ్యారు. పేదలకు, అట్టడుగువర్గాలవారికి సహాయపడేవారు. ఆ తరవాత లేబర్ పార్టీలో చేరారు. 1909 లో బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీలోచేరి 1922లో పార్లమెంటు సభ్యుడయ్యారు. ఆయనే బ్రిటన్‌లో పార్లమెంటు సభ్యుడైన మొదటి కమ్యూనిస్టు. పేదరిక నిర్మూలనకు సామ్రాజ్యవాద పాలన ఉపకరించదని, సోషలిజమే పరిష్కారం అని సక్లత్ వాలా నమ్మేవారు. అప్పుడే పరిపాలనలో ప్రజల పాత్ర ఉందనుకున్నారు. సక్లత్ వాలా



షాపూర్జీ సక్లత్ వాలా



లెస్టర్ హచిన్సన్



ఫిలిప్ స్ప్రాట్



జార్జ్ అలిసన్

బ్రిటన్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలోనే భారత్ లో పర్యటించారు. గాంధీజీ సిద్ధాంతాలతో ఆయనకు ఏకీభావం లేనప్పటికీ వారి మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు సాగేవి. గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం కూడా సక్లత్ వాలాకు నచ్చలేదు. సక్లత్ వాలా మంచి వక్త. ఆయన ఉపన్యాసాలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని కలవర పెట్టాయి. ఆయన భారత్ కు రాకుండా 1927లో నిషేధం విధించారు. పార్లమెంటు సభ్యత్వం ముగిసిన తరవాత కూడా ఆయన భారత స్వాతంత్ర్య పోరాటాన్ని గట్టిగా సమర్థించేవారు.

ఫిలిప్ స్ప్రాట్

ఫిలిప్ స్ప్రాట్ రచయిత, మేధావి. మాస్కో కేంద్రంగా పని చేస్తున్న కొమింటర్న్ భారత్‌లో కమ్యూనిస్టు సిద్ధాంత ప్రచారానికి భారత్ కు పంపించింది. ఆయన ఎం.ఎన్.రాయ్ కు సన్నిహితంగా ఉండేవారు. కమ్యూనిస్టు కార్యకర్తగా మారారు. ఆయన దేశంలో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులలో ఒకరు. మీరట్ కుట్ర కేసు బాధితుడు. సి.రాజగోపాలా చారి నిర్వహించిన స్వరాజ్య పత్రికకు ఆయన కొంత కాలం సంపాదకుడిగా ఉన్నారు. పుస్తకాలు, వ్యాసాలు, కరపత్రాలు ధారాళంగా రాసేవారు. ఫ్రెంచి, జర్మన్, తమిళం, సంస్కృతం, హిందీ నుంచి అనేక గ్రంథాలు ఇంగ్లీషులోకి అనువదించారు. సింగారవేలు చెట్టియార్ మనవరాలు సీతను పెళ్లాడారు.

రజనీ పామీదత్ అన్న క్లెమెన్స్ దత్ కూడా భారత్ వెళ్లి కమ్యూనిజం వ్యాప్తికి కృషి చేయాలని సూచించడంతో స్ప్రాట్ మన దేశం వచ్చారు. వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించారు. ఆ పార్టీ జాతీయ నాయకులలో ఒకరయ్యారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో ఆయన రాసిన వ్యాసాలను "ఆన్ ఇంటర్నేషనలిస్ట్" గ్రంథంగా ప్రచురించారు. దానికి సక్లత్ వాలా ముందు మాట రాశారు. ఆ గ్రంథాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. మీరట్ కుట్ర కేసులో స్ప్రాట్ కు 12 ఏళ్ల శిక్ష పడింది. తరవాత దాన్ని రెండేళ్లకు తగ్గించారు. అయితే 1930లో స్ప్రాట్ కమ్యూనిస్టు సిద్ధాంతంలో విశ్వాసం కోల్పోయారు.

బెంజమిన్ ఫ్రాన్సిస్ బ్రాడ్లే

బ్రాడ్లే బ్రిటిష్ కమ్యూనిస్టు, కార్మిక నాయకుడు. భారత్ లో వలస పాలనను పడదోయడానికి ప్రయత్నిస్తున్నాడనే ఆరోపణలుండేవి. మీరట్ కుట్ర కేసులో జైలు శిక్ష అనుభవించారు. ఆయనను జైలులో పెట్టిన తరవాత వామపక్ష కరపత్ర సాహిత్యం విపరీతంగా వెలువడింది. 1921లో రెండేళ్లు ఇంజనీరుగా పని చేయడానికి బ్రాడ్లే భారత్ వచ్చారు. రావల్పిండిలో ఒక పెద్ద కర్మాగారంలో పని చేస్తున్నప్పుడు అక్కడి కార్మికుల పని పరిస్థితులను చూసి విచలితులయ్యారు. 1923 లో స్వదేశం వెళ్లి పోయి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. మళ్లీ ఆయన 1927 లో భారత్ వచ్చారు. ఎ.ఐ.టి.యు.సి., వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ కార్యవర్గ సభ్యుడయ్యారు. అలాగే గిర్నీ కామ్ గార్ యూనియన్ ఉపాధ్యక్షులయ్యారు.

జార్జ్ అలిసన్

అలిసన్ బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక సభ్యుడు. అక్రమంగా భారత్ లో అడుగు పెట్టినందుకు ఆయన మీద కేసు పెట్టారు. మీరట్ కుట్ర కేసులో ఆయన పేరు చేర్చారు. కానీ అరెస్టు చేయలేకపోయారు.

లెస్టర్ హచిన్సన్

హచిన్సన్ పత్రికా రచయిత. ఆయన తల్లిదండ్రులు బ్రిటన్ లో వామపక్షవాదులు. ఆయనను మీరట్ కుట్రకేసులో అరెస్టు చేసినా నింబ్కర్ తో పాటు విడుదల చేశారు. 1928 సెప్టెంబర్ లో ఆయన భారత్ కు వచ్చినప్పుడు గూఢచారవర్గాలు ఆయనను కమ్యూనిస్టుగా ముద్ర వేశాయి. సరోజినీ నాయుడు కుటుంబంతో ఆయనకు సాన్నిహిత్యం ఉండేది. డాంగేతో కలిసి హచిన్సన్ గిర్నీ కామ్‌గార్ యూనియన్లో పని చేశారు. ఇండియన్ డైలీ మెయిల్ పత్రికలో కూడా పని చేశారు.

శాస్త్రవేత్త మణిలాల్ మృతి

త్రిసూర్: వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, 2020 నాటి పద్మశ్రీ అవార్డు గ్రహీత కేఎస్ మణిలాల్ (86) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. 17వ శతాబ్దం నాటి లాటిన్ గ్రంథం 'హోర్టస్ మలబారికస్'ను ఆంగ్లంతోపాటు మలయాళంలోకి అనువదించడం ఆయనకు మంచి పేరు తెచ్చింది. మలబార్ ప్రాంతంలోని సుసంపన్నమైన వృక్షజాలాన్ని ఇందులో అక్షరబద్ధం చేశారు. యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో బోటనీ విభాగం అధిపతిగా మణిలాల్ పనిచేశారు. అనేక పుస్తకాలు రాసి... 200కు పైగా పరిశోధన పత్రాలు ప్రచురించారు. కొత్త వృక్ష జాతులను కనుగొని జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అవార్డులు అందుకున్నారు. మణిలాల్ మృతికి సంతాపం తెలుపుతూ 'వృక్షశాస్త్రంలో ఆయన చేసిన మహోన్నత కృషి భావి శాస్త్రవేత్తలు, పరిశోధకులకు మార్గదర్శకంగా నిలుస్తుంది' అని ప్రధాని మోదీ 'ఎక్స్' ద్వారా పేర్కొన్నారు.

నితీశ్ కోసం ద్వారాలు తెరిచే ఉంచాం: లాలు

పాట్నా: 'బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కోసం మా తలుపులు తెరిచే ఉన్నాయని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అన్నారు. 'మేము (ఇండియా ఐక్య సంఘటన) తలుపులు తీసివుంచాం. ఆయన కూడా తలుపుల గొళ్లాలు తీయాలి. అప్పుడే రెండు పక్షాల వారికి ప్రయోజనం ఉంటుంది' అని ఓ ఇంటర్వ్యూలో లాలు అన్నారు. దీనిపై నితీశ్ కుమార్‌ను విలేకరులు ప్రశ్నించగా ఆయన తన చేతులు జోడించి, చిరునవ్వుతో మీరు ఏం అంటున్నారు?' అని మాత్రమే అన్నారు. మరో మాట మాట్లాడలేదు. అయితే లాలు తాజా వ్యాఖ్యలతో మరోసారి పొత్తు పొడుస్తుందన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ ఇద్దరు నేతలను బీహార్ రాజకీయాల్లో అన్నదమ్ములుగా ప్రసిద్ధి. లాలు యాదవ్, నితీశ్ కుమార్ గత దశాబ్ద కాలంలో రెండు సార్లు పొత్తు పెట్టుకున్నారు. 2024లో ఎన్డీయేలోకి జేడీయూ వెళ్లేంత వరకు కూడా మహాకూటమిలో వీరి పాత్ర కీలకం. కాగా, తన తండ్రి, లాలు మాటలను ఆర్జేడీ అగ్రనాయకుడు తేజస్వీ యాదవ్ తోసిపుచ్చారు. మీడియాను తృప్తి పర్చేందుకు ఆయన అలా మాట్లాడారని అన్నారు. 'ఆయన (లాలు) ఇంకేం చెబుతారు? మీరు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు అంతే' అని వ్యాఖ్యానించారు. కొత్త సంవత్సరంలో నితీశ్ పాలన అంతమవుతుందన్నారు. తన సన్నిహిత సలహాదారుల గుప్పెట్లోకి నితీశ్ కుమార్ వెళ్లిపోయారని, ఆయన సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదని, సమర్థంగా, స్వతంత్రంగా బీహార్‌ను నితీశ్ కుమార్ పాలించలేరని కూడా తేజస్వి అన్నారు.

అత్యాచారంపై రాజకీయమా?

మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై లైంగిక దాడి కేసు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసు దర్యాప్తులో పోలీసుల తీరు, రాష్ట్రంలో నెలకొంటున్న పరిణామాలపై మద్రాస్ హైకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను ఒక హెచ్చరికగా భావించకుండా రాజకీయం చేస్తున్నారని మండిపడింది. విద్యార్థినిపై లైంగిక దాడికి నిరసనగా ఆందోళన చేపట్టేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారంటూ పట్టలి మక్కల్ కట్చి (పీఎంకే) పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ పి.వేల్‌మురుగన్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌లో రాజకీయ కోణం తప్ప... బాధితురాలికి న్యాయం చేయాలన్న తపన కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు నిరసనలను ఉపయోగించుకుంటున్నాయని, అందులో నిజాయతీ ఉండటం లేదని జస్టిస్ వేల్‌మురుగన్ అన్నారు. మీడియాపైనా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అలాగని, సమస్యలను రిపోర్టు చేయడం సరికాదనడం తన ఉద్దేశం కాదని చెప్పారు. కొన్ని విషయాల్లో మీడియా అనుసరిస్తున్న పద్ధతి సరికాదని వ్యాఖ్యానించారు. 'కులం, మతం, స్త్రీ,పురుష వివక్ష తదితర అసమానతలు కొనసాగుతున్న ఈ కాలంలో జీవించి ఉండటం నాకు సిగ్గేస్తోంది. నిజంగా మనమంతా సిగ్గుపడాలి. గట్టిగా చెప్పాలంటే అలాంటి నేరాల్లో మనమంతా సహనిందితులమే' అని జస్టిస్ వేల్ మురుగన్ అన్నారు.

'ప్రార్థనా స్థలాల చట్టం'పై సుప్రీంలో ఒవైసీ పిటిషన్

న్యూఢిల్లీ: ప్రార్థనా స్థలాల చట్టాన్ని (1991) పటిష్టంగా అమలు చేయాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు గురువారం అంగీకారం తెలిపింది. 1947, ఆగస్టు 15న మతపరమైన స్థలాల అంశంలో ఎటువంటి చట్టం అమలులో ఉందో, అదే తరహా విధానాన్ని కొనసాగించాలని పిటీషన్‌లో కోరారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ చేపట్టింది. ప్రార్థనా స్థలాలకు చెందిన కేసులతో లింకున్న వాటికి అసద్ పిటీషన్‌ను జోడించాలని సుప్రీం ఆదేశించింది. ఫిబ్రవరి 17న ఆ పిటీషన్‌పై విచారణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎంపీ అసదుద్దీన్ తరపున అడ్వకేట్ నిజాం పాషా వాదించారు.

మహాయుతిలో విభేదాలు?

పవార్‌లు మళ్లీ కలుస్తారా...

ముంబై: మహారాష్ట్ర అధికార కూటమి మహాయుతిలో విభేదాలు తలెత్తినట్లు వార్తలు వస్తున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత అజిత్ పవార్ కూటమిని వీడి మళ్లీ తన బాబాయ్ ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌తో చేతులు కలపనున్నట్లు ప్రచారం జరుగుతోంది. డిసెంబర్ 12న శరద్ పవార్ పుట్టిన రోజు సందర్భంగా అజిత్ పవార్ ఆయనను కలిశారు. దిల్లీలోని శరద్ నివాసానికి వెళ్లారు. దీంతో అక్కడే వీరిద్దరి మధ్య సయోధ్య కుదిరినట్లు ఊహాగానాలు మొదలయ్యాయి. మహాయుతి కూటమిని వీడి శరద్ పవార్‌తో కలిసి పని చేసేందుకు అజిత్ సిద్ధమైనట్లు వదంతులు వస్తున్నాయి. ఈ క్రమంలోనే అజిత్ పవార్ తల్లి ఆశాతై విలేకరులతో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవార్ కుటుంబంలోని విభేదాలు తొలగిపోయి... తన కుమారుడు, శరద్ పవార్‌తో కలిసి ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'ఎన్సీపీ నుంచి విడిపోయినప్పటికీ శరద్ పవార్‌పై మాకు అమితమైన గౌరవం ఉంది. ఆయన మాకు తండ్రితో సమానం. పవార్ కుటుంబం మళ్లీ కలవాలని కోరుకుంటున్నా' అని ఎన్సీపీ సీనియర్ నేత ప్రఫుల్ పటేల్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు అజిత్, శరద్ పవార్‌లు మళ్లీ కలుస్తారనే ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూర్చాయి. కాగా.. శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీని చీల్చి షిండే వర్గంలో చేరిన అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. త్వరలో ఆయన తన బాబాయ్‌తో కలిసిపోయే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎన్డీయే మనుగడ కష్టమే: సంజయ్‌రౌత్

ముంబై: కేంద్ర ప్రభుత్వంపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 తర్వాత కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంటుందో లేదో అనే అనుమానం వెలిబుచ్చారు. సంజయ్ రౌత్ ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ '2026 తర్వాత కేంద్ర ప్రభుత్వం మనుగడ సాగిస్తుందా లేదా అన్న సందేహం నా మనసులో ఉంది. ప్రధాని మోదీ తన పదవీకాలాన్ని పూర్తి చేసుకోలేకపోవచ్చు. కేంద్ర ప్రభుత్వంలో అస్థిరత ఏర్పడితే మహారాష్ట్రలోనూ ఆ ప్రభావం కన్పిస్తుంది' అని పేర్కొన్నారు. శివసేన(యూబీటీ) పార్టీకి చెందిన రాజన్ సాల్వీ పార్టీ వీడతారన్న ఊహాగానాలపై స్పందిస్తూ దర్యాప్తు సంస్థలు అరెస్టు చేస్తారనే భయంతోనే అనేకమంది పార్టీని వీడుతున్నారని రౌత్ అన్నారు. దర్యాప్తు సంస్థలకు, కేంద్ర ఒత్తిళ్లకు భయపడని వ్యక్తులతో పార్టీ ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపైనా రౌత్ తీవ్ర విమర్శలు చేశారు. 'ఏక్‌నాథ్ షిండేకు తన సొంత పార్టీపైనే నియంత్రణ లేదు. పార్టీపరంగా ఆయన ఏ నిర్ణయం తీసుకోవాలన్నా... ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్దకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఉన్నారు. కానీ, బాలాసాహెబ్ సిద్ధాంతాలతో నడుస్తున్న మా శివసేన (యూబీటీ) విధానాలు ఇలాంటి వాటికి విరుద్ధం. మేం ఎవరి ముందు తలవంచాల్సిన పనిలేదు' అని పేర్కొన్నారు.

రద్దు చేసిన సాగు చట్టాల అమలుకు

కేంద్రం దొడ్డిదారి యత్నాలు

అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: రద్దు చేసిన సాగు చట్టాలను తిరిగి అమల్లోకి తెచ్చేందుకు కేంద్రం దొడ్డిదారి ప్రయత్నాలు చేస్తోందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. నూతన 'పాలసీ' పేరిట నల్ల చట్టాల అమలుకు యత్నిస్తోందన్నారు. రాష్ట్రాల అభిప్రాయాన్ని కోరుతూ పంపిన 'పాలసీ' ప్రతిని ఆయన 'ఎక్స్'లో పంచుకున్నారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్దతతో పాటు తమ డిమాండ్ల పరిష్కారానికిగాను దీక్ష చేస్తున్న పంజాబ్ రైతులకు ఏమైనా జరిగితే అందుకు బాధ్యత బీజేపీదేనని కేజ్రీవాల్ పేర్కొన్నారు. 'వ్యవసాయ మార్కెటింగ్ కార్యాచరణకు జాతీయ విధానం' పేరుతో కొత్తగా ప్రకటించిన ముసాయిదా విధానాన్ని పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఏడాదికిపైగా సాగిన రైతాంగ పోరాటం తర్వాత 2020లో నల్ల సాగు చట్టాలను కేంద్రం రద్దు చేసింది. ఇప్పుడు వాటినే కొత్తగా అమల్లోకి తెచ్చేందుకు దొడ్డి దారిన యత్నిస్తోంది. మూడేళ్ల కిందట రైతుల నిర్ణయాన్ని అంగీకరించిన సర్కార్ ఇప్పుడు ఆ నిర్ణయాన్ని మార్చుకుంది. బీజేపికి ఎందుకు ఇంత అహంకారం. ఎవరితో మాట్లాడదు. సంప్రదింపులు జరపదు. నిరవధిక దీక్ష చేస్తున్న రైతులను ఆ దేవుడు చల్లగా చూడాలి. వారికి ఏమైనా జరిగితే బీజేపీదే బాధ్యత' అని కేజ్రీవాల్ హిందీలో పోస్టు పెట్టారు.

దిల్లీలో ఆప్, బీజేపీ 'పోస్టర్' యుద్ధం

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశ రాజధాని దిల్లీలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్), బీజేపీ ప్రచారంలో కొత్త పోకడలు ఎంచుకున్నాయి. పోస్టర్ల యుద్ధానికి దిగాయి. అటు ఆప్, ఇటు బీజేపీ పోస్టర్ల ప్రచారం చేసుకుంటున్నాయి. బీజేపీ విడుదల చేసిన పోస్టర్‌కు ఆప్ తనదైనశైలిలో ప్రతి పోస్టర్‌ను ప్రచారంలోకి తీసుకొచ్చింది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్ ఒకే అడ్రస్‌లో వందల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని బీజేపీ ఎక్స్ వేదికగా ఆరోపించింది. ఇంటి యజమానికి తెలియకుండా నకిలీ ఓటర్లను రిజిస్టర్ చేస్తున్నారని దుయ్యబట్టింది. ఇది కేజ్రీవాల్ కొత్త గేమ్ అంటూ తీవ్ర విమర్శలు చేసింది. ఆప్‌నకు నకిలీ ఓటర్లపై ప్రేమ అనే అర్థం వచ్చేలా పోస్టర్‌ను షేర్ చేసింది. దీనికి ఆప్ కౌంటర్ ఇచ్చింది. ఆ విమర్శను తిప్పి కొడుతూ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) అంటూ కేజ్రీవాల్ ఉన్న ఒక పోస్టర్ వీడియోను పంచుకుంది. ఇదిలాఉంటే... దిల్లీలో ఓటర్లకు బీజేపీ నగదు పంపిణీ చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్ ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్‌కు లేఖ రాశారు. కమలం పార్టీ చేస్తున్న తప్పిదాలను ఆర్‌ఎస్‌ఎస్ ఆమోదిస్తుందా అని ప్రశ్నించారు.

3.4 లక్షల చెట్లు తొలగిస్తేనే...

శబరిమల విమానాశ్రయంపై నివేదిక

త్రివేంద్రం: శబరిమల సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మించేందుకు సుమారు 3.4 లక్షల చెట్లు తొలగించాల్సి ఉంటుందని కొట్టాయం జిల్లా అధికారులు ఓ నివేదికను తయారు చేశారు. దీని కోసం సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నివేదికను రూపొందించారు. ఎయిర్‌పోర్టు నిర్మిస్తే సుమారు 353 కుటుంబాలను తరలించాల్సి వస్తుందని రిపోర్టులో పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 3.3 లక్షల రబ్బరు, 2,492 టేకు, 2,247 వైల్డ్ జాక్, 1,131 జాక్‌ఫ్రూట్, 828 మహోగని, 184 మామిడి చెట్లను తొలగించాల్సి ఉంటుంది. వీటితో పాటు ఆ ప్రాంతంలో ఏడు మతపరమైన ప్రదేశాలను మార్చాల్సి వస్తోందని రిపోర్టులో తెలిపారు. 347 కుటుంబాలు ప్రత్యక్షంగా నష్టపోనున్నారు. దీంట్లో 238 కుటుంబాలు చెరువెల్లి ఎస్టేట్‌లో పనిచేస్తున్నారు. ఇక్కడ చెరువెల్లి జాతి ఆవు కూడా ఉన్నాయి. ఎస్టేట్‌ను మార్చేస్తే, ఆవుల పరిస్థితి దయనీయంగా ఉంటుందని రిపోర్టులో వెల్లడించారు. విమానాశ్రయం కోసం 1039.876 హెక్టార్ల భూమి అవసరం ఉంటుంది. మణిమాల, ఎరుమేలి దక్షిణ గ్రామాల నుంచి సేకరించనున్నారు. శబరిమల యాత్రికులు, ఎన్‌ఆర్‌ఐలు, పర్యాటకులు, ఇతర ప్రయాణికుల కోసం కేఎస్‌ఐడీసీ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. ట్రావెన్‌కోర్ యాత్రా స్థలాలకు వెళ్లే మార్గాలకు దారి సులువు అవుతుంది. వావరు మసీదు, మారమన్ కన్వెన్షన్, ఎటుమన్నూర్ మహాదేవ ఆలయం వంటి ప్రదేశాలకు ప్రజల తాకిడి పెరుగుతుంది. ఆర్థిక వ్యవస్థ బలపడనున్నది. టూరిస్టుల సంఖ్య పెరగనున్నది. కుమరొక్కం బ్యాక్‌వాటర్స్, మున్నార్ హిల్ స్టేషన్స్, గావి ఫారెస్ట్, టెక్కడీ వైల్డ్‌లైఫ్ సాంక్చురీ, పెరియార్ టైగర్ రిజర్వ్, ఇడుక్కి డ్యామ్‌కు లింకు రోడ్డు నిర్మాణం సుగమం అవుతుంది.

కుంభమేళాకు బాంబు బెదిరింపు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే మహాకుంభమేళాకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. ఓ ఎక్స్ యూజర్ ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. మతపరమైన ఈ కార్యక్రమానికి హాజరయ్యే భక్తులను లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన యూపీ పోలీసులు ... ఎక్స్ యూజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

45 కోట్లమంది భక్తులు గంగాస్నానం ఆచరిచేం అవకాశం ఉంది. కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. 1.60 లక్షల టెంట్లు, 1.50 లక్షల మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. ఎల్‌ఈడీ లైట్లు, సోలార్ లైట్లు, లక్షలాది మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్‌ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

యూటీ హోదా తాత్కాలికమే

రాష్ట్ర హోదా పునరుద్ధరణపై ఒమర్ అబ్దుల్లా ఆశాభావం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు కేంద్ర పాలిత ప్రాంత హోదా తాత్కాలిక దశ అని, పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామన్న హామీని కేంద్ర ప్రభు త్వం నెరవేరుస్తుందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గురువారం ఆశాభావం వ్యక్తం చేశారు. షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (ఎస్‌కేఐసిసి)లో మీడియా ప్రతినిధుల సమావేశంలో ఒమర్ మాట్లాడుతూ... 'మేము అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటింది. యూటీ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి మాకు సమయం పట్టింది. మాకు ఇంతకుముందు ప్రభుత్వంతో అనుబంధం ఉంది. కానీ ఆ రూపానికి మరియు ప్రస్తుత రూపానికి చాలా వ్యత్యాసం ఉంది' అని అబ్దుల్లా అన్నారు. కొత్త ప్రభుత్వం ప్రారంభం బాగానే ఉందని, అందులో తమకు పెద్దగా ఇబ్బంది లేదని ముఖ్యమంత్రి అన్నారు. "మేము మా ఎన్నికల వాగ్దానాలకు కట్టుబడి ఉన్నాము. కొన్ని వాగ్దానాలను అమలు చేసే ప్రక్రియను ప్రారంభించాం. ఇతర వాగ్దానాల కోసం వ్యవస్థలో మార్పు అవసరం. యూటీగా ఉండటం తాత్కాలిక దశ అని నేను భావిస్తున్నాను" అని అబ్దుల్లా అన్నారు. తమ పార్టీ మేనిఫెస్టో ఐదు వారాలు, ఐదు నెలలు కాదు ఐదేళ్ల కాలానికి అని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. తమకు కొన్ని అంశాలు ముఖ్యమని చెబుతూ... రాష్ట్ర సాధనపై తీర్మానం, ప్రత్యేక హోదాపై తీర్మానం వంటి వాటిని నెరవేర్చామని ఆయన చెప్పారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ తమ అతిపెద్ద వాగ్దామని, వీలైనంత త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొందని గుర్తు చేశారు. అప్పటి నుండి ఏడాది గడిచిపోయింది. ఇది సరిపోతుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. కేంద్రం ప్రజల మనోభావాలను గౌరవించి వారి ఆకాంక్షలను నెరవేర్చాలని అబ్దుల్లా అన్నారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కోర్టులను ఆశ్రయించే బదులు అసెంబ్లీ తీర్మానంతో కేంద్రం వద్దకు ఎందుకు వెళ్లారని అడగ్గా... ఈ విషయంపై న్యాయ పోరాటం చివరి ఎంపిక అని అబ్దుల్లా అన్నారు. 'ఏమీ లేకుండా కోర్టుకు వెళ్లడం పోరాటం అవుతుంది. పోరాటం ఎప్పుడూ మొదటి ఎంపిక కాకూడదు... అది చివరి ఎంపికగా ఉండాలి. రాష్ట్ర హోదా పునరుద్ధరణ గురించి ఎస్సీ మాట్లాడకపోతే, ప్రధాన మంత్రి, కేంద్ర హోంమంత్రి మాట్లాడకపోతే... మేము కోర్టులకు వెళ్ళవచ్చు.. కానీ వారు వాగ్దానాలు చేశారు కనుక మేము మొదట వారికి అవకాశం ఇవ్వాలి' అన్నారాయన. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉన్నంత అధికారం కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రికి లేదని ఆయన ఒమర్ తెలిపారు. "మా భావజాలాన్ని మార్చుకోవాలని ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా రాజ్‌భవన్ నుండి మాపై ఎలాంటి ఒత్తిడి లేదు. మీకు పూర్తి సహకారం అందిస్తామని ప్రధానమంత్రి, హోంమంత్రి తనకు చెప్పారన్నారు. ప్రజల ఆదేశాన్ని తాము గౌరవిస్తామని వారు ప్రకటించారని గుర్తు చేశారు.

పన్సారే కేసు విచారణ వేగవంతం

బాంబే హైకోర్టు ఆదేశం



ముంబై: ప్రముఖ హేతువాది, సీపీఐ నేత గోవింద్ పన్సారే హత్యకేసును త్వరితగతిన విచారణ జరపాలని బాంబే హైకోర్టు గురువారం ఆదేశించింది. ఈ హత్యకేసులో ప్రధాన నిందితుడు వీరేంద్ర తవాడే దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అజరు ఎస్.గడ్కరీ, జస్టిస్ కమల్ ఖాటాతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో దర్యాప్తు చేయాల్సిన అంశం పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను గుర్తించడం మాత్రమేనని పేర్కొంది. విచారణపై ఈ కోర్టు పర్యవేక్షణ అవసరం లేదని, అయితే పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాత విచారణను వేగవంతం చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశిస్తామని ధర్మాసనం తెలిపింది. గోవింద్ పన్సారేను 2015 ఫిబ్రవరి 20న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఆయన నివాసం సమీపంలో హిందూ సంఘాలు కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ మందగించడంతో ఆయన కుమార్తె స్మితా పన్సారే బాంబే హైకోర్టును ఆశ్రయించారు.

దిల్జీత్ దొసాంజ్‌పై రైతన్నల ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రముఖ గాయకుడు, నటుడు దిల్జీత్ దొసాంజ్ కలవడంపై పంజాబ్ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతన్నలు అనుమానాలు వ్యక్తంచేశారు. గాయకుడి నిబద్ధతను ప్రశ్నించారు. గతంలో రైతు ఉద్యమానికి మద్దతుగా దొసాంజ్ తన గళాన్ని వినిపించారు. దీనిని ఉద్దేశించి పంజాబ్-హర్యానా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరసన తెలుపుతోన్న రైతు నేత ఒకరు మాట్లాడుతూ 'దిల్జీత్ నిజంగా రైతుల గురించి ఆలోచిస్తుంటే... దలేవాల్‌జీకి సంఘీభావంగా ఇక్కడకు వచ్చి ఉండేవారు. మా ఆందోళనలు వినేవారు. గతంలో ఆయన చేసిన ప్రకటనకే కట్టుబడి ఉండేవారు. దానికి బదులుగా ప్రధానిని కలవడం అనుమానాలకు తావిస్తోంది. మా డిమాండ్లు నెరవేరేవరకు ఈ పోరాటం కొనసాగుతుంది' అని స్పష్టం చేశారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దలేవాల్ నిరవధిక నిరశన దీక్ష చేపట్టారు. ఖనౌరీ వద్ద వేలాదిమంది రైతులు ఆయనకు మద్దతు తెలుపుతున్నారు. 38 రోజులుగా ఈ దీక్ష కొనసాగుతోంది. కాగా దలేవాల్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తుండటంతో వైద్యసహాయం అందించాలని పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ సమయంలో మోదీ-దిల్జిత్ భేటీకి సంబంధించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. గాయకుడిపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. అతడు ప్రజల హృదయాలు గెలిచాడని, దిల్జిత్ అనే పేరును సార్థకం చేసుకున్నాడని ప్రశంసించారు. మరోపక్క.. ప్రధాని నుంచి తాను ఎంతగానో స్ఫూర్తి పొందానని గాయకుడు కొనియాడాడు. '2025 గొప్పగా ప్రారంభమైంది. ప్రధానితో భేటీని ఎప్పటికీ మర్చిపోలేను' అని సామాజిక మాధ్యమాల్లో రాసుకొచ్చాడు.

బెంగాల్‌కు ముప్పు కలిగిస్తే ఊరుకోం

రాష్ట్రంలోకి చొరబాట్లు ప్రోత్సహిస్తున్న బీఎస్‌ఎఫ్

కేంద్రానికి నిరసన లేఖ పంపుతా: మమత

కోల్‌కతా: తమ రాష్ట్రంలోకి చొరబాట్లను సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) ప్రోత్సహిస్తోందని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. దీంతో ప్రాదేశికంగా సమస్యలు వస్తున్నాయని, ఈ కారణంగా రాష్ట్రానికి ఇబ్బంది కలిగితే బీఎస్‌ఎఫ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాజధాని కోల్‌కతాలోని నబనన సభాఘర్‌లో సమీక్షా సమావేశంలో మమత మాట్లాడుతూ 'ఇస్లాంపూర్, సితాయ్, చోప్రా తదితర ప్రాంతాల నుంచి చొరబాట్లను బీఎస్‌ఎఫ్ ప్రోత్సహిస్తోంది. మహిళలపై దురాగతాలకూ పాల్పడుతోంది. ఈ దాష్టీకాలను మీరు (జిల్లా మెజిస్ట్రేట్లు) ఎందుకు ప్రశ్నించలేదు. సరిహద్దు భద్రత మా (టీఎంసీ) చేతుల్లో లేదు. ఆ బాధ్యత బీఎస్‌ఎఫ్‌ది. ఎవరు వస్తున్నారు... ఎవరు వెళుతున్నారు వారికే తెలుసు. జిల్లా మెజిస్ట్రేట్లకూ సమాచారం ఉంటుంది' అని మమత వ్యాఖ్యానించారు. ఈ అంశంలో తమకున్న ఆందోళనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కేంద్రం ఏం నిర్ణయిస్తే దానికి కట్టుబడతామని చెప్పారు. అయితే తమ రాష్ట్ర శాంతి, సుస్థిరతకు విఘాతం కలిగించేలా తీవ్రవాదులను అనుమతిస్తేగనుక ప్రతిఘటిస్తామని తేల్చిచెప్పారు. తమ నిరసనను తెలియజేస్తూ కేంద్రానికి లేఖ పంపుతామని మమతా బెనర్జీ వెల్లడించారు. అదే సమయంలో కేంద్రానికి తెలియకుండానే ఇదంతా జరుగుతోందా? ఈ చర్యల వెనుక అసలు ఉద్దేశం ఏమిటి; దీనికి కేంద్ర ప్రభుత్వ బ్లూ ప్రింట్ ఉందా? అంటూ బెంగాల్ ముఖ్యమంత్రి వరుస ప్రశ్నలు సంధించారు. కేంద్రం జోక్యం లేకుండా ఇది ఎలా సాధ్యమంటూ అనుమానం వ్యక్తం చేశారు. అక్రమ చొరబాట్లతో టీఎంసీకి ఎలాంటి సంబంధం లేదని, ఆ బాధ్యత బీఎస్‌ఎఫ్‌దేనని, తమను నిందిస్తే ఊరుకోమని మమత అన్నారు.

ట్రాఫిక్‌జామ్‌లో బెంగళూరు టాప్

బెంగళూర్: ట్రాఫిక్ జామ్ విషయంలో ఆసియా ఖండంలోనే మొదటి 10 నగరాల జాబితాలో బెంగళూరు మొదటిస్థానంలో నిలుస్తుంది. మన దేశంలో ముందుగా గుర్తొచ్చేది బెంగళూరు నగరమే. స్వల్ప దూరానికే గంటల తరబడి వేచి చూడటం ఇక్కడి ప్రయాణికులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రా యంగా ఉండే నగరంగా బెంగళూరు దేశంలోనే పేరొందింది. ట్రామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 ప్రకారం... ఇక్కడ పీక్ అవర్స్‌లో కేవలం 10 కిలోమీటర్ల దూరానికే ఏకంగా 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. ఈ టెక్‌హబ్‌లో నివాసితులు ఏటా దాదాపు 132 గంటల పాటు ట్రాఫిక్ జామ్‌లోనే చిక్కుకుపోతారు. అందుకు కారణంగా బెంగళూరులో రద్దీకి తోడు నగరం వేగంగా విస్తరిస్తుండటమే. దక్షిణ, ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా బెంగళూరుకే వెళ్తుంటారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే నివసిస్తుంటారు. దీంతో పట్టణం కూడా బాగా విస్తరిస్తోంది. మరోవైపు ఈ సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రావడం లేదు. నగర రోడ్లలో ప్రయాణం నరకయాతంగా మారిపోయింది. ఇక పీక్స్ అవర్స్, హాలిడేస్‌లో ట్రాఫిక్‌ను తప్పించుకోవడం పెద్ద సవాల్‌గా మారింది. ఈ జాబితాలో బెంగళూరు తర్వాత పూణె రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరానికి 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతోంది. ఆ తర్వాత ఫిలిప్పీన్స్‌లోని మనీలా (27 నిమిషాల 20 సెకన్లు) , తైవాన్‌లోని తైచుంగ్ (26 నిమిషాల 50 సెకన్లు), జపాన్‌లోని సప్పోరో (26 నిమిషాల 50 సెకన్లు), తైవాన్‌లోని (26 నిమిషాలు), జపాన్‌లోని నగోయా (24 నిమిషాల 20 సెకన్లు), ఇండొనేషియాలోని జకార్తా (23 నిమిషాల 20 సెకన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. టామ్‌టామ్ ట్రాఫిక్ సూచిక ఆరు ఖండాల్లోని 55 దేశాల్లో ఉన్న 387 నగరాలపై పరిశోధనలు చేసి నివేదిక విడుదల చేసింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే యూకేలోని లండన్ అత్యంత నెమ్మదిగా వాహనాలు కదిలే నగరంగా నిలిచింది. ఇక్కడ సగటున 10 కిలోమీటర్ల దూరానికి 37 నిమిషాల 20 సెకన్ల సమయం పడుతుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

నేడు చేపల విక్రయ వాహనాలు ప్రారంభించనున్న సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద సెర్ప్ ద్వారా స్వయం సహాయక బృందాలకు సంచార చేపల విక్రయ వాహనాలను నేడు మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. తొలి విడతలో 25 వాహనాలను లబ్ధిదారులకు అందచేయనున్నారు. చేపల విక్రయంలో ఉన్న, ఆసక్తి గల ఎస్‌హెచ్‌జిలను ఎంపిక చేసిన జిల్లా మత్స్య అధికారులు, డిఆర్‌డిఓలు, జిల్లా కలెక్టర్లు ఆమోదించారు. పచ్చి చేపలతో పాటు చేపల వంటకాలను విక్రయించేలా సంచార చేపల విక్రయ వాహనాలు ఏర్పాటు చేశారు. వాహనాల్లో చేపలు, వంటకాలు తయారు చేసి మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో విక్రయించే సౌకర్యం ఉంటుంది. మొదటి దశలో జిల్లాకు ఒక వాహనం చొప్పున 32 వాహనాలు మంజూరు చేశారు. ఒక్కో వాహనం ఖరీదు రూ.10 లక్షలు అలాగే ఫ్యాబ్రికేషన్‌తో కలిపి రూ. 10.38 లక్షలు ఉంటుంది. ప్రధాన మంత్రి మత్స్య సమృద్ధి యోజనతో అనుసంధానం చేసి లబ్ధిదారులకు 60 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాల రూపంలో సెర్ప్ సమకూర్చనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోగాభివృద్ధికి మొబైల్ ఫిష్ రిటైయిల్ అవుట్ లెట్స్ దోహదపడుతుంది.

సరికొత్త ఉత్సాహంతో ముందుకెళ్ళాలి: కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సరికొత్త ఆలోచనలు, సరికొత్త ఆశయాలతో 2025 సంవత్సరంలో మరింత పట్టుదలతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో రెట్టింపు ఉత్సహంతో పనిచేసి జిల్లాను మరింత ప్రగతి పథంలోకి తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లా అధికారులతో నూతన సంవత్సరం సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శాఖ తన పనితీరును మెరుగుపరుస్తూ నాణ్యతను పెంచుతూ కార్యాచరణ సిద్ధం చేసుకోని ముందుకెళ్ళాని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే మనందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఉద్యోగి ఈ రంగారెడ్డి జిల్లాలో పని చేయడం ఒక అదృష్టంగా భావించి తాము తీసుకునే నిర్ణయాలు చేసే పనులు ఎంతో మందికి మేలు జరుతుందని కలెక్టర్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్, మండల పంచాయతీ అధికారుల అసోసియేషన్ సహకారంతో సంక్షేమ హాస్టల్ విద్యార్థుల కొరకు 200 బ్లాంకెట్స్, 100 నోట్ బుక్స్‌ను జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరిగినది. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను కాల్చొద్దు : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో చెత్తను, వ్యర్థాలను కాల్చవద్దని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రజలను కోరారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ కాలుష్య నియంత్ర మండలి వాల్ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందరేగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెత్తను బహిరంగ ప్రదేశాలలో కాల్చడం వాయు కాలుష్యానికి ముఖ్యమైన కారకమని దీని ద్వారా వచ్చే హానికరమైన ఉద్గారాలు గాలి నాణ్యతను దిగజార్చడమే కాకుండా గుండె జబ్బులు, ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ప్రజలకు కలిగిస్తాయన్నారు. చెత్తను కాల్చటం చట్టరీత్యా నేరమని అంతేకాకుండా చెత్త కాల్ చేయడం వల్ల ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.సురేష్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కె.సాయి దివ్య, మీడియా కోఆర్డినేటర్ ఎ. సోమేష్ కుమార్, పి.నాగరాణి, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : ఏసీపీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీవీఆర్ కళాశాలలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేడ్చల్ ఏసీపీ.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎంఆర్ కాలేజీలో విద్యార్థుల్లో ఆందోళన చేస్తున్న యాజమాన్యం నుంచి మాకు ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నామని, హాస్టల్ పరిసరాలను పరిశీలించామని పేర్కొన్నారు. విద్యార్థులు స్నానం చేస్తున్నప్పుడు బాత్రూం వెనుక భాగంలో వ్యక్తులు తచ్చాడుతున్నట్టు గమనించామని విద్యార్థులు మాకు చెప్పారని తెలిపారు. మహిళా పోలీసులతో బాత్రూములు దగ్గర చెక్ చేయించామని, అక్కడ ఇద్దరు ఫింగర్ ప్రింట్స్ లభించాయన్నారు. అయితే అక్కడ మెస్‌లో పనిచేసే వ్యక్తులు మాత్రమే లోపలికి వచ్చే అవకాశం ఉందని అందుకే 6 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే వారి నుండి 12 సెల్ ఫోన్లను సీజ్ చేసామని, వాటి నుండి మా టెక్నికల్ టీం ఫోన్లని అనేక విధాలుగా పరిశీలించారన్నారు. వాటిలో ఎలాంటి వీడియోలు, ఫోటోలు లభించలేదని, ఒకవేళ డిలీట్ చేసి ఉంటారని ఫోన్లన్నీ ల్యాబ్‌కు పంపించామన్నారు. ఈ ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యం చాలా స్పష్టంగా కనపడుతోందని తెలిపారు. ఇప్పటివరకు యాజమాన్యం నుండి ఎటువంటి ఫిర్యాదు రాలేదని, పోలీసులు కూడా యాజమాన్యంతో మాట్లాడదాం అనుకుంటే అందుబాటులోకి రావడం లేదన్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, కనీసం ఇక్కడ విద్యార్థుల ఆందోళన చేస్తుంటే భద్రత కావాలని కూడా పోలీసుల్ని యాజమాన్యం అడగలేదన్నారు. దర్యాప్తులో భాగంగా యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా క్రిష్ణ మనోహర్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సినియర్ జర్నలిస్ట్ క్రిష్ణ మనోహర్ గౌడ్‌ని, నియమించినట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు మెకపోతుల నరేందర్ గౌడ్ మీడియాకి తెలియచేశారు. జర్నలిస్టుగా తెలంగాణా ఉద్యమకారుడిగా ఎన్నో అభివృది సేవ కార్యక్రమాలు చేసిన క్రిష్ణ మనోహర్ గౌడ్‌ని వారి సేవలను గుర్తించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా నియమించడం జరిగిందనీ ఇట్టి నియామకం నేటి నుంచి అమలవుతుందని ఆయన మీడియాకి తెలియచేశారు. అనంతరం క్రిష్ణ మనోహర్ గౌడ్ మాట్లాడుతూ బిసిలపై జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించేందుకు వారికి రావాల్సిన హక్కులపై పోరాటం చేసేందుకు చక్కటి వేదిక దొరికిందని నేటి నుంచి బీసీలకు ఎక్కడ అన్యాయం జరిగిన తను ముందు వుంటానని క్రిష్ణ మనోహర్ గౌడ్ మీడియాకి తెలియచేశారు. తన శ్రమను గుర్తించి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక పదవి ఇచ్చినా రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్ గౌడ్‌కి ధన్యవాదాలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

టీయుడబ్ల్యుజె డైరీని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ 2025 మీడియా డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎస్. హరీష్, దేవులపల్లి అమర్, ఐజేయు మాజీ అధ్యక్షులు, కే.విరాహత్ అలీ, టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు, కె.రాంనారాయణ, టీయుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యదర్శి, ఐజేయు, కె.సత్యనారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు, ఐజేయు, కల్యూరి రాములు, ఉప ప్రధాన కార్యదర్శి, టీయుడబ్ల్యూజే, కె.శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి, టీయుడబ్ల్యూజే, యం.వెంకట్ రెడ్డి, కోశాధికారి, టీయుడబ్ల్యూజే, ఏ.రాజేష్, బి. కిరణ్, గౌస్ మోహియుద్దీన్, అనీల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, టీయుడబ్ల్యూజే, హెచ్.యూ.జే. అధ్యక్షులు, కార్యదర్శులు శిగా శంకర్‌గౌడ్, హమీద్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గురువారం గృహ నిర్మాణ, సమాచార, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులు మంత్రికి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐ.జి. జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ వి.పి. గౌతమ్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్. హరీష్ తదితర ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

దోచుకుని దాచుకునే ఆలోచన లేదు : ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : దోచుకుని దాచుకునే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని గతంలో వారు ఇష్టానుసారంగా ప్రాజెక్టు కాస్ట్ పెంచారు కాబట్టే రూ.7 వేల కోట్ల ప్రాజెక్టులో రూ.12 వేల అవినీతి జరిగిందని కేటీఆర్ అంటున్నాడని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేటీఆర్ లాగే అందరూ చేస్తారనుకుంటున్నారని దుయ్యబట్టారు. గురువారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి గాంధీ భవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కలసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై వివరించారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును మొత్తం కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. అయితే ముందు ల్యాండ్ సేకరించాలని కేంద్ర మంత్రి మాకు సూచించారన్నారు. కేసీఆర్ లా ప్రతిపక్షంను మేము లేకుండా చేయాలనుకోవడం లేదని, బలమైన ప్రతిపక్షం ఉండాలనుకుంటున్నట్లు వెల్లడించారు. కేసీఆర్ ఎలాగూ బయటకు రాడు హరీష్ రావు, కేటీఆర్, కవిత వెళ్లి అయినా సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తే మంచిదన్నారు. 2025లో అయినా బీఆర్‌ఎస్ నేతలకు జ్ఞానోదయం కలగాలని, రైతు భరోసా విషయంలో బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయం వల్ల రైతు బంధులో రూ.22 వేల కోట్ల అనర్హులకు ఇచ్చారని విమర్శించారు. అలాగే ఈ ఫార్ములా కేసులో కేటీఆర్ రోజు కో మాట మాట్లాడుతున్నాడని, ఒకరోజు సంబంధం లేదంటాడు, మరోక రోజు అధికారులకు సంబంధం లేదు అంతా నేనే చేసాను అంటాడని ఎద్దేవాచేశారు. అదేసమయంలో అధికారులకు సీరియస్ నెస్ తగ్గిందని, బీఆర్ఎస్ లో సింగిల్ విండో ద్వారా ఆదేశాలు వెళ్లెవి ఇప్పుడు చాలా మంది నుంచి ఆదేశాలు వెల్తున్నాయన్నారు. పుష్ప అరెస్ట్‌తో రేవంత్ రెడ్డి పాన్ ఇండియా సీఎం అయ్యారన్నారు.

అవినీతి రహిత ప్రజాపాలనే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అవినీతి రహిత ప్రజాపాలన ప్రజలకు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు సైతం ప్రజలకు సేవ చేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలోకి స్వేచ్ఛగా, సంతోషంగా అడుగు పెట్టబోతున్నామన్నారు. మాది అధికారుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అని ఆయన స్పష్టం చేశారు. సంవత్సర క్రితం డిసెంబర్ 7న ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన చెప్పారు. ప్రభుత్వం ప్రాధాన్యత ఇప్పుడిప్పుడే అధికారులకు అర్థం అవుతుందన్నారు. మేము పాలకులం కాదు సేవకులం అని ఆయన పునరుద్ఘాటించారు. అక్కడక్కడా కొందరిలో ఆలసత్వం ఉందని, తమ దృష్టికి వచ్చిన చిన్న చిన్న పనులను సైతం పెండింగ్‌లో పెట్టవద్దని తమ దృష్టికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. గతంలో తెలిసో తెలియక చేసిన తప్పిదాలను, అలసత్వాన్ని వదిలి, ప్రజా ప్రభుత్వం ప్రజలకోసం పడుతున్న ఆరాటాన్ని అధికారులు అర్థం చేసుకొని సమన్వయంతో కలిసి పనిచేసి మహబూబ్‌నగర్ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజలకు మరింత చేరువగా, సమర్థవంతంగా, మెరుగైన సేవలు అందించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ మోహన్ రావు, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవన్‌జీ దీప్తికి అర్జున అవార్డు రావడం హర్షణీయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పారాలింపిక్స్‌లో భారత్ తరపున కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ జీవన్ జీ దీప్తి కి విశిష్ట క్రీడా పురస్కారం అర్జున అవార్డు 2024కు ఎంపిక కావడం పట్ల పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ గౌరవాధ్యక్షుడు మూతినేని వీరయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న వికలాంగులందరికీ ఈ విషయం గర్వకారణమన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా ఉన్న తన తరుపున, వికలాంగులు సంక్షేమ శాఖ, సహకార సంస్థ తరుపున ప్రత్యేక అభినందనలు తెలియ జేస్తున్నట్లు చెప్పారు. జీవన్ జీ దీప్తి నీ పారా క్రీడాకారులు, క్రీడా లోకం అంతా ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా జీవన్ జీ దీప్తికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి రూపాయలు నగదు, 500ల గజాల స్థలం, గ్రూప్-2 ఉద్యోగం ప్రకటించారని ఇందుకు గాను సీఎంకి మరొక్కసారి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వికలాంగుల తరుపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు.

బీసీల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా ?

కవితకు టీపీసీసీ అధ్యక్షుడు సవాల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీఆరెస్ పార్టీ బీసీలను వంచించి ఇపుడు వారి తరపున ధర్నాలు చేయడం విడ్డురంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ముందు ఎమ్మెల్సీ కవిత వీటికి జవాబు చెప్పి ధర్నా చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. 10 సంవత్సరాలు బీసీలకు అందాల్సిన నిధులను ఏ ఒక్క సంవత్సరంలో కూడా ఖర్చు చేయకుండా వారిని నిట్టనిలువునా ముంచిందన్నారు. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత బీసీలపై కపట ప్రేమ చూపుతూ కల్వకుంట్ల కుటుంబం వారిపై మొసలికన్నీరు కారుస్తోందని మండిపడ్డారు. బీసీలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలదని, అధికారం పోయిన తర్వాత బీఆర్‌ఎస్‌కు బీసీలు గుర్తుకొచ్చారన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసి వారి గొంతు కోసిందన్నారు. లిక్కర్ స్కాంలో మరకంటించుకున్న ఎమ్మెల్సీ కవిత దాన్ని పోగొట్టుకోవడంతో పాటు బీఆర్‌ఎస్ పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడంతో ఎటూ పాలుపోని ఆమె రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడం కోసం ఇప్పుడు బీసీల పేరిట కపట నాటకం మొదలుపెట్టారని విమర్శించారు. అందులో భాగంగానే ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. విజ్ఞులైన బీసీలు ఈ కుట్రలను గమనించి బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరారు. కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనం నన్ను తెలంగాణ అధ్యక్షులుగా నియమించడమే అంటూ వ్యాఖ్యానించారు. అంతేకాక రాష్ట్ర క్యాబినెట్లో బీసీలకు అధిక ప్రాధాన్యతిచ్చిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, వారికి మరింత ప్రయోజనకరంగా ఉండేలా సలహాలు, సూచనలు ఇవ్వాల్సింది పోయి ధర్నా చేపట్టడం దురదృష్టకరమన్నారు. బీసీల అభివృద్ధి కోసం పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన చర్యలు, ప్రస్తుతం ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలనలో చేపట్టిన చర్యలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని నేను కవితను బీఆర్ ఎస్ నేతలను సవాలు చేశారు.

పని గంటలను మెరుగుపరచుకోవాలి

సింగరేణి ఉద్యోగులకు సీఎండీ ఎన్.బలరామ్ పిలుపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణిలో పని చేస్తున్న ప్రతీ ఒక్క ఉద్యోగికి సమాజంలో మంచి గౌరవం, గుర్తింపు లభిస్తున్నాయని.. మనల్ని ఉన్నత స్థాయిలో నిలబెడుతున్న సంస్థ భవిష్యత్తే ప్రతీ ఒక్కరికీ ప్రథమ ప్రాధాన్యం కావాలని సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతీ ఒక్కరూ తమకు కేటాయించిన 8 గంటల పాటు అంకితభావంతో పనిచేయాలన్నారు. నూతన సంవత్సరం నేపథ్యంలో గురువారం సింగరేణి భవన్‌లో ఉద్యోగులందరినీ ఉద్దేశించి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాదిలో సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ప్రతీ ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఉద్యోగుల పనితీరుపై పూర్తిస్థాయిలో మదింపు ఉంటుందని, పనిచేసే వారికి తగిన గుర్తింపు, నిర్లక్ష్యంగా ఉండే వారి పట్ల కఠిన చర్యలు ఉంటాయన్నారు. రక్షణ, నాణ్యతతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదక సాధించాలని, ప్రతీ ఒక్కరూ వారికి కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, జీఎం కో ఆర్డినేషన్ ఎస్డి.ఎం.సుభానీ, జీఎం మార్కెటింగ్ రవి ప్రసాద్, జీఎ సోలార్ సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి భక్తులకు అన్న ప్రసాదం

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: స్వామియే శరణమయ్యప్ప అంటూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అయ్యప్పస్వామి భక్తులకు స్వయంగా అన్నదాన భిక్షను పెట్టారు. షాద్ నగర్ పట్టణంలోని శివ మారుతి గీత అయ్యప్ప మందిరంలో అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదన్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలను చేయడంతో పాటు స్వాములకు అన్న ప్రసాదం వడ్డించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్వామిని వేడుకుంటూ అయ్యప్ప భక్తి గీతాలతో భజనలతో భక్తులు హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆలయ కమిటీ అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, నందీశ్వర్, ఆలయ పూజారులు తదితరులు సన్మానించారు. శంకర్ మాట్లాడుతూ ఎంతో కఠోరమైన నియమ నిబంధనలతో నిష్ఠతో చేపట్టే అయ్యప్ప దీక్షతో సమాజానికి మంచి జరుగుతుందని అన్నారు. ప్రతి ఏడాది స్వాములకు అన్న ప్రసాదన్న కార్యక్రమం చేస్తున్నామని, ప్రతి ఏడాది అయ్యప్ప మాల ధరించడంతో సమాజంలో శాంతి సామరస్యాలు వెల్లువిరుస్తున్నాయని మంచి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిపిఐ కాప్రా మండల సమితి సమావేశం దళిత భవన్లో దర్శనం యాదగిరి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ హాజరై ఇటీవలే మృతి చెందిన సిపిఐ రాష్ట్ర నాయకులు ఎన్.బాల మల్లేష్,రొయ్యల కృష్ణమూర్తి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన బాల మల్లేష్, ఆర్ కృష్ణ మూర్తి అకాల మృతి పట్ల సీపీఐ పార్టీకి తీవ్రం లోటు అని వారు అన్నారు. వారి స్ఫూర్తితో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని వారి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. సిపిఐ వంద సంవత్సరాల వారోత్సవాలను జనవరి 19న జరిగే వారోత్సవాలని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలు మండల సహాయ కార్యదర్శిలు లక్ష్మీనారాయణ, మోతి రాజేశ్వరి. గిరిజన సమైక్య అధ్యక్ష కార్యదర్శులు శ్యామ లత, వి.స్వరూప నాయక్, మండల అధ్యక్షులు ఏ ఎల్లయ్య, బీసీ సంఘం జిల్లా నాయకులు సూర వెంకటయ్య, కీసర మండల సహాయ కార్యదర్శి వి.రవి నాయక్, గిరిప్రసాద్ నగర్ సహాయ కార్యదర్శి కే సత్యం, సిపిఐ మండల నాయకులు అశోక్ చారి, రవీంద్ర చారి, దళిత హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా నాయకులు సిహెచ్ మహేష్, మహిళా సమైక్య నాయకురాలు మల్లిక, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు మరిన్ని సేవలందించాలి: కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నూతన సంవత్సరం సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, కార్పొరేటర్లు, ఇతర అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ 2024 సంవత్సరం నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి విజయవంతమైన సంవత్సరం కాగా, కొత్త సంవత్సరం 2025లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని సంకల్పంతో పని చేయాలన్నారు. కార్పొరేటర్లు ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కమిషనర్ కోరారు. కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు ఉన్నారు. ఈ సందర్భంగా అందరూ ఒకరికి ఒకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

నిబంధనలు లేకుండా అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలి : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : రైతు భరోసా పథకానికి షరతులు, నిబంధనలు విధిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అన్నదాతకు సున్నం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకం అమలుకు నిబంధనలను పెట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రైతులకు షరతులు విధించడమేంటని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ప్రభుత్వాన్ని అడుక్కోవాలా అని నిలదీశారు. ఎటువంటి నిబంధనలను విధించకుండా బేషరతుగా రైతులందరికీ రైతు భరోసా నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం నాడు తన నివాసంలో జరిగిన బోధన్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి కూడా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని అన్నారు. ఇప్పటికే ప్రజా పాలన దరఖాస్తుల పేరిట ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించిన విషయాన్ని గుర్తు చేసిన ఎమ్మెల్సీ కవిత ఇంకెన్ని దరఖాస్తులు తీసుకుంటారని ప్రశ్నించారు. రైతులను వ్యవసాయం చేసుకోనిస్తారా లేదా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ తిప్పలు పెడుతారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేసీఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారని, కానీ ఈ కాంగ్రెస్ నాయకులు రైతాంగాన్ని కుదేలు చేస్తున్నారని అన్నారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేక ఏర్పడిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందని తెలిపారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేశారని, దాంతో ప్రజలు ఆ పార్టీ నాయకులపై గుర్రుగా ఉన్నారని తెలిపారు. మహిళలకు నెలకు రూ 2500 ఇస్తామని, 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు స్కూటీలు ఇస్తామని, కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు లేవనెత్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా నడవాలని సూచించారు. కేసీఆర్, తాము అండగా ఉంటామని, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని అన్నారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE M.A.C.T-CUM-1
ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURTS,
AT: SECUNDERABAD.
O.P.NO. 306 OF 2024
Between:
Mushnam @ Mushanam Thara and others
Vs
Anusuri Srinu Babu & Others
NOTICE
1. R1 Anusuri Srinu Babu, S/o. Apparao, Age: Major, Occ: Driver, R/o. HNo: 10-53, Eshwarnagar Street, Sarpavaram Mandal, Kakinada Dist, East Godavari, Andhra Pradesh-533005. 9704698599.
WHEREAS the Petitioner has filed the above case against you for compensation under M.V Act and Rules and the same is posted for your appearance on 06.01.2025.
Hence, you are requested to appear before the said Hon'ble Court, at 10.30 AM either in your person or through your Advocate on the said date, otherwise, the matter will be decided in your absence.
// BY ORDER //
COUNSEL FOR THE PETITIONERS
M/s P.Srinivas,M.Dhanalakshmi,N.Raju Naik, K.Sneha, Advocates.
H.NO.6-18/1, "SHREE" NIVAS, Sreeram Nagar Colony, Anupuram, Kapra, ECIL, Hyderabad-500 062 Mobile: 9246365011.

సీఎంకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆంగ్ల నూతన సంవత్సరం 2025 సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏబీ బర్ధన్‌కు నివాళులర్పించిన సీపీఐ నేతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏబీ బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రమావత అంజయ్య నాయక్, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆరుట్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీ బర్ధన్ వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రమావత అంజయ్య నాయక్, ఓరుగంటి యాదయ్య, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆరుట్ల రాజ్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, దశరథ్, చెన్నయ్య, నరసింహ, అంజయ్య, కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి డిఆర్ఓ హరిప్రియ లా ఆఫీసర్ చంద్రావతి గురువారం జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

టూరిజం ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన యూనియన్ నాయకులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, అవుట్సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శ్రీరాముల యాదవ్, ప్రణీత్, దిగంబరం, రవి, సురేష్, రమేష్, మల్లేష్‌తో కలిసి రాజమౌళి గురువారం హిమాయత్‌నగర్‌లోని టూరిజం ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. టూరిజం కార్పొరేషన్‌లో పని చేస్తున్నటువంటి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కోరినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి తెలియజేశారు. 2025 సంవత్సరంలో టూరిజం బాగా అభివృద్ధి చెందాలని ఛైర్మన్‌తో అన్నట్లు, ఉద్యోగుల పక్షాన పూర్తి సహకారం అందిస్తామని చెప్పినట్లు రాజమౌళి తెలిపారు.

రోడ్లు, డ్రైనేజీ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ పరిధిలో పెండింగ్ రోడ్లు, డ్రైనేజీ సమస్యల గురించి మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కమిషనర్ జి.రామలింగ కి గురువారం ఉదయం వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ జంగయ్య యాదవ్ వచ్చే కౌన్సిల్ సమావేశంలో 1వ డివిజన్‌ని దృష్టిలో ఉంచుకొని కనీస వసతుల కోసం రెండు కోట్ల రూపాయలు ప్రత్యేక నిధులు కేటాయించి, డివిజన్ అభివృద్ధికి తోడ్పడవలసిందిగా కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ విజ్ఞప్తి చేశారు.

4, 5 తేదీల్లో మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలు "స్వర్ణోదయ" పేరుతో ఈనెల 4, 5 తేదీల్లో హైదరాబాద్, శంషాబాద్ సిటాడెల్ కన్వెన్షన్ జరగనున్నాయని మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాల నిర్వహణ కమిటీ చీఫ్ కన్వీనర్లు శీల్ జైన్, అజయ్ నహత, ఛైర్మన్ వినోద్ సంచేటి, వైస్ చైర్ పర్సన్ అర్చన నహత, కన్వీనర్ సీమ షీల్ కుమార్ జైన్‌లు తెలిపారు. ఈనెల 4వ తేదీన స్వర్ణోత్సవాలను తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంఎల్ఏ పి.సంజీవ్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ స్వర్ణోత్సవాలతో పాటు మహావీర్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ చాప్టర్ రజతోత్సవాలను కూడా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 800 మంది ప్రతినిధులు పాల్గొంటారని వారు తెలిపారు. ఇప్పటికే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద మహావీర్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో రెండు ఆసుపత్రులను నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారత కోసం అనేక పలు పథకాలను కొనసాగిస్తున్నామని వారు వెల్లడించారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుకై ఉపాధ్యాయులు నిబద్ధతతో ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం అమీర్‌పేట్ డికె రోడ్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించి తాగునీటి వనరులపై ఆరా తీశారు. మూడవ తరగతి, 5వ తరగతి విద్యార్థులతో ఇంట్రాక్ట్ ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను, విద్యార్థుల పఠన నైపుణ్యాలను, ఎఫ్ఆర్ఎస్ హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని అ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. బడిబాట కార్యక్రమం ద్వారా పిల్లల హాజరు శాతం పెంచాలని నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఇంగ్లీష్, మేథమేటిక్స్‌పై పట్టు ఉండేల ప్రత్యేక కృషి చేయాలని అలాగే దీపక్, వైష్ణవి, మహీందర్ అనే విద్యార్థులతో ఇంగ్లీష్, తెలుగు పాఠాలు చదివించి చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులు ఇష్టంగా చదవాలని తద్వారా భయం, ఆందోళన పోతుందని అన్నారు. పిల్లలు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. ఉపాధ్యాయులు ప్రైమరి పిల్లలకు బేసిక్స్, రీడింగ్‌పై ఎక్కువ శ్రద్ధ కల్పించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ మధ్యాహ్నం భోజనాలను పరిశీలించి సమయానికి అందించాలని సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న సమయంలో విద్యా శాఖ అధికారులు పాఠశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ ఆర్.రోహిణి, తహసీల్దార్ పద్మ సుందరి, డిప్యూటీ ఈఓ, యాదయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతిని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 3వ తేదీన సావిత్రిబాయి పూలే 194వ జయంతిని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు బీసీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో భారతదేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే జీవితం ఆద్యంతం అత్యంత ఆదర్శవంతమైనదని, మహిళలను కనీసం బయటకు కూడా వెళ్లకుండా మనువాదులు కట్టడి చేసే ఆ రోజుల్లో తను చదువు నేర్చుకొని బాలికలకు విద్య ఎంతో అవసరమని భావించి అనేక అవమానాలు భరించి 1885 సంవత్సరంలోనే పూనాలో మొట్టమొదటి బాలికల పాఠశాల ఏర్పాటు చేసిన ఘనత సావిత్రిబాయి పూలేది అని ఆయన పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో చదువు ఎంతో ముఖ్యమైనది అని ఆమె భావించడం వల్లనే ఇవాళ అనేకమంది విద్యలో రాణిస్తున్నారని అందువల్ల సావిత్రిబాయి పూలేను స్మరించుకుంటూ ఆమె చేసిన అసమాన త్యాగాలను నేటితరం వారికి వివరించాలని, అందువల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా ఉపాధ్యాయురాళ్ళకు బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

అపార్ట్‌మెంట్లలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలోని హేమ సాయి లేక్ టవర్స్ అపార్టుమెంట్స్‌లో రూ.53 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన 116 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్‌ని ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సహజ సిద్ధమైన వనరులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, తరిగిపోతున్న వనరుల తరుణంలో సహజ సిద్ధమైన సౌర శక్తిని వాడుకొని సద్వినియోగం చేసుకుంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని, 116 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుచేసిన మొట్టమొదటి అపార్ట్మెంట్ ఇదే కావడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. హేమ సాయి వెల్ఫేర్ అసోసియేషన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తు బాగుండాలని కాలుష్యం నివారించాలని ఉద్దేశంతో తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గేటెడ్ కమ్యూనిటీలకు స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ ప్రభుత్వం పునరుత్పాదక శక్తికి సంబంధించిన ఏ కార్యక్రమం అయినా ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఆ ప్రోత్సాహంతోనే రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీలో నంబర్ వన్ చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచంలోనే నంబర్ వన్ గ్రీన్ సిటీగా ఎదిగిందన్నారు. అయితే నగర పౌరులుగా పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మరింత ఎక్కువగా ఉందన్నారు. గ్రామాలలో కాలుష్యం తక్కువ. కానీ పట్టణాల్లో కాలుష్యం ఎక్కువగా ఉంటుందని ఇక్కడ ఎక్కువగా ఉన్న వాహనాలతో కాలుష్య తీవ్రత మరింత పెరుగుతుందన్నారు. కాబట్టి పునరుత్పాదక శక్తి వైపు మళ్లాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్ పెడితే పైకప్పు వేడెక్కడం కూడా తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం, విద్యుత్ బిల్లుల భారం కూడా తగ్గుతుందన్నారు. అంతేకాకుండా కాలుష్యాన్ని కూడా తగ్గించిన వాళ్లు అవుతారన్నారు. పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించినట్లు అవుతుందన్నారు. మంత్రిప్రగడ సత్యనారాయణరావు, హేమసాయి లేక్ వ్యూ టవర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రెసిడెంట్ హరీష్ దామరాజు, వైస్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, సెక్రెటరీ శ్రీనివాస్ వోలేటి, ట్రెజరర్ రాజన్ బాబు, జాయింట్ సెక్రటరీ పరిమల్ సహు, అడిషనల్ సెక్రెటరీ ప్రతాప్, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వర్గాలకు అండగా విశాలాంధ్ర దినపత్రిక

విశాలాంధ్ర - పటాన్ చెరువు : సమాజంలో నిరుపేద వర్గాలకు అండగా ఉంటూ కార్మిక, కర్షక, బలహీన వర్గాల హక్కుల సాధనకై విశాలాంధ్ర దినపత్రిక చేస్తున్నటువంటి కృషి అనిర్వచనీయమైనదని పటాన్‌చెరువు తహసిల్దార్ రంగారావు స్పష్టం చేశారు. గురువారం పటాన్ చెరువు జర్నలిస్ట్ మెట్టు మదన్ యాదవ్ ఆధ్వర్యంలో విశాలాంధ్ర 2025 నూతన సంవత్సర క్యాలెండర్ తాసిల్దార్ రంగారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పటాన్ చెరువు తాసిల్దార్ రంగారావు మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువలు, సిద్ధాంతపరంగా పరిపాలన యంత్రాంగం ఉండాలన్న దృఢ సంకల్పంతో నీతివంతమైన జర్నలిజాన్ని విశాలాంధ్ర దినపత్రిక ప్రోత్సహించడం తెలుగు ప్రజలందరికీ అదృష్టమని పేర్కొన్నారు. పారిశ్రామికరణతో రాష్ట్రం అభివృద్ధి వైపు బాటలు వేస్తుందని ముందే గ్రహించిన విశాలాంధ్ర యాజమాన్యం ఆ దిశగా ప్రభుత్వాలకు సూచనలు చేసే విధంగా ఎడిటోరియల్ పేజీలే కాకుండా సద్విమర్శలు సైతం చేస్తూ రాష్ట్ర పరిపాలన రంగంలో మార్పులను సైతం విశేష కథనాల ద్వారా అందించిన గొప్ప చరిత్ర విశాలాంధ్ర దినపత్రికది అని పేర్కొన్నారు. ప్రతిపక్షాల సూచనలను, విమర్శలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లతూ పాలకుల కళ్ళు తెరిపించడానికి విశాలాంధ్ర దినపత్రిక చేసిన కృషి మరువలేనిదన్నారు. నేడు పత్రిక లోకానికి విశాలాంధ్ర దినపత్రిక తనదైన శైలిలో ఆదర్శంగా నిలుస్తూ అంకితభావంతో ఉన్నత విలువలు కలిగిన జర్నలిజాన్ని సమాజానికి అందించిన గొప్ప చరిత్ర ఈ పత్రికదని కొనియాడారు. మహిళలు అన్ని రంగాలలో మగవారితో సమానంగా హక్కులను సాధించాలని ఎలుగెత్తి చాటిన పత్రిక విశాలాంధ్ర అని అన్నారు. అటు దేశంలో ఇటు రాష్ట్రంలో పాలకులు స్వార్థం కోసం ఇలాంటి కుంభకోణాలు పాల్పడిన విస్పష్టంగా నిక్కచ్చి తంగా ప్రజలకు పాలకుల అవినీతిని ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్యవం తులను చేసేందుకు విశాలాంధ్ర దినపత్రిక చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో పటాన్చెరువు డిప్యూటీ తాసిల్దార్ కార్తీక్ తదితరులు ఉన్నారు.

మెట్రో సాధనలో ఎమ్మెల్యే కృషి విశేషం

విశాలాంధ్ర-దుండిగల్: మేడ్చల్‌కు మెట్రో సాధనలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద కృషి విశేషమైనదని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నందు ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు ఎమ్మెల్యే కెపి.వివేకానందని మర్యాదపూర్వకంగా కలిసి మేడ్చల్ ప్రాంతానికి మెట్రో సాధనలో కీలకంగా వ్యవహరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఉత్తర తెలంగాణ ప్రాంతానికి కీలకమైన కుత్బుల్లాపూర్ ప్రాంతం నుండి నిత్యం నగరానికి లక్షలాది మంది ప్రయాణిస్తుంటారని, ప్రజల మనోభావాలను ప్రభుత్వానికి గుర్తు చేసి మెట్రోను సాధించినందుకు సంతోషంగా ఉందని ఆయన వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానందని మెట్రో సాధన సమితి సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ ప్రెసిడెంట్ పుప్పాల భాస్కర్, నాయకులు కుంట సిద్ధిరాములు, మెట్రో సాధన సమితి కమిటీ సభ్యులు సంపత్ రెడ్డి, జార్జ్, మహేందర్ రెడ్డి, గోరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్, పుప్పాల నాగరాజు, అనిల్ సామినేని, గిరిధర్, మోహన్ రెడ్డి, చిరంజీవి, సురేష్, భూపాల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్‌లో

మైక్రో వాస్క్యులర్ సర్జరీ విజయవంతం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : నిజామాబాద్ జిల్లా, గుత్ప గ్రామానికి చెందిన గుమ్మల సాయన్న (58 సంవత్సరముల) గత సంవత్సరం నుండి ముఖంలో వాపు, కుడి దవడ దగ్గర పెద్ద కణితి, కంట్లో నుంచి నీరు కారడం, మింగడానికి కూడా ఇబ్బంది వంటి తదితర సమస్యలతో బాధపడుతున్నారు. తగిన చికిత్స కోసం సాయన్న కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించగా మాక్సిల్లరీ సైనస్ కార్సినోమా అనే వ్యాధితో బాధపడుతున్నారు అని తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో మాక్సిల్లరీ సైనస్ కార్సినోమా చికిత్స కోసం నిజామాబాద్, హైదరాబాద్ లోని ప్రముఖ హాస్పిటల్స్‌ను సంప్రదించిన సాయన్నకు చికిత్స ఖర్చు లక్షలలో అవుతుందని చెప్పడం జరిగింది. దిక్కు తోచని స్థితిలో హైదరాబాదులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్, విద్యానగర్ గురించి తెలుసుకొన్న సాయన్న కుటుంబ సభ్యులు సంప్రదించారు. వారి కేసును పరిశీలించిన ప్రముఖ సర్జికల్ ఆంకాలజీ చికిత్స నిపుణులైన డా.యు.ఆజాద్ చంద్రశేఖర్, మెడికల్ డైరెక్టర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా కేన్సర్ సెంటర్ ఈ కేసును ఒక ఛాలెంజ్‌గా పరిగణించి చికిత్సను ప్రారంభించారు. దీంతో చికిత్సపై ప్రణాళికాబద్ధంగా ముందుకు కదలి ట్రూ కట్ బయాప్సీ, సిటీ హెడ్, నెక్ స్కాన్, హెూల్ బాడీ పెట్-సీటీ స్కాన్ ల ద్వారా నిర్ధారణకు వచ్చి మైక్రో వాస్క్యులర్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ మెడికల్ డైరెక్టర్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా.యు.ఆజాద్ చంద్రశేఖర్ వెల్లడిస్తూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ హాస్పిటల్ 40 సంవత్సరాల చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా ఎంతో సంక్లిష్టమైన ఈ శస్త్ర చికిత్సను 10 నుండి 12 గంటల పాటు శ్రమించి తమ బృందం విజయవంతంగా పూర్తి చేయడం పట్ల సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సర్జరీలో పాల్గొన్న డాక్టర్లు అయినా డా.రాకేష్ శంకర్ గౌడ్, డా.రవికుమార్ రెడ్డి, డా.రాకేష్ కుమార్, డా.ఉల్లాస్, డా.శ్రీనాథ్, డా.సమంత్, డా.మధుసూదన్ రావు, శ్రీవల్లి తెలిపారు. పూర్తి ఆరోగ్యంతో కేవలం వారం రోజుల్లో నే డిశ్చార్జ్ కూడా చేయడం జరిగిందని తెలిపారు.

క్రీడలతోనే ఆరోగ్యం, ఆనందం : ఎంపీ, ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆమనగల్లు : క్రీడలతో ఆరోగ్యం, ఆనందం సాధ్యమని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు చెప్పారు. గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న కడ్తాల్ ప్రీమియర్ లీగ్-3 క్రికెట్ పోటీలను వారు ఏఐసిసి కార్యదర్శి వంశీ చందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఉత్తేజాన్ని కలిగించి అహ్లాదాన్ని అందిస్తాయని, ఆటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. క్రీడలలో గెలుపు ఓటములను క్రీడాకారులు స్నేహభావంతో స్వీకరించాలని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్ద వేములోని భావి తాండాకు చెందిన జ్యోతికి మంజూరైన రెండున్నర లక్షల ఎల్ఓసి చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మైసిగండి గ్రామంలో మృతి చెందిన నాయకుడు హర్యానాయక్ మృత దేహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో నాయకులు శ్రీనివాస్ గౌడ్, బిఖ్య నాయక్, యాట నరసింహ, భాస్కర్ రెడ్డి, హనుమ నాయక్, బిచ్చ నాయక్, వేణుగోపాల్, వెంకటేష్, మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సబర్బన్ ట్రైన్ & బస్ ట్రావెలర్స్ అసోసియేషన్, మల్కాజ్ గిరి రూపొందించిన 2025 క్యాలెండర్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తమ కార్యలయంలో ఆవిష్కరించారు. మల్కాజిగిరి రైల్వే స్టేషన్ అమ్రిత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్న అధికారుల కృషి ఘనణీయమని సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న తమ స్టేషన్‌కు లిఫ్టులు, ఎస్కలేటర్స్ రావడం చాలా సంతోషమని జెడ్ఆర్‌యుసిసి మెంబర్ నూర్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో రైల్వే పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్ కే.రాజేష్, అనిల్ కుమార్‌తో పాటు ప్రయాణికుల సంఘం ప్రెసిడెంట్ ఏ.వీ.స్వామి, డిఆర్‌యుసిసి సభ్యులు పి.భరద్వాజ్, వై.శంకర్‌రావు తరితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్ సైద్ధాంతిక తత్త్వవేత్త ఏబి బర్ధన్

విశాలాంధ్ర - కాప్రా : కమ్యూనిస్ట్ సైద్ధాంతిక తత్వవేత్త ఏబి.బర్ధన్ అని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఏబి బర్ధన్ 9వ వర్ధంతిని ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఏబీ. బర్ధన్ తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. బర్ధన్ విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని, 80,90 దశకంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం బర్ధన్ పోరాట యోధులకు ఉపరాష్ట్రపతి పదవిని తీసుకోకుండా సున్నితంగా తిరస్కరించారు. నా జీవితం ప్రజలు, పార్టీ కార్యకర్తలతోనే అని చెప్పడం బర్ధన్ నిస్వార్థతకు అద్దం పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారంలో విశాలాంధ్ర పత్రిక ముందుంటుందని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం విశాలాంధ్ర దినపత్రిక నూతన క్యాలెండర్‌ను శ్రీనివాస్‌రెడ్డి ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఇందిరమ్మ కాలనీ వాసులు గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2025 ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, సంపద, సమృద్ధి కలుగాలని ఆయన ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు ఆశీస్సులు దీవెనలు అందిస్తారని ఆశిస్తూ కొలను శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి మహేష్, యాదయ్య, బాలయ్య, గిరి, కృష్ణ, దుర్గేష్, గోపాల్, సత్యనారాయణ, శ్రీను, భాగయ్య, మల్లేష్, మల్లేష్, కవిత, రాంబాబు పాల్గొన్నారు.

జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కి సయ్యద్ సాదిక్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - షాద్ నగర్ రూరల్: తెలంగాణ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను లారీ యజమానుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, షాద్ నగర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నవాజ్ గోరి, షాహీర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల బొకేలు అందజేశారు. జాయింట్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు తీసుకున్నందుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం

ప్రొబెషనరీ ఏఎస్పీలు, డీఎస్పీలతో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నేరాల నియంత్రణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గత ఐదేళ్లూ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మళ్లీ శాంతి భద్రతలను గాడిలో పెట్టాలని శిక్షణ పూర్తిచేసుకున్న ప్రొబెషనరీ ఏఎస్పీలు, డీఎస్పీలకు సీఎం సూచించారు. శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్న ఎస్పీలు, డీఎస్పీలు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... గతంలో రౌడీలు రాజకీయ పార్టీల్లోకి వచ్చినా పార్టీలు మద్దతు తెలిపేవి కావని, నేడు నేరస్తులే రాజకీయ ముసుగు వేసుకున్నారన్నారు. మొన్నటివరకు సోషల్ మీడియాలో ప్రత్యర్థులను, వారి కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించారన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇప్పుడు నియంత్రిస్తున్నామన్నారు. ఐదేళ్లలో కొందరు కళంకిత పోలీసు అధికారులు కూడా ఇష్టారీతిన వ్యవహరించి వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చారన్నారు. పోలీసులను శాంతి భద్రతల కోసం కాకుండా రాజకీయ నేతలపై కక్ష తీర్చుకోవడానికి గత ప్రభుత్వం ఉపయోగించుకుందని... గంజాయి, మాదకద్రవ్యాలకు రాష్ట్రాన్ని హబ్‌గా మార్చేసిందని ధ్వజమెత్తారు. గంజాయి రవాణా, బెల్ట్ షాపులు నిర్వహణ, ఇసుక అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సైబర్ నేరగాళ్లు కూడా రానున్న రోజుల్లో మీకు ఒక సవాల్ గా మారతారని, వారికంటే మెరుగ్గా ఆలోచించినప్పుడే నేరాలను అరికట్టగలుగుతారన్నారు. నేరస్తులకు ఎక్కడా అవకాశం ఇవ్వొద్దని, శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు, తద్వారా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. గతంలో పోలీసులకు టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చామని, బాడీ ఓన్ కెమెరాలు, సీసీ కెమెరాలు, వంటి పరికరాలు తెచ్చామన్నారు. తద్వారా నేరస్తులను గుర్తించడంతో నేరాల సంఖ్య తగ్గిందని తెలిపారు. గత ఐదేళ్లూ వాటిని నిర్వీర్యం చేశారని, మహిళలు, చిన్నారులపై కొందరు మానవత్వం మరిచి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని, అసాంఘిక కార్యకలపాలను కట్టడి చేయాలని సీఎం ఆదేశించారు.

ఇళ్ల స్థలాల పంపిణీపై మాట నిలుపుకోవాలి

రామకృష్ణ డిమాండ్

10వ తేదీన అర్జీలు సమర్పించాలని పిలుపు

విశాలాంధ్ర-మచిలీపట్నం: పేదల సొంతింటి కల నిజం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. సీపీఐ అధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అర్జీల అందజేత కార్యక్రమంలో భాగంగా మచిలీ పట్నం 28వ డివిజన్లో పేదల నుంచి సేకరించిన ఇంటి స్థలాల దరఖాస్తులను సచివాలయం అడ్మిన్ వై.మాధవీలతకు రామకృష్ణ ద్వారా అందజేశారు. అంతకుముందు డివిజన్‌లో సీపీఐ కార్యకర్తలు, దరఖాస్తుదారులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పేదలను ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ... పేదలకు నగరంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలిచ్చి... ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని గతంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పెడచెవిన పెట్టారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సేకరించిన స్థలాలు ఇళ్ల నిర్మాణానికి ఏ విధంగాపూ ఉపయోకరంగా లేవన్నారు. చాలీచాలని స్థలాలు ఇవ్వడంతో పేదలు అనేక ఇబ్బందులు గురయ్యారని, ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన భూసేకరణ విషయంలో కూడా అనేక అవకతవకలు జరిగాయని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు భూమి... ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని, అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా ఇంటి నిర్మాణానికి నిధులు అందిస్తానని హామీ ఇచ్చిందని చెప్పారు. ఆ మేరకు వెంటనే కార్యాచరణ చేపట్టాలన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఇళ్ల స్థలాలు లేని పేదల్ని గుర్తించి.. వారిచేత అర్జీలు పూర్తి చేయించి... ఈనెల 10వ తేదీన ఆయా కేంద్రాల్లోని రెవిన్యూ అధికారులకు అందజేయాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మోదుమూడి రామారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పిలుపులో భాగంగా గత నెలలో అమృతపురం, పెదపులింగిపాలెం తదితర ప్రాంతాల్లో పేదల నుంచి ఇళ్ల స్థలాల కొరకు అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపర్తి తాతయ్య మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, సహాయ కార్యదర్శి ఒడుగు చైతన్యకుమార్, నాయకులు యర్రం శెట్టి ఈశ్వరరావు, మహిళా సమాఖ్య నాయకురాలు ఒడుగు రత్నకుమారి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య, సీపీఐ పెడన పట్టణ కార్యదర్శి తుమ్మ చిన్న కొండయ్య, ఏఐటీయూసీ నియోజవర్గ అధ్యక్షులు బెల్లంకొండ కోటేశ్వరరావు, కార్యదర్శి ఒంటి పులి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు జిల్లాలకు ఎస్సీ వర్గీకరణ కమిషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై విచారించేం దుకుగాను రాష్ట్ర ప్రభుత్వం నియమిం చిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఈ నెల ఆరో తేదీ వరకు కర్నూలు, వైఎస్ఆర్ కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పర్యటించనుందని కమిషన్ ఓఎస్‌డీ ఎస్‌కే సాహిద్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా జిల్లాలకు చెందిన వ్యక్తులు/సంస్థల నుంచి కమిషన్ నేరుగా వినతిపత్రాలు, విజ్ఞప్తులు స్వీకరిస్తుంది. కమిషన్‌కు నేరుగా సమర్పించలేని వారు, గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని మొదటి అంతస్తు కోనేరు లక్ష్మయ్య వీధి మొగల్రాజపురం విజయవాడ-10కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వ్యక్తిగతంగా లేదా తిరుగు రశీదుతో కూడిన రిజిస్టరు పోస్టు ద్వారా లేదా ఈ-మెయిల్ ద్వారా ఈనెల తొమ్మిదో తేదీ వరకు వినతులు సమర్పించవచ్చునని పేర్కొన్నారు.

హత్యా... ఆత్మహత్యా?

ఇంటర్ విద్యార్థిని మృతిపై అనుమానాలు

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. స్నేహితురాలు తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పలేదన్న మనస్థాపంతో తనువుచాలించిందని కళాశాల యాజమాన్యం, పోలీసులు చెబుతుండగా... విద్యార్థిని ఆత్మహత్య చేసుకునే ముందు గ్రీన్ ఇంక్‌తో రాసిన లేఖ అనుమానాలను రేకిస్తోంది. సాధారణంగా విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్... రెడ్ ఇంక్‌నే ఉపయోగిస్తారు. మరోవైపు చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకునేంత మూర్ఖురాలు తన చెల్లి కాదని ఈ ఆత్మహత్య వెనుక కళాశాల యాజమాన్యం పాత్ర ఉందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... రూరల్ మండలం పరిధిలోని బళ్లారి రోడ్‌లో ఉన్న తేజ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థిని (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించడంతో స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆమె చదువుకుంటోంది. స్నేహితురాలు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పలేదని మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుందని కళాశాల యాజమాన్యం, పోలీసులు చెబుతున్నారు. అయితే విద్యార్థిని చనిపోయే ముందు రాసుకున్న ఆత్మహత్య లేఖ గ్రీన్ ఇంకెంతో రాయడం వివిధ అనుమానాలకు తావిస్తోంది. మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుందాం లేక ఎవరైనా ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారా అనే అనుమానాలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియలేదు. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉదయం ఆత్మహత్య చేసుకుంటే తమకు సాయంత్రం సమాచారం ఇచ్చారని ఈ మధ్యలో ఏం జరిగిందో తమకు తెలియలేదని బంధువులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను కళాశాల యాజమాన్యం పోలీసులకు అందజేసినట్లు తెలుస్తోంది.

పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు: రూరల్ సీఐ శేఖర్

విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించిన విషయాలు పోస్టుమార్టం నివేదికలో తెలుస్తాయని రూరల్ సీఐ శేఖర్ చెప్పారు. నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

4, 5 తేదీల్లో విజయవాడలో

ప్రపంచ నాస్తిక మహాసభలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఈనెల 4 ,5 తేదీల్లో విజయవాడలోని నాస్తిక కేంద్రంలో 12వ ప్రపంచ నాస్తిక మహాసభలు జరగనున్నాయి. గురువారం స్థానిక నాస్తిక కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహాసభల వివరాలను కన్వీనర్ డాక్టర్ జి. సమరం వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా నాస్తికుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతోందని, ప్రపంచంలో 20 దేశాల్లో 50 శాతానికి పైగా ప్రజలు నాస్తికత్వాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సెక్యులర్ భావాలు పెంపొందుతూ కులరహిత, మతరహిత సమాజం వైపు అడుగులు బలంగా పడుతున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం, సెక్యులరిజం పెరుగుతూ ఉంటే మరొక పక్క వీటిని అడ్డుకునేందుకు సనాతనవాదులు మతతత్వం, మూఢనమ్మకాల్ని పెంచి పోషిస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కులాంతర, మతాంతర సమాజాన్ని నిర్మించడానికి నాస్తికులు, హేతువాదులు, అభ్యుదయవాదులు, కమ్యూనిస్టులు, సోషలిస్టులందరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగే 12వ ప్రపంచ నాస్తిక మహాసభల్లో పాజిటివ్ ఎటిజం, క్రిటికల్ థింకింగ్, సెక్యులర్ యాక్షన్ అనే థీమ్ ని ప్రాతిపదికగా చేసుకొని అనేక ప్రసంగాలను, కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. 4వ తేదీ ఉదయం 11 గంటలకు తమిళనాడుకు చెందిన ద్రవిడార్ కజగం అధ్యక్షులు కే వీరమణి మహాసభలు ప్రారంభిస్తారు. ఈ సభలో ఆయనతో పాటు విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు ,ఐఏఎస్ అధికారి కామాల్ తౌరి, డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ దేవరాజు మహారాజు తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రెండవ రోజు ఉదయం మహాసభలు యూత్ సమ్మిట్ గా నిర్వహిస్తామని తెలిపారు. యువ సదస్సుని ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్ సంస్థ వ్యవస్థాపకులైన డాక్టర్ జయప్రకాష్ నారాయణ ప్రారంభించి... ప్రసంగిస్తారు. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు ముఖ్య అతిథిగా, మరికొందరు ప్రముఖులు గౌరవ అతిథులుగా సందేశాలిస్తారని తెలిపారు. విలేకరుల సమావేశంలో వికాస్ గోరా, నియంత, సకల, రష్మీ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీ ధృవతార బర్ధన్: జంగాల అజయ్ కుమార్



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: దేశంలో వామపక్ష రాజకీయాలను పదునెక్కించడంలో, వామపక్ష పార్టీల మధ్య ఐక్యతను పెంపొందించడంలో, కమ్యూనిస్టుల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయడంలో సఫలీకృతుడైన మహానేత ఏబీ బర్ధన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ శ్లాఘించారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ ధృవతార అన్నారు. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి బర్ధన్ తొమ్మిదో వర్ధంతి సందర్భంగా సీపీఐ గుంటూరు నగర సమితి అధ్వర్యంలో స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ 'ఏబీ బర్ధన్ తన జీవితం మొత్తం ఓ నిప్పు కణికలాగా మండిన కమ్యూనిస్టు తేజం. కార్మిక నాయకుడిగా, ఏఐటీయూసి జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు చేశారు. రాజకీయాలకతీతంగా దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలను ఏక తాటిపైకి తెచ్చారు. ఉత్తమ కార్మిక నేతగా వర్ధిల్లారు' అని అన్నారు. బర్ధన్ ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారని, బీహార్‌లో చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడు అయ్యారన్నారు. నేడు అనేక రాష్ట్రాల్లో కమ్యూనిస్టు నాయకులందరినీ రాజకీయంగా, సైద్ధాంతికంగా తీర్చిదిద్దిన మేధావి అని శ్లాఘించారు. ప్రపంచానికి కమ్యూనిజం అవసరాన్ని తెలియజేయడమే కాకుండా అందుకోసం కమ్యూనిస్టు పార్టీలకు దశ-దిశ నిర్దేశించిన గొప్ప నాయకుడు ఏబీ బర్ధన్ అని జంగాల అజయ్ కుమార్ అన్నారు. బర్ధన్ ఆశయ సాధన కోసం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఏబీ బర్ధన్ కార్మిక చట్టాల పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, ది ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్లా మరియదాసు, సీపీఐ నగర సమితి సభ్యులు విజయ్ కుమార్, నూతలపాటి చిన్న, చెవుల పున్నయ్య, పి.జగన్నాథం, బి.తిరుమల, యోగయ్య, ఇరిగినేని వెంకటేశ్వరరావు, వీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ పరీక్ష

మొబైల్ స్క్రీనింగ్ వ్యాన్ ప్రారంభించిన పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణా జిల్లా ప్రజలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష నిర్వహించేందుకుగాను మొబైల్ స్క్రీనింగ్ వ్యాన్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించారు. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి చొరవతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (భెల్) సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.2 కోట్ల నిధులతో ఈ వాహనాన్ని ఏర్పాటు చేసింది. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ దీనిని గురువారం ప్రారంభించారు. సామాజిక బాధ్యతతో ప్రజల కోసం ఈ వాహనాన్ని ఏర్పాటు చేసిన భెల్ కంపెనీ ప్రతినిధులను, చొరవ చూపిన ఎంపీ వల్లభనేని బాలశౌరిని పవన్ కల్యాణ్ అభినందించారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి తక్షణం చికిత్స అందించేందుకు ఈ వాహనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ వాహనంలో ఏడు రకాల పరికరాలు అమర్చారు. వారంలో మూడు రోజుల పాటు ఒక మండల పరిధిలోని గ్రామాల్లో సంచరిస్తూ అల్ట్రా సౌండ్, మెమోగ్రామ్, రక్త పరీక్షలు, ఎక్స్ రే, కెమికల్ అనాలసిస్, కొలస్కోపీ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయి. క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా ఏడాదికి 40 వేల మరణాలు అరికట్టవచ్చని వైద్య నిపుణులు తెలిపారు.

మంత్రుల కార్యాలయాల్లో గృహోపకరణాలకు రూ.15లక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని తొమ్మిది మంది మంత్రులతో పాటు ఎస్టీ కమిషన్ చైర్మన్ కార్యాలయాల్లో కర్టెన్లు తదితర గృహోపకరణాల కొనుగోలుకు నిధిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున రూ.15 లక్షలు విడుదలకు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో గృహోపకరణాల బడ్జెట్ రూ.27వేలు కాగా, ప్రస్తుతం దానిని రూ.1.50 లక్షలకు ప్రభుత్వం పెంచింది. మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, కె.అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టీజీ భరత్, డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు కార్యాలయాల కోసం ఈ నిధి మంజూరైంది. నిధులు తీసుకున్న నెల రోజుల లోపు మంత్రుల ఓఎస్‌డీలు లేదా పీఎస్‌లు గృహోపకరణాల కొనుగోలు చేసిన బిల్లులు జీఏడీకి అందజేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు పేర్కొన్నాయి.

ఆర్‌వీఎన్‌ఎల్‌తో విశాఖ పోర్టు అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సరుకు రవాణాకు వీలుగా ట్రాఫిక్ సమస్య నివారణకు రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందాన్ని విశాఖ పోర్టు కుదుర్చుకుంది. సమస్యను సమగ్రంగా పరిష్కరించే దిశగా రూ.300 కోట్ల విలువైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పోర్ట్ చైర్‌పర్సన్ డా ఎం.అంగముత్తు సమక్షంలో ఆర్వీఎన్ఎల్ ప్రతినిధులు గురువారం ఈ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ మేరకు పోర్టు కార్యదర్శి టి.వేణు గోపాల్ మీడియాకు తెలిపారు. తాజా ఒప్పందంలో భాగంగా సీ-హార్స్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 11 లెవెల్ క్రాసింగ్‌లను తొలగించి, సరుకు రవాణా సాఫీగా సాగించేలా దీనిని నిర్మించనున్నారు. పోర్టుకు వెళ్లి, వచ్చేందుకు ఇది ఉపయోగపడుతుందని పోర్టు అధికారులు తెలిపారు. వంతెన పొడవు 3.341 కిలోమీటర్లు. రోడ్డు వెడల్పు రెండు లైన్‌లకు ఏడు మీటర్లు, మూడు లైన్లకు 10.5 మీటర్లు చొప్పున ఉండనుంది. కార్యక్రమంలో విశాఖ పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేశ్ కుమార్ దూబే, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

'ఉక్కు' ఉద్యోగులకు వేతనాలు చెల్లించండి: రవీంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేసే 12 వేల మంది శాశ్వత ఉద్యోగులకు చెల్లించాల్సిన నాలుగు నెలల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కుటుంబాలు ఎలా జీవించాలని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే ఉక్కు పరిశ్రమను మూసివేసి వేతనాలు ఆపడం, విద్యుత్తు భారాలు మోపడం, అధికారులను, ఉద్యోగులను బదీలు చేయడం, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం, వారి గుర్తింపు కార్డులు పునరుద్ధరణ చేయకపోవడం వంటి వేధింపులు ఇందులో భాగమేనని రవీంద్రనాథ్ ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణలో భాగంగానే మిట్టల్ కంపెనీని రంగంలోకి తెచ్చారని, దానికి త్వరత్వరగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ఇతర అవసరాలకు తీసుకున్న భూములను మిట్టల్ కంపెనీకి ధారదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా ప్రశ్నించడానికే పార్టీ పెట్టానన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోరు మెదపడం లేదన్నారు. మిట్టల్‌కు మైన్స్ ఇచ్చినప్పుడు విశాఖ స్టీలుప్లాంట్‌కు ఇవ్వాలని కార్మిక వర్గం ఇంత కాలం పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం దగ్గర వారు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన రావులపల్లి నిలదీశారు. పబ్లిక్ రంగంలో ఉన్న విశాఖ ఉక్కును మూసి వేసి మిట్టల్‌కు వేల ఎకరాల భూములను పందారం చేయడానికి కుట్రలు జరుగుతుంటే ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి ఎన్నిసార్లు ఢిల్లీవెళ్లినా విశాఖ ఉక్కు పరిశ్రమ మాటే ఎత్తడం లేదన్నారు. ఈ నెల ఎనిమిదో తేదీన ప్రధాన మంత్రి విశాఖ వస్తున్నందున, ఈలోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే కార్మికవర్గ ప్రతిఘటనను మోదీ చవి చూడవలసి వస్తుందని రవీంద్రనాథ్ హెచ్చరించారు.

మోదీ మాటలన్నీ మోసమే

ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం: ఖడ్గే

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే విమర్శించారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి... సామాన్యుల జీవితాలను దుర్భరం చేసిందని దుయ్యబట్టారు. ఆర్థికపరమైన అనిశ్చితి పరిస్థితులను ఎలా పరిష్కరించాలో... ఏ విధంగా చక్కబెట్టాలో మోదీ ప్రభుత్వానికి అంతు పట్టడం లేదని ఖడ్గే విమర్శించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల తీవ్రతను తెలియజేసే ఏడు సూచికలను ఆయన గురువారం 'ఎక్స్'లో ప్రస్తావించారు. 'బంగారం రుణాలు 50 శాతం పెరిగాయి. బంగారం రుణ ఎన్‌పీఏల్లో పెంపుదల 30 శాతం మేర ఉంది. వినియోగశక్తి తగ్గింది. గత ఎనిమిది త్రైమాసికాల్లో గృహ అవసరాల కోసం కొనుగోళ్లు తగ్గాయి. కోవిడ్ మునపటి స్థాయికి ఇంకా చేరుకోలేదు' అని పేర్కొన్నారు. అలాగే కార్ల అమ్మకాల్లో వృద్ధి నాలుగేళ్ల కనిష్ఠానికి చేరిందన్నారు. కీలక రంగాల్లో జీతాల్లో పెంపుదలపై స్తబ్ధత నెలకొందన్నారు. ఇంజినీరింగ్, మ్యానుఫ్యాక్చరింగ్, ప్రాసెస్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఈఎంపీఐ) రంగాల్లో గత ఐదేళ్లలో వేతనాల్లో పెంపుదల వార్షిక సగటు వృద్ధి (కాంపౌండ్ యానువల్ రేట్) 0.8 శాతంగా ఉందని ఖడ్గే పేర్కొన్నారు. అధిక ద్రవ్యోల్బణం, దిగిరాని ఆహారోత్పత్తుల ధరలకుగాను కేంద్రాన్ని దుయ్యబట్టారు. గత ఎనిమిది త్రైమాసికాల్లో సగటున 7.1 శాతంగా ఆహార ద్రవ్యోల్బణం స్థాయి ఉన్నట్లు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.